

చదువు
రూ॥ 180/-
పేజీలు: 210
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం



PRAJAPAKSHAM ★

మధ్య ఆసియాలో సరికొత్త 'గ్రేట్ గేమ్'

త్రిముఖ వ్యూహంతో ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధం

భారత్‌తో పెట్టుకుంటే...

పాతాళంలో ఉన్నా వదలిపెట్టం

లోపలి పేజీల్లో



సంపుటి 28, సంచిక: 44 | ఆదివారం | 3-08-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## రాష్ట్రానికి క్రీడావిధానం లేక
# యువత పెడదారి

- ఇప్పటివరకు రాష్ట్రానికి క్రీడావిధానమే లేదు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ ఆవిష్కరణ
- క్రీడల్లో రాజకీయ జోక్యం తగ్గించడానికి పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం
- ఇది కాగితం కాదు.. బంగారు రేకులతో రాసిన పత్రం అని వ్యాఖ్య




ప్రజాపక్షం/హైదరాబాద్

మాదాపూర్‌లోని హెచ్ఐసిసిలో జరిగిన క్రీడా సదస్సులో 'తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ–2025'ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. హెచ్ఐసిసిలో జరిగిన తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, ప్రముఖ జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు, అర్జున్ అవార్డ్ ద్రోణాచార్య అవార్డు గ్రహీతలతో పాటు ఆయా క్రీడా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ క్రీడా విధానం కేవలం ఒక కాగితం కాదు.. బంగారు రేకులతో రాసిన పత్రం.. అని తెలిపారు.చాలా లోతుగా ఆలోచించి తెలంగాణ క్రీడా పాలసీ ని తీసుకువచ్చామని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి క్రీడా విధానం అంటూ ఏది లేదని,క్రీడా పాలసీ లేకపోవడం వల్ల యువత పెడదారి పడుతోందన్నారు. ఈ మధ్య కాలంలో తెలంగాణలో డ్రగ్స్, గంజాయి కేసులు బాగా పెరిగిపోయాయని, డ్రగ్స్, గంజాయి నియంత్రణకు తరువాయి 2లో



పోలవరం, బనకచర్ల
# అక్రమ ప్రాజెక్టులు

- వాటికి రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకం
- ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధం
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకిస్తుందని, ఈ అక్రమ ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎంతటి పోరాటానికై వెనకకుబోమని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి మరో సారి స్పష్టం చేశారు. శనివారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పోలవరం, బనకచర్ల లింక్ ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాలుగా వ్యతిరేకిస్తోందని, ఈ అంశానికీ సంబంధించి స్వయంగా తన లెటర్ హెడ్‌తో కేంద్రానికి లేఖలు రాశానని చెప్పారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్టును కేంద్ర పర్యావరణ శాఖతో పాటు గోదావరి నది మేనేజ్‌మెంట్ బోర్డు కూడా వ్యతిరేకించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. బనకచర్ల పై ప్రభుత్వ స్టాండ్ క్లియర్‌గా ఉందని, బిఆర్ఎస్ పబ్లిసిటీ కోసం నిరాధారమైన ఆరోపణలను చేస్తోందన్నారు. బిఆర్ఎస్‌వి అన్ని తరువాయి 2లో

553 మంది పంచాయతీ కార్యదర్శుల
# ఫేక్ అటెండెన్స్

- 15 మందిపై సస్పెన్షన్ వేటు
- మిగతా వారికి షోకాజు నోటీసులు
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన 47 మంది ఎంపిఒలపైనా చర్యలు




ప్రజాపక్షం/హైదరాబాద్

పంచాయతీ కార్యదర్శుల ఫేక్ అటెండెన్స్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలకు పూనుకున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాల్లో ఎంత మంది ఫేక్ అటెండెన్స్ నమోదు చేస్తున్నారనే విషయమై గ్రామ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆరా తీస్తోంది. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా విచారణను ప్రారంభించగా, ఇప్పటి వరకు 553 మంది తరువాయి 12లో

# యూరియాపై తప్పుడు లెక్కలు

- పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం అబద్ధాలాడడం రాష్ట్ర రైతాంగాన్ని అయోమయానికి గురిచేయడమే
- రాష్ట్రానికి కేటాయించింది 9.80 లక్షల మెట్రిక్ టన్నులే
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా యూరియా సరఫరాపై తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమని, ఇది రాష్ట్ర రైతులను అయోమయానికి గురిచేయడమేనని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించి, పార్లమెంట్ లో మాత్రం 20.20 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని చెప్పడం శోచనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో యూరియా పరిస్థితులపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్‌కు కేంద్ర రసాయనాలు, ఎరువుల విభాగం రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల లేఖను జతపరిచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం లేఖ రాశారు. ఖరీఫ్ 2025 గాను రాష్ట్రానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించారని, ఇందులో నెలవారీగా ఏప్రిల్ నుండి జులై వరకు కేటాయింపుల ప్రకారం 6.60 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేయాల్సి ఉండగా, కేంద్రం 4.36 లక్షల తరువాయి 2లో

ప్రజ్వల్ రేవణ్ణకు
# యావజ్జీవం



- అత్యాచారం కేసులో శిక్ష ఖరారు చేసిన ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు
- రూ. 10 లక్షల జరిమానా
- బాధితురాలికి రూ. 7 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశం

**బెంగళూరు :** ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన కేసులో హాసన మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఈ శిక్ష ఖరారు చేసింది. రూ.10లక్షల జరిమానాను విధించింది. బాధితురాలికి రూ.7లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. ఇటీవల విచారణను తరువాయి 12లో

## ఆ ఇద్దరూ
# అబద్ధాలకోరులే

- పార్లమెంట్‌లో ప్రధాని మోదీ, అసెంబ్లీలో కెసిఆర్ చెప్పినవి, చెప్పేవన్నీ అబద్ధాలే
- ట్రంప్‌కు మోదీ బానిసత్వం దేశ ప్రజలందరికీ అవమానకరం
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ



ప్రజాపక్షం/హైదరాబాద్

అబద్ధాలను అందంగా, అవలీలగా చెప్పే వ్యక్తులు ఈ దేశంలో ఇద్దరే ఇద్దరు ఉన్నారని, వారిలో ఒక్కరు దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, మరొకరు మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్.కె.నారాయణ అన్నారు. పార్లమెంట్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అసెంబ్లీలో కెసిఆర్ చెప్పినవి, చెప్పేవన్నీ అబద్ధాలేనని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నారాయణ మీడియాతో మాట్లాడుతూ అమెరికా అధ్యక్షులు ట్రంప్‌కు ప్రధాని మోదీ బానిసత్వం చేయడం దేశ ప్రజలందరికీ అవమానకరమన్నారు. పహల్గామ్ ఉగ్రవాదులను పార్లమెంట్ సమావేశాలకు ఒక్కరోజు ముందుగా హతమార్చి, వారి శవాలను అడ్డం పెట్టుకుని సభలో తప్పించుకునేందుకు మోదీ ప్రయత్నించారన్నారు. కశ్మీర్‌లో 7.50 లక్షల భద్రతాసిబ్బందిని మోహరించినప్పటికీ ఉగ్రవాదులను పట్టుకోకుండా ఇంత కాలం ఏం చేశారని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. మోదీ గ్రాఫ్ పడిపోవడంతో ఆర్ఎస్ఎస్ 75 ఏళ్ల వరకే పదవీ కాలం అనే అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిందని, అయితే ప్రధానిగా ఎవరు ఉన్నప్పటికీ, తమకు సంబంధం లేదని, దేశ భద్రత, ఆర్థిక వ్యవస్థ పట్ల కేంద్ర ప్రభుత్వ విధానాలలో తరువాయి 12లో




## సిపిఐ రాష్ట్ర మహాసభల్లో
# భవిష్యత్ ఉద్యమాల రూపకల్పన

రంగారెడ్డి జిల్లా మహాసభలో కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గాజుల రామారంలో ఆగస్టు 20 నుండి 22 వరకు జరిగే సిపిఐ రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రజల ఆర్థిక స్థితిగతులపై సమగ్రమైన చర్చ జరుగుతుందని, భవిష్యత్తు ఉద్యమాలకు ఆ మహాసభ వేదిక కాబోతున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. కమ్యూనిజాన్ని, మార్క్సిజాన్ని అంతం చేయడం ఎవరి తరం కాదన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్ లో శనివారం సిపిఐ రంగారెడ్డి జిల్లా 17వ మహాసభ సిపిఐ జిల్లా నాయకులు పానుగంటి పర్వతాలు, ఎం.డి. ఫైమిదా బేగం, ఎం.ప్రభులింగంల అధ్యక్షతన జరిగాయి. మహాసభలకు ముఖ్య అతిథులుగా కూనంనేని, సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. మహాసభలో కూనంనేని ప్రసంగిస్తూ, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, అమిత్‌షా నాయకత్వంలోని కేంద్ర బలగాలను పెద్ద ఎత్తున మావోయిస్టులను ఏరివేసే లక్ష్యంతో ఎన్ కౌంటర్లు చేస్తున్నాయని విమర్శించారు. కమ్యూనిస్టులు లేకపోతే భారతదేశానికే కాదు, ప్రపంచానికే భవిష్యత్తు ఉండదని ఆయన అన్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి దేశంలో యువత, ప్రజాస్వామ్యవాదులు ఆలోచించి బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన అనేక వాగ్దానాలలో పూర్తిగా అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆయన తీవ్రంగా విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి. నరసింహ్మ మాట్లాడుతూ భవిష్యత్తులో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని తరువాయి 12లో



ఇద్దరు కేరళ నన్‌లకు
# షరతులతో బెయిల్

**న్యూఢిల్లీ :** మానవ అక్రమ రవాణాకు, బలవంతపు మత మార్పిడీలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో గత వారం ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టయిన ఇద్దరు కేరళ సన్యాసినిల కు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ)కు చెందిన ప్రత్యేక కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అందుకు ఇద్దరు సన్యాసినులు వారి పాస్‌పోర్టులను సరెండర్ చేయాలని, ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున పూచీకత్తు పెట్టాలని, ఒక్కొక్కరికి ఇద్దరు వ్యక్తుల చొప్పున ష్యూరిటీ ఇవ్వాలని కోర్టు షరతులు విధించింది. కాగా కేరళకు చెందిన ఆ ఇద్దరు సన్యాసినులు ముగ్గురు గిరిజన బాలికలను మతమార్పిడీ చేయించేందుకు ప్రయత్నించారని బజరంగ్ దళ్, హిందూవాహిని సంఘాల ప్రతినిధులు పోలీసులకు తరువాయి 12లో

## 2024 లోక్‌సభ
# ఎన్నికల్లో రిగ్గింగ్

- మావద్ద పూర్తి ఆధారాలున్నాయ్
- 10 నుంచి 15 సీట్లు తక్కువ వచ్చి ఉంటే మోదీ ప్రధాని అయ్యేవారు కాదు
- దేశంలో ఎన్నికల వ్యవస్థ ఎప్పుడో చచ్చిపోయింది
- న్యాయ సదస్సులో విపక్షనేత రాహుల్‌గాంధీ
- దిగ్బంధనంలో రాజ్యాంగం : సోనియాగాంధీ



**న్యూఢిల్లీ :** భారత ఎన్నికల కమిషన్‌పై కాంగ్రెస్ పార్టీ మరోమారు మండిపడింది. ఇప్పటికే ప్రతిపక్షాలు బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టగా కాంగ్రెస్ తనదైన శైలిలో విరుచుకుపడింది. దేశంలో ఎన్నికల వ్యవస్థ ఎప్పుడో చచ్చిపోయిందని, 2024 లోక్‌సభ ఎన్నికలు రిగ్గింగ్‌కు గురయ్యాయని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతిలో ఎన్నికల కమిషన్ తోలుబొమ్మగా మారిందని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనేత ఆరోపించారు. శనివారం ఢిల్లీలో 'రాజ్యాంగ సవాళ్లు: దృక్పథాలు, మార్గాలు' అనే అంశంపై జరిగిన న్యాయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ, ఖర్గే పాల్గొని ప్రసంగించారు. మోదీ స్వల్ప మెజారిటీతో ప్రధాని కుర్చీలో కూర్చున్నారని, కొన్ని సీట్ల తేడా ఉంటే ఆయన అక్కడ ఉండేవారు కాదని రాహుల్‌గాంధీ అన్నారు. కర్ణాటకలోని ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ సేకరించిన డేటాను ఆయన ఉదహరించారు. అక్కడ పార్టీ ఓటర్ల ఫొటోలు, పేర్లను భౌతికంగా తనిఖీ చేయగా, మొత్తం 6.5 లక్షల ఓటర్లలో 1.5 లక్షల ఓట్లు బోగస్ అని తేలిందన్నారు. తాము ఈ డేటాను విడుదల చేసినప్పుడు ఎన్నికల వ్యవస్థ ద్వారా వెళ్ళబోయే షాక్ వేవ్ ఎలా ఉంటుందో చూస్తారన్నారు. ఇది అక్షరాలా అణు బాంబు లాంటిది అని మరోసారు ఉద్ఘాటించారు. అయితే భారతం దేశంలో ఎన్నికల వ్యవస్థ ఏనాడో చచ్చిపోయిందన్నారు. భారత ప్రధానమంత్రికి చాలా తక్కువ మెజారిటీ ఉందన్నారు. 10–15 సీట్లలో రిగ్గింగ్ జరిగి వాస్తవ గణాంకాలు 70–80 నుండి 100 వరకు తరువాయి 2లో

## వచ్చే ఎన్నికల్లో
# బిజెపికి 150 మించవు

మోదీని కుర్చీ నుంచి రాహుల్ దింపేస్తారు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రాహుల్ గాంధీ నేతృత్వంలోనే పోరాటం చేస్తామని, వచ్చే ఎన్నికల్లో బిజెపికి 150 ఎంపి స్థానాలకు మించి ఒక్క సీటు రాబోదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లోఎఐసిసి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కానిస్టిట్యూషనల్ ఛాలెంజెస్ పర్స్పెక్టివ్స్‌అండ్ పాథ్వేస్ సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ మోదీ లేకుంటే బిజెపికి 150 సీట్లు కూడా రావని, ఆ పార్టీకి చెందిన ఎంపి నిశికాంత్ దూబే ప్రకటించారని, దూబే తన డైరీలో రాసి పెట్టుకోవాలని, వచ్చే ఎన్నికల్లో బిజెపికి 150 సీట్లకు మంచి ఒక్క స్థానం కూడా ఎక్కువగా రాబోదని చెప్పారు. ఆర్ఎస్ఎస్, వాజ్‌పేయ్‌లు మోదీని ప్రధాని సీటు నుంచి దింపలేకపోయారని, కానీ వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ మోదీని ప్రధాని కుర్చీ నుంచి తరువాయి 2లో

అనారోగ్యంతో కాలేజీకి రాకపోతే
# పరీక్షలకు అనుమతించండి

హైకోర్టు ఉత్తర్వులు



ప్రజాపక్షం/హైదరాబాద్

అనారోగ్యం వల్ల ఎవరైనా విద్యార్థికి హాజరు శాతం తగ్గితే దానిని తీవ్రంగా పరిగణించొద్దని ఉన్నత విద్యా శాఖకు హైకోర్టు ఆదేశించింది. ఇంజనీరింగ్ పరీక్షలు రాసేందుకు పిటిషనర్‌ను అనుమతించాలంది. ఇంజనీరింగ్ మూడో ఏడాది (2024–25) సెకండ్ సెమిస్టర్ పరీక్షలు రాయకుండా కాలేజీ ఇచ్చిన సర్క్యులరును మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కీసరలోని గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ టెక్నాలజీ (అటానమస్) బీటెక్ విద్యార్థిని కొండపర్తి మాన్విత హైకోర్టును ఆశ్రయించారు. దీనిని జస్టిస్ కె.శరత్ విచారించి పై విధంగా ఉత్తర్వులు తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## 39 మంది అక్రమ నివాసితులు అమెరికా నుండి బంగ్లాకు తరలింపు



**ఢాకా:** అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 39 మంది బంగ్లాదేశీ జాతీయులను ట్రంప్ ప్రభుత్వం ఢాకాకు తరలించింది. ఎలాంటి అధికారిక పత్రాలు లేకుండా వీరంతా అక్రమంగా అమెరికాలో పనిచేస్తున్నారని పేర్కొంటూ 39 మందిని తిరిగి బంగ్లాదేశ్‌కు తరలించింది. వీరంతా శనివారం ఉదయం ఢాకాలోని హజ్రత్ షాజలాల్ విమానాశ్రయంలో దిగారు. ట్రంప్ ప్రభుత్వం గడచిన జనవరిలో అధికారం చేపట్టినప్పటినుండి ఎలాంటి అధికారిక పత్రాలు లేని వలస ప్రజలపై ఉక్కుపాదం మోపింది. లక్షలమందిని వివిధ దేశాలకు తరలించడంలో భాగంగా 39 మంది బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చారు.

# సమాచార యుద్ధంలో ఇజ్రాయెల్ ఓడిపోతోంది

బెంజమిన్ నెతన్యాహూ

**జెరూసలేం:** ఇజ్రాయెల్ ఏకకాలంలో ఎనిమిదివైపులా యుద్ధం చేస్తోందని ఆ దేశ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ చెప్పారు. జెరూసలేంలో ఎవాంజెలికల్ క్రిస్టియన్ ఆడియన్స్‌ను ఉద్దేశించి నెతన్యాహూ మాట్లాడుతూ, సమాచార యుద్ధంలో ఇజ్రాయెల్ ఓడిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయస్థాయిలో ప్రధాన పత్రికలన్నీ ఇజ్రాయెల్‌ను ఒక దుర్మార్గదేశంగా చిత్రీకరిస్తున్నాయని, గాజాలో ఎముకలగూడుగా ఉన్న పిల్లల ఫోటోలను మొదటి పేజీల్లో ప్రచురిస్తున్నాయని, ప్రజలు ఆకలి చావులు ఛస్తున్నారని రాతలు రాస్తున్నాయని మండిపడ్డారు. గాజాలో తీసిన ఫొటోలను తమకు అనుకూలంగా కొన్నిగా మార్పులు చేర్పులు చేసి ప్రచురిస్తున్నారని ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌లు ఈ ఫోటోలు చూసి తమ ప్రభుత్వ మౌలిక విధానాలను మార్చుకుంటున్నారన్నారు. గతవారంలో 28 దేశాలు ఒక ఉమ్మడి ప్రకటన చేస్తూ, గాజాలో తక్షణం కాల్పుల విరమణ జరగాలని, ఐక్యరాజ్యసమితి భాగస్వామ్య సంస్థల నేతృత్వంలో ప్రజలకు ఆహార పంపిణీ జరగాలని పిలుపు ఇచ్చాయి. ఒకవైపు ఇరాన్‌తో, మరోవైపు గాజాలోని హమాస్ ఉగ్రవాదులతో, లెబనాన్‌లోని హిజ్బుల్లా ఉగ్రవాదులతో, యెమెన్‌లోని హౌతీ ఉగ్రవాదులతో, వెస్ట్‌బ్యాంక్‌లోని హింసాత్మక ముఠాలతో, ఇంకో వైపు సిరియాతో, ఇరాక్‌తో కూడా బహుముఖాలుగా పోరాటం చేస్తోందని, ఈ ఏడు వైపులా పోరాటంతోపాటు కొత్తగా సత్యంకోసం ఎనిమిదో కోణంలో పోరాటం చేస్తోందని అన్నారు. అంతర్జాతీయ పత్రికలన్నీ ఇజ్రాయెల్ దేశాన్ని మానవత్వంలేని రాతిగుండెగల దేశంగా, గాజాను ఆక్రమించుకునే దేశంగా చిత్రీకరిస్తున్నాయని, ఈ సమాచార యుద్ధంలో ఇజ్రాయెల్ ప్రభుత్వం ఓడిపోతోందన్నారు.





ఇజ్రాయెల్ సాహిత్యవేత్త గ్రోస్‌మన్

**గాజాలో సామూహిక హత్యాకాండ**

గాజాలో కరువు పరిస్థితులు కొత్త దశకు చేరుకున్నాయని, ప్రజలు ఆహారం ఒకరికంటే మరొకరు ముందుగా సంపాదించుకోవడంకోసం పరస్పరం పోరాటం చేస్తున్నారని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఆకలి కేకలు పెట్టే అమాయక ప్రజలను ఆహార కేంద్రాలవద్ద అమానుషంగా తుపాకులతో కాల్చి చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ అమానుష హత్యలను ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండించింది. అదేవిధంగా ఇటీవలికాలంలో యూరోపియన్ యూనియన్ దేశాలు కూడా ఏకగళంతో గాజాలో పాలస్తీనా ప్రజలపట్ల సానుభూతి ప్రకటిస్తూ, పాలస్తీనా స్వయంప్రతిపత్తికోసం డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ఇజ్రాయెల్‌కు చెందిన ప్రముఖసాహిత్యవేత్త, అనేక అవార్డుల గ్రహీత డేవిడ్ గ్రోస్‌మన్ కూడా గాజాలో సామూహిక హత్యాకాండ కొనసాగుతోందని ప్రకటించారు. గాజాలో పరిస్థితులతో తన హృదయం ముక్కలైపోయిందని ఆయన అన్నారు. తన హృదయం ముక్కలైపోయిందనే పదాన్ని ఉపయోగించేందుకు చాలా సంవత్సరాలుగా తాను ఇష్టపడలేదని, కానీ గాజా నుండి ప్రతి క్షణం వస్తున్న ఫోటోలను చూసిన తర్వాత ఈ పదాన్ని ఉపయోగించకతప్పడంలేదన్నారు. కాగా వాషింగ్టన్‌లో ట్రంప్ అధికారులు ఒక ప్రకటన చేస్తూ, రాజకీయ అధికారంకోసమే నెతన్యాహూ సుదీర్ఘ యుద్ధం చేస్తున్నారని తమ అధ్యక్షుడు నమ్ముతున్నారని శుక్రవారంనాడు పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెల నుండి గాజాలో ఆహార కేంద్రాలవద్ద వేచి ఉన్న ప్రజలను ఇజ్రాయెల్ సైన్యం కాల్చిచంపడం ప్రారంభించింది. ఇలా ఇప్పటివరకూ 1,783 మంది పిల్లలు,మహిళలు, ఇతర వయోజనులు మరణించారు. గాజాలో 22 నెలలుగా సాగుతున్న యుద్ధంలో ఇప్పటివరకూ 60,400 మంది మరణించారు. హమాస్ వద్ద 50 మంది ఇజ్రాయెలీ పౌరులు బందీలుగా ఉన్నారు. వీరిలో కేవలం 25 మంది లోపే సజీవులుగా ఉన్నారని అంచనా.

## ఐదో తేదీన బంగ్లాదేశ్‌లో అధికారికంగా 'జులై డిక్లరేషన్'

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ఈనెల ఐదో తేదీన మహ్మద్ యూనుస్ తాత్కాలిక ప్రభుత్వం ''జులై డిక్లరేషన్'' చేయనున్నది. ప్రభుత్వం అన్నిపార్టీలతో చర్చించి 'జులై డిక్లరేషన్' ముసాయిదాను రూపొందించింది. దీనిపై వచ్చే మంగళవారం సాయంత్రం అధికారిక ప్రకటన చేయనున్నది. జాతీయ ఏకాభిప్రాయానికి అనుగుణంగా ఈ జులై డిక్లరేషన్ ప్రభుత్వం చేస్తుందనిఇ యూనుస్ ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. ఇంతకుముందు యూనుస్ ప్రెస్ ప్రతినిధి మహఫుజ్ అలమ్ గడచిన జనవరి తొమ్మిదోతేదీన ఒక ప్రకటన చేస్తూ, ఎస్ ఎ డి (స్టూడెంట్స్ ఎగెనెస్ట్ డిస్క్రిమినేషన్) ఉద్యమం జులై డిక్లరేషన్‌ను రూపొందించడంకోసం అన్ని రాజకీయపార్టీలమధ్య ఏకాభిప్రాయ సాధనకు ఒక చోదకశక్తిగా మాత్రమే ప్రభుత్వం పనిచేస్తుందని, దీనిని ప్రభుత్వం రూపొందించబోదని చెప్పారు. 2024 జులైలో బంగ్లాదేశ్‌లో ఉద్యోగాల్లో కోటాలో సంస్కరణల ఉద్యమంగా ప్రారంభమై నిరసనగా ప్రారంభమై చివరకు జులై తిరుగుబాటుగా, విద్యార్థుల ఉద్యమంగా రూపుదాల్చి ప్రభుత్వ పతనానికి దారితీసింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు,ప్రజలతోపాటు దీనితో సంబంధం ఉన్న అందరి సమక్షంలోనూ ప్రభుత్వం 'జులై డిక్లరేషన్' ప్రకటించనున్నది. జులై ఉద్యమం చివరిరోజుల్లో గత ఏడాది డిసెంబరులో ఎస్ఎడి (వివక్షను వ్యతిరేకించే విద్యార్థులు) చేసిన డిమాండ్ మేరకు ఈ ముసాయిదా ప్రకటనను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఎస్ ఎ డి–జతియా నాగరిక్ కమిటీ (జెఎన్‌సి)లు కలిసి నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్ సి పి)ని ఏర్పాటు చేశాయి. ఈ విధంగా బంగ్లాదేశ్ చరిత్రలో మొదటిసారి విద్యార్థులు, ప్రజల ఉద్యమం ద్వారా ఒక రాజకీయపార్టీ ఆవిర్భవించింది. ఈ రాజకీయపార్టీ కూడా మహ్మద్ యూనుస్ తాత్కాలిక ప్రభుత్వానికి అనుకూలమైన విద్యార్థి నాయకుడు నహిద్ ఇస్లాం కనుసన్నల్లో ఆవిర్భవించింది. వాస్తవానికి చెప్పాలంటే హసీనాకు వ్యతిరేకంగా ఈ ''జులై ఉద్యమం'' ప్రారంభించడానికి కీలక సూత్రధారి, హసీనా రాజీనామా చేసి దేశం వదిలివెళ్ళిపోవడానికి ప్రధాన కారకుడు నహిద్ ఇస్లాం ప్రారంభించిన ఉద్యమమే. అదేవిధంగా ఈ ఉద్యమకాలంలో ఢాకాలోని రాయెర్ బజార్‌లోని ఇంటలెక్చువల్ గ్రేవ్ యార్డ్‌లో 114 మంది శవాలను పాతిపెట్టారు. ఉద్యమంలో మరణించిన ఈ త్యాగమూర్తులను గుర్తించే కార్యక్రమం కూడా ప్రారంభిస్తామని హోం వ్యవహారాల ఉన్నతాధికారి మహ్మద్ జహంగీర్ అలమ్ చౌధురి చెప్పారు.

## అమెరికాలో క్షీణించిన కొత్త ఉద్యోగాలు
# నిజం చెప్పినందుకు ఉన్నతాధికారిణిపై వేటు



**వాషింగ్టన్ :** ప్రపంచ దేశాలపై టారిఫ్‌ల భారాలు మోపి అమెరికా వాణిజ్యలోటు భర్తీ యుద్ధం ప్రారంభించిన ట్రంప్, ఉద్యోగాల సృష్టికి సంబంధించిన నిజం మాట్లాడిన అమెరికా ఆర్థికరంగ వ్యవస్థలకు చెందిన మహిళా ప్రధానాధిపతిపై శనివారంనాడు వేటు వేశారు. టారిఫ్‌ల విధింపు కారణంగానే అమెరికా స్టాక్ మార్కెట్ పతనమైందని, జులైనెలలో ఉద్యోగాల డేటా కుదించుకుపోయిందని చెప్పిన బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ (బిఎల్‌ఎస్) కమిషనర్ ఎరికా లీ మెక్ ఎంటార్ఫర్‌ను పదవి నుండి తొలగించారు. 20 ఏళ్ళు పైగా ఆమె ప్రభుత్వంలో పనిచేస్తున్నారు. 2023లో బిఎల్‌ఎస్ బాధ్యతలకు సెనేట్ ఆమెను ఏకగ్రీవంగా నామినేట్ చేసింది. గతనెలలో అమెరికాలో 73,000 కొత్త ఉద్యోగాలు వచ్చాయని, అదేసమయంలో నిరుద్యోగం 4.1 శాతం నుండి 4.2శాతానికి పెరిగిందని గణాంకాల నివేదిక ఇచ్చారామె. మే నెలలో సవరించిన ఉద్యోగాల హైరింగ్ 1.44 లక్షల నుండి 19,000కు చేరిందని పేర్కొన్నారు. ఈ హైరింగ్ జూన్ నెలలో 1.47 లక్షల నుండి 14,000కు చేరిందని పేర్కొన్నారు. ఇటీవలి సంవత్సరాలలో ఇదే అతి తక్కువ ఉద్యోగాల సృష్టి అని ఆమె నివేదికలో పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థ న్యాయబద్ధంగా పనిచేయడంలేదని ఎరిక్ మెక్ ఎంటార్ఫర్ చెప్పారని ట్రంప్ విమర్శించారు. కొత్త టారిఫ్‌ల విధానంవల్ల ఈ ఏడాది అమెరికా ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పుంజుకుంటుందని, ఉద్యోగాలు విపరీతంగా పెరుగుతాయని ట్రంప్ భారీ ఎత్తున ప్రచారం చేస్తున్న దశలో టారిఫ్‌ల ఉద్యమం ఉద్ధృతంగా సాగుతున్నవేళ జాబ్ డేటా కుదించుకుపోవడం ట్రంప్‌కు ఆందోళన కలిగించింది. బిఎల్‌ఎస్ తీరు ఆయనకు ఆగ్రహం రప్పించింది. ఎలాంటి ఆధారాలు లేకుండా ఎరికా ఎంటార్ఫర్ జాబ్ డేటాను తనకు అనుకూలంగా మార్చి అవిధేయమార్గంలో మోసపూరితంగా వ్యవహరించారని, తనను, రిపబ్లికన్లను ప్రజల్లో చెడ్డగా చూపించారని అందుకే ఆమెపై వేటు వేశానని సోషల్ మీడియాలో ట్రంప్ పోస్టింగ్ చేశారు. వైట్‌హౌస్ తీసుకున్న అసాధారణ చర్యల కారణంగా స్టాక్‌మార్కెట్లు పడిపోవడంతో డేటాను రాజకీయం చేయడం ద్వారా ట్రంప్ ప్రజల విశ్వాసాన్ని నాశనం చేస్తున్నారని కొందరు ఆరోపించారు. బలహీనమైన గణాంకాలు నమోదు కావడంతో అధికారిణిపై వేటు వేసిన చెడ్డ నాయకుడు ట్రంప్ అని సెనేట్ మైనారిటీ నాయకుడు చెక్ షుమర్ విమర్శించారు. పీటర్‌సన్ ఇనిస్టిట్యూట్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్ సీనియర్ ఫెలో జెడ్ కోల్కో స్పందిస్తూ, బిఎల్‌ఎస్ అధిపతి తొలగింపు చాలా తీవ్ర పరిణామాలకు దారితీస్తుందన్నారు. ఐతే ట్రంప్ తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ తన పోస్టింగ్‌ను నిర్ణయాన్ని సమర్థించేవారు ఎంతోమంది ఉన్నారన్నారు. అనేక దేశాలపై పది నుండి యాభైశాతం వరకూ ట్రంప్ టారిఫ్‌లు విధించడంతో ఈ డేటా వివాదం తలెత్తింది.

## ట్రంప్‌ను దెబ్బకు దెబ్బ తీస్తాం: బ్రెజిల్

**రియో డీ జనైరో:** ఎవ్వరిమీదా లేనంత భారీస్థాయిలో 50 శాతం సుంకాలు విధించిన డోనాల్డ్ ట్రంప్‌కు ఒక ఝలక్ ఇచ్చేందుకు బ్రెజిల్ సన్నద్ధమవుతోంది.ట్రంప్ అనేక దేశాలపై శుక్రవారం సుంకాలు విధించినప్పటికీ పొరుగు దేశం బ్రెజిల్‌పైనే దారుణంగా సుంకాలు విధించి భయపెట్టారు. ఆ దేశాధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో డసిల్వా శనివారం మాట్లాడుతూ, అమెరికాతో చర్చలకు తమదేశం ఎప్పుడూ సిద్ధంగా ఉందని, కానీ, ఇప్పుడు దెబ్బకు దెబ్బ తీస్తామని ప్రతిజ్ఞ చేశారు.చర్చల ద్వారా ఫలితాలు రాబట్టగలమని ఆశాభావంతో ఉన్నామన్నారు. కొన్ని వస్తువులపై అమలులోకి తెచ్చిన 50 శాతం సుంకాలపై దీటుగా సరైన స్పందన ఇచ్చేందుకు తమదేశం ప్రయత్నాలు చేస్తోందన్నారు. బ్రెజిల్ దేశ పౌరులు, వాణిజ్యసంస్థలు మాత్రమే అమెరికాతో మాకున్న సంబంధాలపై మార్గనిర్దేశం చేసే హక్కు కలిగి ఉన్నారన్నారు.

## ఎన్నికల్లో రిగ్గింగ్
(మొదటి పేజీ తరువాయి)

ఉంటే ఆయన దేశానికి ప్రధానమంత్రి అయ్యేవారు కాదని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో లోక్‌సభ ఎన్నికల్లో ఏవిధంగా రిగ్గింగ్ జరగబోతోంది, ఇప్పటికే జరిగిన రిగ్గింగ్‌ను కూడా ఎటువంటి సందేహం లేకుండా నిరూపించబోతున్నామన్నారు. రాజ్యాంగాన్ని రక్షించే, దానిని సమర్థించే సంస్థను తుడిచిపెట్టి స్వాధీనం చేసుకున్నారని చాలా స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఇంతకు ముందు తన వద్ద ఆధారాలు లేవని అందుకే గతంలో ఇలాంటి ప్రకటనలు చేయలేకపోయానని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. తన వద్ద 100 శాతం రుజువు ఉందని, వాటిని ఎవరికి చూపించానో వారు కుర్చీ నుంచి పడిపోయారని, అది ఎలా సాధ్యమవుతుందని అన్నారని, కానీ అది సాధ్యమే అక్షరాలా అది జరుగుతోందన్నారు. ఎన్నికల వ్యవస్థ గురించి తాను మాట్లాడుతున్నానని, ఏదో తప్పు జరిగిందనే అనుమానం తనకు ఎప్పుడూ ఉందన్నారు. '2014 నుండి ఏదో తప్పు జరుగుతోందని అనుమానం ఉంది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలపైనా అనుమానం ఉంది. రాజస్థాన్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదు, మధ్యప్రదేశ్‌లో ఒక్క సీటు కూడా రాలేదు, గుజరాత్‌లో ఒక్క సీటు కూడా రాలేదు... ఇది నాకు ఆశ్చర్యం కలిగించింది' అని ఆయన అన్నారు.

**సమాజాన్ని విభజిస్తున్న మోదీ**

మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ప్రధాని మోదీ సమాజాన్ని విభజించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పవిత్రమైన శ్రావణ మాసంలో ముఖ్యమైన అంశాలపై 'మౌన వ్రతం' (మౌన ప్రతిజ్ఞ) చేయాలని ఎంచుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ, బిజెపి పాలనలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, దానిని రక్షించడం ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త విధి అని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కేవలం చట్టపరమైన పత్రం కాదని, మన ప్రజాస్వామ్యానికి ఆత్మ అని మనందరికీ తెలుసని ఇది ప్రతి భారతీయుడికి న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం హక్కును ఇస్తుందన్నారు. 'కానీ నేడు రాజ్యాంగం ప్రమాదంలో ఉంది. అధికారంలో ఉన్న నాయకులు రాజ్యాంగాన్ని మార్చడం గురించి మాట్లాడుతున్నారు. 2024 ఎన్నికల్లో బిజెపి 400 సీట్లు గెలిచి ఉంటే, వారు రాజ్యాంగాన్ని మార్చి ఉండేవారు. కానీ ఇది దేశ ప్రజల బలం, '400 పార్' అని అంటున్న వారి ముఖం మీద గట్టి దెబ్బ కొట్టారు' అని ఖర్గే అన్నారు. ఇది కాంగ్రెస్ సాధించిన ఘనత అని ఆయన అన్నారు. ఈ ఘనత రాహుల్ గాంధీకి దక్కుతుందని, ఆయన రాజ్యాంగాన్ని విడిచిపెట్టకుండా దానిని కాపాడటానికి ప్రచారం ప్రారంభించారని ఖర్గే పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కింద బిహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు ఓటు హక్కును కోల్పోతున్నారని పేర్కొంటూ ఇసి పేదలు, అణగారిన వర్గాలు, మైనారిటీల ఓటు హక్కులను లాక్కోవాలని చూస్తోందని, లేకపోతే వారు బిజెపి పాలనతో విసిగిపోయి కాంగ్రెస్‌కు ఓటు వేస్తారని భయబడుతుందన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలలో ఓటర్లను మార్చారని ఆరోపిస్తూ, కర్ణాటకలోని ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లను ఎలా మార్చారో రాహుల్ గాంధీ వివరించినందున కాంగ్రెస్ వద్ద ఇప్పుడు 'రుజువు' ఉందని ఆయన అన్నారు. 'ఒక చిన్న గదిలో తొమ్మిది మంది ఓటర్లు, మహారాష్ట్రలోని ఒకే హాస్టల్‌లో తొమ్మిది వేల మంది ఓటర్లు ఎలా ఉంటారు? దీన్ని అర్థం చేసుకోవాలి. ఎన్నికల కమిషన్ మోదీ జీ కీలుబొమ్మనా అని ప్రశ్నించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మైనారిటీలు, దళితులపై వివక్ష ఒక సాధారణ అలవాటుగా మారిందని ఖర్గే ఆరోపించారు. ప్రధాని మోడీ ఎన్నికల సమయంలో తన ప్రకటనలతో సమాజాన్ని ధ్రువీకరించడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ చీఫ్ ఆరోపించారు. 'ఎన్నికల్లో ఆయన ఎప్పుడూ కోడి, మొఘలులు, మంగళసూత్రాల గురించి మాట్లాడుతారు. సమాజాన్ని విభజించడం గురించి ఎప్పుడూ మాట్లాడుతారు. దేశ ప్రజలు ఆయనను ఎన్నుకుని రాజ్యాంగాన్ని రక్షించడానికి ఎన్నుకున్నారు, కానీ ఆయన దానిని అణిచివేయడానికి పనిచేస్తున్నారు. రాజ్యాంగాన్ని ఎవరైనా అణిచివేస్తున్నారంటే అది ప్రధాన మంత్రి, బిజెపి అని ఆయన ఆరోపించారు. రాజ్యాంగ ప్రవేశిక నుండి 'సోషలిస్ట్, సెక్యులర్' అనే పదాలను తొలగించాలని బిజెపికి చెందిన వ్యక్తులు చెప్పారని, కానీ బిజెపి 'సోషలిస్ట్, సెక్యులర్' అనే పదాలను పార్టీ రాజ్యాంగంలో ఉంచిందని కూడా కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. బిజెపి–ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తులు సోషలిస్ట్ మరియు సెక్యులర్ అనే పదాలను తొలగించలేరు, ఎందుకంటే వారికి ఈ దేశ ప్రజలకు ఉన్నంత అధికారం లేదు అని ఆయన అన్నారు.

**నేను రాజును కాదు : రాహుల్**

కాగా, రాహుల్ గాంధీ ప్రసంగిస్తుండగా ఆయన మద్దతుదారులు నినదించారు. 'ఇస్ దేశ్ కా రాజా కైసా హో.. రాహుల్ గాంధీ జైసా హో' అని పలువురు నినదించగా దానికి రాహుల్ గాంధీ స్పందిస్తూ.. తాను రాజును కాదని.. కావాలని అనుకోవడం లేదన్నారు. అయినా పలువురు అలాగే నినాదాలు చేశారు. తాను రాజుగా మారాలని కూడా కోరుకోవడం లేదని.. రాజును వ్యతిరేకిస్తున్నానని.. తాను ఆ భావనకు కూడా వ్యతిరేకినన్నారు. రాహుల్ గాంధీ గతంలో ప్రధానిని ఉద్దేశించి 'రాజు'గా అభివర్ణిస్తూ ప్రజల గొంతుక వినడం లేదంటూ ఆరోపించారు.

### దిగ్బంధంలో రాజ్యాంగం : సోనియాగాంధీ

భారత రాజ్యాంగం దిగ్బంధించబడిందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ పేర్కొన్నారు. మన ప్రజాస్వామ్య గణతంత్రాన్ని శక్తివంతమైన కొద్దిమందికి సేవ చేసే దైవపరిపాలనా కార్పొరేట్ రాజ్యంతో భర్తీ చేయడం ద్వారా బిజెపి 'సైద్ధాంతిక తిరుగుబాటు' తీసుకురావాలని చూస్తోందని ఆమె ఆరోపించారు. 'రాజ్యాంగ సవాళ్లు –దృక్పథాలు, మార్గాలు' అనే అంశంపై రోజంతా జరిగిన జాతీయ న్యాయ సమావేశం సందర్భంగా ఆమె తన సందేశాన్ని పంపారు. పార్లమెంటులో, కోర్టులలో, వీధుల్లో రాజ్యాంగాన్ని అణగదొక్కే ప్రతి ప్రయత్నాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని, ప్రతి భారతీయుడి గౌరవాన్ని కాపాడటానికి ఇది కేవలం రాజకీయంగానే కాకుండా సైద్ధాంతిక నిబద్ధత అని నొక్కి చెప్పారు. 'నేడు, రాజ్యాం గం ముట్టడిలో ఉంది. స్వేచ్ఛ కోసం ఎప్పుడూ పోరాడని లేదా సమానత్వాన్ని సమర్థించని బిజెపి–ఆర్ఎస్ఎస్, ఇప్పుడు చాలా కాలంగా వ్యతిరేకిస్తూ వస్తున్న చట్రాన్ని కూల్చివేయడానికి తన శక్తిని ఉపయోగిస్తుంది' అని ఆమె అన్నారు. 'వారి సైద్ధాంతిక పూర్వీకులు మనుస్మృతిని కీర్తించారు, త్రివర్ణ పతాకాన్ని తిరస్కరించారు. అధికారంలో ఉన్నప్పుడు, వారు సంస్థలను నిర్వీర్యం చేశారు. అసమ్మతిని నేరంగా పరిగణించారు. మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్నారు. దళితులు, ఆదివాసీలు, ఒబిసిలు, శ్రామిక పేదలకు ద్రోహం చేశారు. ఇప్పుడు వారు అంబేద్కర్ సమాన పౌరసత్వ దృక్పథానికి మూల స్థంభాలు అయిన సోషలిజం, లౌకికవాదాన్ని తుడిచిపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది సంస్కరణ కాదు, కానీ శక్తివంతమైన కొద్దిమందికి సేవ చేసే దైవపరిపాలనా కార్పొరేట్ రాజ్యంతో మన ప్రజాస్వామ్య గణతంత్రాన్ని భర్తీ చేసే సైద్ధాంతిక తిరుగుబాటు' అని మాజీ కాంగ్రెస్ చీఫ్ ఆరోపించారు. భారత జాతీయ కాంగ్రెస్ త్యాగాలు, దార్శనికత ద్వారా రాజ్యాంగం రూపొందించబడిందని ఆమె పేర్కొంటూ, స్వాతంత్ర్యానికి ముందే, కాంగ్రెస్ 'భారతీయులతో, భారతీయుల కోసం' రాజ్యాంగాన్ని ఊహించిందని ఆమె అన్నా రు. సామాజిక, ఆర్థిక న్యాయం లేకుండా, రాజకీయ ప్రజాస్వామ్యం కేవలం ఒక అలంకరణ మాత్రమే అవుతుందని తాను హెచ్చరించానని ఆమె చెప్పారు.

## చెరువులు, కుంటల పరిరక్షణకు నీటి నిర్వహణ కమిటీల ఏర్పాటు
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో రైతు కమిషన్ భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో చెరువులు, కుంటల పరిరక్షణకు నీటి నిర్వహణ కమిటీలను ఏర్పాటు చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ విజ్ఞప్తి చేసింది. సచివాలయంలో శనివారం ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, గడుగు గంగాధర్, భవానీరెడ్డిలు భేటీ అయ్యింది. ఈ సందర్భంగా ఇప్పటివరకు రైతు కమిషన్ నిర్వహించిన కార్యక్రమాలను వివరించడంతో పాటు రాష్ట్రంలో చెరువులు, కుంటల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలను మంత్రికి కమిషన్ కమిషన్ ఛైర్మన్ సూచనలు చేశారు. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణకు వెంటనే నీటి నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా నీటి సంఘాలు వున్న అంశాన్ని గుర్తుచేశారు. గ్రామీణ స్థాయిలో రైతులు సంఘటితమై చెరువులను కాపాడుకునే వారని, ఐతే గత 10 ఏళ్ల కాలంలో రాష్ట్రంలో ఉన్న చెరువులు కుంటలు అన్యాక్రాంతమయ్యాయని వివరించారు. కొన్ని చోట్ల కబ్జాదారులు ఆక్రమించి లే ఔట్లు వేయడం, వాటర్ బాడీస్ కు వచ్చే క్యాచ్ మెంట్ ఏరియాల్లో భారీగా కాల్వలు దెబ్బతినడం, మాయమవడం జరిగాయని తెలిపారు. ఐతే ప్రధానంగా చెరువులు కుచించుకపోవడం, భూగర్భ జలాల నీటి మట్టాలు పడిపోయిన నేపథ్యంలో రాష్ట్రంలో చెరువులు కాపాడుకుపడానికి సమగ్రమైన పాలసీ ఉండాలని రైతు కమిషన్ మంత్రికి వివరించింది.. ఆ పాలసీని కమిషన్ రూపొందిస్తోందన్నారు. నిపుణులతో పాలసీకి సంబంధించి ప్రజెంటేషన్ మీటింగ్ త్వరలో కమిషన్ ఏర్పాటు చేయనుందని ఆ సమావేశానికి హాజరు కావాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డినికోరారు.

## అక్రమ ప్రాజెక్టులు
(మొదటి పేజీ తరువాయి)

గాలి మాటలేనని వారు ప్రభుత్వంలో ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకుంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

**కేంద్ర బిజెపితో పొత్తు ఉందని లోకేష్ ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే కుదరదు**

పోలవరం బనకచర్ల ప్రాజెక్టుపై ఎపిమంత్రి లోకేష్ వ్యాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్టు. అక్రమమని, కేంద్ర బిజెపితో టిడిపి పొత్తు ఉందని లోకేష్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఇది సరైందికాదని పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్య దేశమని, పొత్తు ఉంది కదా అని మాట్లాడితే కుదురదన్నారు.

**కాళేశ్వరం నివేదిక పై 4వతేదీన మంత్రివర్గంలో చర్చ :**

కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలకు సంబంధించి 650 పేజీల తో కూడిన జ్యుడిషియల్ కమిషన్ నివేదిక అందిందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం కమిషన్ రిపోర్ట్ అధ్యయన కమిటీతో సమావేశం కానున్నట్లు ఆయనవెల్లడించారు. 4వ తేదీన సోమవారం జరగనున్న మంత్రి వర్గ సమావేశంలో చర్చించాల్సిన అంశాలను ఈ సమావేశంలో చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## యువత పెడదారి
(మొదటి పేజీ తరువాయి)

ఈగల్ ఫోర్స్ ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. దేశంలో క్రీడలను ప్రోత్సహించకపోవడంవల్ల యువత డ్రగ్స్ కు అలవాటు పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ చైతన్యవంతమైన గడ్డ.. తెలంగాణ ఉద్యమంలో యువత ముందుండి పోరాడారు.. అలాంటి యువత ఇప్పుడు వ్యసనాల బారిన పడుతున్నారని అన్నారు. క్రీడల్లో తెలంగాణ ప్రపంచంతోనే పోటీ పడేలా క్రీడా పాలసీ ని తీసుకు వస్తున్నామని స్పష్టం చేశారు. క్రీడల్లో రాజకీయ జోక్యం తగ్గించడానికి పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో క్రీడా పాలసీ ఉంటుందన్నారు. క్రీడలతో పాటు వివిధ రంగాల్లో విజయవంతమైన వారితో బోర్డు ఏర్పాటు చేశామని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో పరిమితమైన పాత్ర పోషిస్తుందన్నారు. 1956లో జరిగిన ఒలంపిక్స్ లో నాలుగో స్థానం సాధించిన పుట్‌బాల్ జట్టులో హైదరాబాద్ కు చెందిన వారు 9 మంది ఉన్నారని, అజారుద్దీన్, వీవీఎస్ లక్ష్మ ణ్, రవికాంత్ రెడ్డి, సిరాజ్, నిక్కత్ జరీన్, దీప్తి లాంటి అనేక మంది క్రీడాకారులు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. సిరాజ్, నిక్కత్ జరీన్‌కు గ్రూప్ వన్ ఉద్యోగంతో పాటు హైదరాబాద్‌లో ఇంటి స్థలం ఇచ్చి ప్రోత్సహించామన్నారు. పారా ఒలంపిక్స్‌లో రాణించిన దీప్తికి కోటి రూపాయల నగదు బహుమతితో పాటు ఇంటి స్థలం ఇచ్చామని, చదువులోనే కాదు క్రీడల్లో రాణించినా రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తుందనే సందేశం ఇచ్చామని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల క్రీడా మైదానాలు ఫంక్షన్‌హాల్స్‌గా మారిపోయాయని, సన్బర్న్‌లాంటి ఈవెంట్స్‌కు వేదికగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోరట్స్ అకాడమీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న భారత దేశానికి ఒలంపిక్స్ లో ఒక్క గోల్డ్ మెడల్ రాకపోవడం దేశానికే అవమానం కాదా అని ప్రశ్నించారు. ఒలంపిక్స్‌లో దేశానికి 71వ స్థానం రావడం అందరూ ఆలోచించాల్సిన విషయమని అన్నారు. దక్షిణకొరియా లో ఒక్క స్పోర్ట్స్ యూనివర్సిటీ కి 16 బంగారు పతకాలు వచ్చాయి.. ఒక్క అమ్మాయికి 3 పతకాలు గెలుచుకుంది అని తెలియజేశారు. క్రీడలకు తెలంగాణను వేదిక చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని ఇందులో భాగంగానే విజన్ డాక్యుమెంట్ 2047 లో స్పోర్ట్స్ పాలసీకి ఒక ఛాప్టర్ కేటాయించామన్నారు. నేషనల్ గేమ్స్, కామన్వెల్త్‌గేమ్స్, వరల్డ్ మిలటరీ గేమ్స్‌ను నిర్వహించిన చరిత్ర హైదరాబాద్‌కు ఉందన్నారు. వచ్చే ఒలంపిక్స్ నిర్వహణకు సిద్ధమని మనం ప్రకటించాం.. కాని అందులో ఒక్క పతకం కూడా రాకపోతే మన మొహంఎక్కడ పెట్టుకుంటాం.గంజాయి, డ్రగ్స్ తీసుకునే వారు ఎంతటి పెద్దవారైనా ఈగల్ ఫోర్స్ వదిలిపెట్టదన్నారు. గంజాయి, డ్రగ్స్ తీసుకోవాలంటే భయం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2026లో ఖేల్ ఇండియా నిర్వహణకు అవకాశం ఇవ్వాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరామని తెలిపారు. అంతేకాకుండ ఒలంపిక్స్‌లో రెండు విభాగాల నిర్వహణకు సిద్ధమని కేంద్రానికి తెలిపామన్నారు. క్రీడలకు బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షం లో ప్రముఖ క్రీడాకారులు గగన్ నారంగ్, అభినవ్ బింద్రా, పలు స్పోర్ట్స్ అకాడమీలు పలు ఒప్పందాలు చేసుకున్నాయి. వివిధ క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు సిఎం నగదు బహుమతి అందజేశారు.

## బిజెపికి 150 మించవు
(మొదటి పేజీ తరువాయి)

దింపేస్తారని సిఎం ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీని ఓడించేందుకు,ఆయనను కుర్చీ నుంచి దింపేందుకు, రాజ్యాంగాన్ని రక్షించేందుకు రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ శ్రేణులన్నీ పోరాడతాయన్నారు. రెండు నెలల క్రితం ఆర్ఎస్ఎస్, సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ 75 ఏళ్ల నిండిన వారు కుర్చీ వదలాలని సూచించినప్పటికీ మోదీ తన ప్రధాని సీటును వదులుకునేందుకు సిద్ధంగా లేరని, అద్వాని, మురళీ మనోహర్ జోషికి వర్తించే నిబంధనలు మోదీకి వర్తించవా అని సిఎం ప్రశ్నించారు. భారత్ జోడో యాత్రలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోనికి వస్తే కుల గణన చేపడుతామని రాహుల్ గాంధీ హామీనిచ్చారని, ఆ హామీ మేరకే తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టి, దేశానికి తెలంగాణ మోడల్ ఇచ్చామని సిఎం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని పదే పదే బిజెపి నాయకులు ప్రశ్నిస్తున్నారని, ఈ దేశం కోసం గాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణ త్యాగాలు చేశారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# యూరియాపై తప్పుడు లెక్కలు
(మొదటి పేజీ తరువాయి)

మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందన్నారు. దీంతో రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొందని తెలిపారు. కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. యూరియా కొరతపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఉ. రేవంత్ రెడ్డి కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాకు లేఖలు కూడా రాశారన్నారు. పార్లమెంట్ లాంటి వేదికలలో కూడా తప్పుడు లెక్కలు సమర్పించడం రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బ తీయడమేనని మంత్రి లేఖలో పేర్కొన్నారు., జులై నెల వరకు కేటాయింపుల ప్రకారం సరఫరా కాని 2.24 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కలుపుకొని, ఆగస్టు నెలకు కేటాయించిన యూరియాను త్వరగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల లేఖలో కోరారు.

# అనుమతించండి
(మొదటి పేజీ తరువాయి)

జారీ చేశారు. పిటిషనర్ న్యాయవాది శ్రీకాంత్‌రెడ్డి వాదిస్తూ.. పరీక్ష రుసుము పిటిషనర్ చెల్లించారని, అనారోగ్య కారణంగా కాలేజీకి హాజరు కాకపోవడంతో మెడికల్ సర్టిఫికెట్లను సమర్పించినప్పటికీ దానిని పరిగణలోకి తీసుకోలేదని చెప్పారు. వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందన్నారు. హాజరీ 65 శాతం లేదని, 49.33 శాతమే ఉందంటూ సర్క్యులర్ జారీ చేశారన్నారు. వాదనల తర్వాత హైకోర్టు.. కాలేజీ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఇండ్ల నిర్మాణానికి కేంద్రంపై ఆధారపడలేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇండ్ల నిర్మాణానికి తాము కేంద్ర ప్రభుత్వంపైన ఆధారపడలేదని, కేంద్రం అనేక నిబంధనలతో కొర్రీలు పెడుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒక్కో ఇంటికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.72వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.52 లక్షలను కేంద్రం ఇస్తుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల వరకు ఇస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో తనను కలిసిన కొందరు జర్నలిస్టులతో ఆయన శనివారం ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.



**'తెలంగాణ చరిత్ర, ఉద్యమం, కళలు'పై పుస్తకావిష్కరణ**
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిఏ, డిప్యూటీ తహశీల్దార్ డాక్టర్ పైళ్ల నవీన్ రెడ్డి రచించిన తెలంగాణ చరిత్ర, ఉద్యమం, కళలు,సాహిత్యం బదవ ఎడిషన్‌ను మంత్రి పొంగులేటి శనివారం ఆవిష్కరించారు.

## ట్రంప్ కు మోదీ భయపడుతుండు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:**అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు భారత ప్రధాని నరేంద్రమోదీ భయ పడుతున్నాడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం మొయినాబాద్ మండల కేంద్రంలో జరిగిన సిపిఐ రంగారెడ్డి జిల్లా మహాసభలో జరిగిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ భారతదేశ ఎకానమీ డెడ్ ఎకానమీ అన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దానికి దీటుగా సమాధానం చెప్పే స్థితిలో మన ప్రధాని నరేంద్ర మోదీ లేడని కూనంనేని సాంబశివరావు తెలిపారు.

**సిఎం రమేష్ వ్యాఖ్యలపై కెసిఆర్ మాట్లాడాలి :** బిజెపిలో బిఆర్ఎస్ పార్టీ విలీనం చేస్తామన్న విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎంపి సిఎం రమేష్ చేసిన వ్యాఖ్యలపై బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు స్పష్టం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు అన్నారు. బ్రిటీష్ కాలంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం 10 గంటలకు పెంచడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కొన్ని అమలు చేయడం జరుగుతుందని, మిగతా వాటిని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులతో పాటు ఇతర బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు.

**కేంద్రాన్ని బిజెపి నాయకులు ఒప్పించాలి**
బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినప్పటికీ సుప్రీంకోర్టులో పక్షన పెట్టించిన బిసి బిల్లును కేంద్ర ప్రభుత్వంచేత రాష్ట్ర బిజెపి నాయకులు ఒప్పించాలని కూనంనేని సాంబశివరావు తెలిపారు. బిసి రిజర్వేషన్లలో ముస్లింలకు పది శాతం ఇవ్వరాదని చెబుతున్నారని, హిందువుల మాదిరిగానే ముస్లింలలోనూ వెనుకబడిన కుటుంబాలు ఉన్నాయని గుర్తు చేశారు.

**ఆపరేషన్ కగార్‌లో తెలంగాణ పోలీసులు :** దేశంలో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను కాల్చిచేస్తున్న కేంద్ర బలగాలకు తెలంగాణ రాష్ట్ర పోలీసుల సహకారం అందించడానికి ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. పాక్ ఉగ్రవాదులతో పోరాడి పీఓకే ని స్వాధీనం చేసుకోవాల్సిన కేంద్రప్రభుత్వం ఆ విషయాన్ని పక్కన పెట్టి, దేశానికి సంబంధించిన మావోయిస్టులను మాత్రం గడువుపెట్టి చంపేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను హతమార్చేందుకు చేపట్టిన ఆపరేషన్ కగార్ ఖమ్మం పరిసర ప్రాంతాలలో తెలంగాణ పోలీసులు పాల్గొంటున్నారని,అట్టి ఆపరేషన్‌లో తెలంగాణ పోలీసులు పాల్గొనకుండా రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చూడాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ఒరుగంటి యాదయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మారగోని ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.






## ఓట్ల తొలగింపు ప్రజాస్వామ్యంపై దాడే!

### ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భారీ ఎత్తున అమాయకుల ఓట్లను తొలగిస్తుందని ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ విధమైన చర్యలకు పూనుకోవడం శోచనీయమని ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ విమర్శించారు. జనహిత పాదయాత్రలో భాగంగా సంగారెడ్డిలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీహార్‌లో ఈ ఏడాది ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో సుమారు 65 లక్షల మంది అమాయకుల ఓట్లను తొలగించారని ఆమె తెలిపారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమీషన్ బిజెపి కనుసన్నల్లో నడుచుకుంటుందని ఆమె ఆరోపించారు. కేవలం ఎన్నికల కమీషన్ కాకుండా సిబిఐ,ఇడి, లాంటి సంస్థలను బిజెపి తన చెప్పు చేతుల్లో పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని విమర్శించారు. అయితే తమ నేత రాహుల్ గాంధీ దీనిని అడ్డుకుంటున్నారని, అమాయకులకు అండగా నిలుస్తున్నారని, తొలగించిన ఓట్లను తిరిగి జాబితాలో చేర్చేలా బీహార్‌లో మిగతా పార్టీలతో కలిసి ఉద్యమం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో తీసుకువచ్చిన 42 శాతం బిసి రిజర్వేషన్లను దేశవ్యాప్తంగా తీసుకురావాలన్నదే తమ అధినేత రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు.

**పథకాలను ప్రచారం చేస్తేనే ఎన్నికల్లో అనుకూల ఫలితాలు**
పథకాలను ప్రచారం చేస్తేనే ఎన్నికల్లో అనుకూల ఫలితాలు వస్తాయని, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో గ్రూపులుంటేనే మంచిదని పోటీతత్వం పెరుగుతుందని అయితే అవి తమ పరిధిని దాటొద్దని తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. సంగుపేటలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా పార్టీలో గ్రూపులను అందరూ వ్యతిరేకిస్తారని తాను అలా కాదని గ్రూపులున్న అవి పార్టీకి నష్టం చేయకుండా నడుచుకుంటే అది పార్టీకి లాభం చేకూరుస్తుందన్నారు. గత పది సంవత్సరాల కెసిఆర్ పాలనలో తెలంగాణను పూర్తిగా నాశనం చేశారని మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టారని విమర్శించారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లోను తమ ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అందుకని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థు లు విజయఢంకా మోగించేలా కార్యకర్తలు మరింత కష్టపడాలని ఆయన సూచించారు.

**పథకాలు అమలు చేయడమే కాదు.. విస్తృతంగా ప్రచారం చేసుకోవాలి : మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అయితే వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని అపుడే మనం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని సాధించగలుగుతామని మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ అన్నారు. ఇటీవలే తీసుకువచ్చిన 42 శాతం బిసి రిజర్వేషన్లను విస్తృతంగా ప్రచారం చేయాలని ఈ విషయమై జిల్లా స్థాయిలో ఒక వర్క్‌షాప్ నిర్వహించాలని ఆయన సూచించారు.

**జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రమదానం**
జనహిత కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు ఉదయం ఎడున్నర గంటల నుంచి జోగిపేటలోని నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాల్లో ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి వారు కాసేపు ముచ్చటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సమన్వయం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో ఎం.పి సురేష్ కుమార్ శేట్కర్, ఎమ్మెల్యే, సంజీవ రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్ రెడ్డి, కాట శ్రీనివాస్ గౌడ్, త్రిషా రాజనర్సింహ, చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఉజ్వలరెడ్డి, ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు, పిసిసి ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.



## ఎర్రజెండానే పేదలకు అండ... ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలి

### సిపిఐ జాతీయసమితి సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న అసమానతలు, కార్మికులపైదాడులు, రైతులకు అన్యాయం, విద్యార్థుల, నిరుద్యోగుల భవితవ్యం వంటి సమస్యల క్రమంలో ప్రజలపక్షంలో నిలబడి ఉద్యమించే పార్టీలు ప్రజాపక్షశక్తులు మరింత బలపడాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు చాడవెంకట్‌రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టుపార్టీ(సిపిఐ) జిల్లా మూడో మహాసభలు శనివారం స్థానిక శుభంగార్డెన్‌లో కొనసాగిన రెండోరోజు ప్రతినిధుల మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతినిధుల సభకు వార్ల వెంకటయ్య, బి.శ్రీనివాస్, వెంకటమ్మలు అధ్యక్షవర్గంగా నడిపించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎర్రజెండా పేదలకు అండ, దేశంలో సొత్తు కొందరిదే, శ్రమవందలకోట్లమందిదే. ఈ అన్యాయాన్ని ఎదుర్కొవాలంటే ప్రజలందరూ పోరాటానికి సిద్ధంగా ఉండాలన్నారు. వామపక్ష శక్తులుగా, సామాజిక న్యాయంకోసం నిరంతరం పోరాటం సాగించే పార్టీగా సిపిఐ ముందడుగు వేస్తుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ్మ ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లాప్రజల వ్యవసాయానికి జీవనాధారమైన మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని శ్రీశైలం ప్రాజెక్టుబ్యాక్ వాటర్‌పైన చేపట్టాలని డిమాం డ్ చేస్తూ కొల్లాపూర్ నుండి మహబూబ్‌నగర్ వరకు పాదయాత్రచేసి కలెక్టర్ కార్యాలయం ముట్టడించడం ధర్నాలు, రాస్తారోకోలు అప్పటి జిల్లావ్యాప్తంగా మండల కేంద్రాలలో అనేక దపాలుగా ఆందోళనలు నిర్వహించి, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని సాధించడంలో ముందువరుసలో నిలిచిన పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. వంద సంవత్సరాలుగా ప్రజలకోసం అనేక బలిదానాలు త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సభ్యులు హెచ్.ఆనంద్, ఫయాజ్, కేశవులుగౌడ్, డిహెచ్‌పిఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కొమ్ము భరత్, జిల్లాకార్యవర్గసభ్యులు నర్సింహ్మా, విజయుడు, ఇందిరమ్మ, ఈర్ల చంద్రమౌళి, పరుషరాములు, డాక్టర్ శ్రీనివాసు లు పాల్గొన్నారు.

### సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శిగా ఎస్ఎండి ఫయాజ్

**ప్రజాపక్షం/కల్వకుర్తి:** సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శిగా ఎస్ఎండి ఫయాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కల్వకుర్తి పట్టణం లోని శుభంఫంక్షన్ హాలులో ఆగస్టు 1,2తేదిలలో నిర్వహించిన జిల్లా తృతీయ మహాసభలలో నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని 30మంది సభ్యులతో ఎన్నుకున్నారు.



## ముస్లిం రిజర్వేషన్‌లను అంగీకరించేదిలేదు

### కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముస్లిం రిజర్వేషన్‌లను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేదిలేదని కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. రిజర్వేషన్‌లు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, బిజెపిపై బట్టకాల్చి మీద వేయాలని చూస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద శనివారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో వందరోజుల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పిందని, కానీ ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు అవుతున్న ఇంకా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇది బిసి రిజర్వేషన్ల కోసం కాదని, ముస్లింలకు మేలు చేసేదని విమర్శించారు. గతంలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తెలంగాణ రాష్ట్రంలో బిసి రిజర్వేషన్లను 32 శాతానికి కుదించారన్నారు. ఎంఐఎం చేతిలో కీలుబొమ్మగా ఉన్న కెసిఆర్ ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని అసెంబ్లీలో ప్రకటించారని గుర్తుచేశారు. 20 శాతం ఇళ్లలోకి వెళ్లి ఎందుకు సర్వే చేయలేదని ప్రశ్నించారు. ఎస్‌సి, ఎస్‌టిలలో జనాభా పెరిగిందని, బిసిల జనాభా తగ్గిందని లెక్కలు చెబుతున్నారన్నారు. 42 శాతం పూర్తిగా బిసిలకు రిజర్వేషన్లు దక్కాల్సిందేనని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు కింద ముస్లిం, క్రిస్టియన్‌లకు రిజర్వేషన్‌లు కల్పిస్తోందని తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం అన్ని బిసి సంఘాలు పోరాటం చేయాలని కోరారు. బిసిల హక్కులను కాంగ్రెస్ కాలరాస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు.

ఈటల రాజేందర్ మాట్లాడుతూ రిజర్వేషన్‌ల విషయంలో తమిళనాడు రాష్ట్రం ఆదర్శమన్నారు. ఆ రాష్ట్రం 21 మంది ఐఎఎస్ అధికారులతో కమిషన్ ఏర్పాటు చేసి, ఆర్టికల్ 340 ప్రకారం కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ 1952 ప్రకారం లెక్కలు తీసి, షెడ్యూల్9లో చేర్చిందన్నారు.



## కడుపులో కత్తులు పెట్టుకొని.. బిసి రిజర్వేషన్‌లు అడ్డుకునేందుకు రాజకీయాలు!

### బిజెపి నేతల ధర్నాపై మండిపడిన మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కడుపులో కత్తులు పెట్టుకొని బిసి రిజర్వేషన్‌లను అడ్డుకునేందుకు బిజెపి నేతలు రాష్ట్రంలో రాజకీయాలు చేస్తున్నారని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. బిసి రిజర్వేషన్‌లపై ధర్నా చేస్తున్న బిజెపి నేతలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రపతి ఆమోదం పొందాల్సిన ఈ బిల్లుపై బిజెపి కడుపులో కత్తులు పెట్టుకొని అమలును అడ్డుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసి తీరుతామని స్పష్టం చేశారు. 'ముస్లింల పేరు చెప్పి రిజర్వేషన్‌లు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బిజెపి నేతలు ధర్నా చేయాల్సింది హైదరాబాద్‌లో కాదు ఢిల్లీలో అన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రధాన మంత్రికి ఒక్క మాట చెప్పితే తెలంగాణలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు అమలవుతాయన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ నుంచి కులగణన, బిసిలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చట్టంచేసి గవర్నర్ ఆమోదం పొంది రాష్ట్రపతి పంపేవరకు తాము మా చిత్తశుద్ధి నిరూపించుకున్నామన్నారు.

ఈనెల 4న అందరం ఢిల్లీ వెళ్లుదాం రండి, మన రిజర్వేషన్లు సాధించుకుందామన్నారు. బిసి సంఘాలు, మేధావులు కదలాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉండి బిజెపి నేతలు ధర్నా చేస్తే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు సాధించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని భావిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. శాసన సభలో బిసిలకు రిజర్వేషన్లపై మద్దతు ఇచ్చి ముస్లింల పేరుమీద అడ్డుకుంటున్నారన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పక్కా బిసిల వ్యతిరేకి అని మంత్రి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తప్పులు ఉంటే సవరించి, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఆమోదింపజేయాలన్నారు. బలహీన వర్గా ల వ్యతిరేకి రాంచందర్ రావు చేసే ధర్నాలు మీరు పాల్గొని, మీరు కూడా బలహీన వర్గాల వ్యతిరేకిగా మారుతున్నారని విమర్శించారు.




## రిజర్వేషన్ల అమలుకు కేంద్రమే అడ్డు

### మంత్రి శ్రీధర్ బాబు సంచలన వ్యాఖ్యలు

**ప్రజాపక్షం/ముత్తారం:** రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్న కేంద్ర ప్రభుత్వం మాత్రం అడ్డుపడుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. శనివారం మంథని నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. వెనుక బడిన తరగతుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎప్పుడు కృషి చేస్తుందని కొనియాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒబిసి లకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పాస్ చేసి ఆమోదం కోసం రాష్ట్రపతికి పంపించినప్పటికీ ఇప్పటి వరకు ఆమోదం లభించలేదని అన్నారు. అదేవిధంగా బిసి రిజర్వేషన్ కోసం కేబినెట్ లో నిర్ణయించి ఆర్డినెన్స్ తెచ్చినప్పటికీ ఇంకా గవర్నర్ ఆమోదం లభించలేదని తెలిపారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఏపీ, ఎమ్మెల్యేలకు బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే బీసీ బిల్లును 9వ షెడ్యూల్ లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బిసి బిల్లు, ఆర్డినెన్స్ ఆమోదంలో జాప్యానికి నిరసనగా 5వతేదీ,6వ.7 తేదీలలో ముఖ్యమంత్రి అధ్యక్షతన దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించామని, గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ అప్పుడు బిసి రిజర్వేషన్ చట్టం చేయకుండా ఇవాళ మొసలి కన్నీరు కారుస్తూ రాజకీయ లబ్ధి కోసమే నిందలు, ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. వారికి బిసి రిజర్వేషన్‌ల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో జరిగే ధర్నాలో పాల్గొని బీసీ రిజర్వేషన్ బిల్లు కోసం తమతో కలిసి రావాలని డిమాండ్ చేశారు. తాడిచెర్ల గ్రామానికి చెందిన దళిత సోదరుడు దండు రమేష్ ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ ఆర్ ఈ జి ఎస్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గా నియమించడం దళితులకు దక్కిన గౌరవం అన్నారు.ఈ సందర్భంగా దండు రమేష్ ని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.



## చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడిన డాక్టర్ నమ్రత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో విస్తుపోయే విషయాలు మరిన్ని వెలుగులోకి వస్తున్నాయి. గోపాలపురం పోలీస్‌ల కస్టడీ విచారణలో డాక్టర్ నమ్రత చేసిన నేరాలు బయటపడుతున్నాయి. సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించినట్టు తెలిసింది. పేదింటి ఆడబిడ్డలకు ఉచితంగా ఫెర్టిలిటీ సేవలు అందిస్తామని మాయమాటలు చెప్పి నమ్మించినట్టు సమాచారం. పేద మహిళల ఆర్థిక అవసరాలను గుర్తించి, ఏజెంట్ ద్వారా వారిని ట్రాప్‌లో పడేసేవారని విచారణలో తేలినట్టు సమాచారం. ఒక ప్లాన్ ప్రకారం డెలివరీ సమయానికి ఏజెంట్లు దగ్గరుండి వారిని విశాఖపట్నం, విజయవాడ కేంద్రంగా డెలివరీలు చేయించేవారని తెలిసింది. డెలివరీ అయిన తర్వాత నవజాత శిశువును డబ్బులకు ఇచ్చేవారని, అలా నవజాత శిశువులను తీసుకొచ్చి చైల్డ్ ట్రాఫికింగ్ పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణ లో తెలింది. అక్రమంగా సంపాదించిన డబ్బులతో హైదరాబాద్, ఎపిలో ఫామ్ హౌస్, భవన సముదాయాలు నమ్రత కొనుగోలు చేసిందని, మియాపూర్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్, యూసఫ్ గూడతో పాటు చాలా ప్రాంతాల్లో భవనాలు కొనుగోలు చేసిందని విచారణ లో బయట పడింది.

**శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము**
**గూడెం గ్రామము, దండేపల్లి మండలము, మంచిర్యాల జిల్లా.**

**Rc.No.SSSD/132/2025,** (e-ప్రొక్యూర్మెంట్, సీల్డ్ టెండర్ & బహిరంగ వేలం ప్రకటన) **తేది: 02.08.2025**

ఇందుమూలముగా యావన్మందికి మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా! శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము ఆవరణములో **తేది: 01.09.2025 నుండి తేది: 14.06.2026 వరకు** 9 నెలల 14రోజులు **వివిధ లైసెన్స్ హక్కుల కొరకై** టెండర్ దారుల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలముల ద్వారా టెండర్లు కోరనైనది. ఆసక్తి గల వారు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పూర్తి వివరములకు https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు. ఇతర వివరములకు కొరకై దేవస్థాన కార్యాలయము నందు కాని సెల్ నెం. 7893052502 ద్వారా కాని సంప్రదించగలరు.

DIPR R.O. No. : 5927-PP/CL/ADVT/1/2025-26, Date: 02-08-2025 సం/- కార్యనిర్వహణాధికారి

**వ్యవసాయ మార్కెట్ కమిటీ, కార్యాలయము, హైదరాబాద్.**

నెం.వ్య.మా.క./హై/Tenders/2025-26, (టెండర్ నోటీసు) **తేది: 02.08.2025**

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్ పరిధిలో గల మహబూబ్ మాన్షన్ కాంప్లెక్స్, మలక్‌పేట్ మార్కెట్ కార్యాలయమునకు సంబంధించి అవసరమగు ప్రింటింగ్ అఫ్ తక్ పట్టి పుస్తకములు సరఫరా చేయుట మరియు మలక్ పెట్ మార్కెట్ యార్డు నందు వాహనముల ట్రాఫిక్ నియంత్రణ కొరకు ఒక సంవత్సరం కాలం పాటు కాంట్రాక్టు కొరకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి.

| క్రమ సంఖ్య | టెండరు పేరు | ధరావత్తు (EMD) రూ. | టెండరు షెడ్యూలు సరఫరా చేయు తేది మరియు సమయము | టెండరు షెడ్యూలు దాఖలు చేయు చివరి తేదీ మరియు సమయము | టెండరు తెరువబడు తేది మరియు సమయము |
|---|---|---|---|---|---|
| 1 | ప్రింటింగ్ అఫ్ తక్ పట్టి పుస్తకములు, సరఫరా చేయుటకు | Rs. 20,000/- | 06-08-2025 నుండి 07-08-2025 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4.00గంటల వరకు | 12-08-2025 రోజున మధ్యాహ్నం 12.00 గంటల వరకు | 12-08-2025 రోజున మధ్యాహ్నం 1.00 గంటలకు |
| 2 | మలక్‌పేట్ మార్కెట్ యార్డు నందు వాహనముల ట్రాఫిక్ నియంత్రణ కొరకు ఒక సంవత్సరం కాలం పాటు కాంట్రాక్టు కొరకు | Rs. 50,000/- | | | |

**నిబంధనలు:-**
1. టెండర్ షెడ్యూలు కొరకు లిఖితపూర్వ దరఖాస్తుతో పాటు, టెండర్ ఫారం ధర రూ. 3,000/- (రూపాయలు మూడు వేయిలు మాత్రమే) మరియు టెండర్ వారిగా ధరావత్తు (EMD) బాపతు రూపాయలను డి.డి.ల రూపేనా Selection Grade Secretary, Agril. Market Committee, Hyderabad గారి పేరున తీసిన వారికి మాత్రమే టెండర్ షెడ్యూల్ ఫారం ఇవ్వబడును. DD ల పై టెండర్ వేయువారి పేరున మాత్రమే ఉండవలెను, చెక్కులను తిరస్కరించబడును.
2. GST రిజిస్ట్రేషన్ మరియు ల్యాబ్ లేబర్ లైసెన్స్ ఉన్న కాంట్రాక్టర్లు లిఖితపూర్వక దరఖాస్తుతో టెండర్ ఫారం పొందగలరు.
3. ఏదేని ప్రభుత్వ సంస్థలో కనీసం (03) సంవత్సరములు పని చేసిన అనుభవం వుండాలి (అట్టి ధృవీకరణ పత్రములు జతచేయవలెను).

అసంపూర్తిగా మరియు అభ్యంతరములు ఉన్న టెండర్లు గాని చెక్కులు సమర్పించిన టెండర్ గాని, టెండర్‌దారు పేరున DD లేని వాటిని తిరస్కరించబడును మరియు ఎలాంటి కారణము చూపకుండా టెండర్ రద్దు చేయు అధికారము ఈ దిగువ సంతకముదారునకు కలదు. ఇట్టి విషయము నందు ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు. ఇతర వివరములకు కార్యాలయము పనిచేయు దినములలో ఉదయము 10.30 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్ నందు సంప్రదించవచ్చును.

సం/- ఉన్నత శ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, హైదరాబాద్.
DIPR R.O. No. : 5946-PP/CL/ADVT/1/2025-26, Date: 02-08-2025

## ప్రజలకు సౌకర్యంగా ఒకేచోట సేవలు

### కార్పోరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజలకు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ఒకే చోట సేవలను అందించేందుకు వీలుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించడంతో (రీఆర్గనైజేషన్) పాటు కార్పోరేట్ స్థాయిలో అత్యాధునిక సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో హైదరాబాద్ జిల్లాలో రెండు, రంగారెడ్డి జిల్లాలో మూడు, మేడ్చల్ జిల్లాలో మూడు చోట్ల, సంగారెడ్డిలోని పఠాన్‌చెరుతో కలిపి మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో కార్పోరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలను నిర్మించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. నూతన కార్యాలయాల కోసం ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ, కొత్త బిల్డింగ్‌ల నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులకు సూచించారు. అంతిమంగా ప్రజల సంతృప్తే ప్రధానమనే అంశాన్ని దృష్టిలో పెట్టుకుని పునర్వ్యవస్థీకరణ చేపట్టాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండ గా వాటిలో 37 మాత్రమే సొంత భవనాల్లో ఉన్నాయని, మిగిలినవి అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని, ఈ పరిస్థితిని మార్చడానికి అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో దశలవారీగా నిర్మించాలని యోచిస్తున్నామని వివరించారు. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో నాలుగు లేదా ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒకే చోట ఇంటిగ్రేటెడ్ కార్యాలయాన్ని నిర్మించాలని నిర్ణయించామని వివరించారు. ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పని తీరు మెరుగుపర్చడంతో పాటు పర్యవేక్షణ సులభమవుతుందని, అవినీతిని కూడా తగ్గించవచ్చని, కార్యాలయాల మధ్య పనిభారం సమానంగా ఉండడంతో పాటు దస్త్రాల ప్రాసెసింగ్ వేగవంతం అవుతుందని మంత్రి పొంగులేటి అన్నారు. మొదటగా హైదరాబాద్‌లోని గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను, గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంగా నిర్మిస్తున్నామన్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఒక రోల్ మోడల్ గా ఉంటుందని చెప్పారు. సిఎం రేవంత్ రెడ్డితో చర్చించి, బిల్డింగ్ నమూనాలకు తుది రూపునిస్తామని, వీలైనంత త్వరితగతిన ఈ భవనానికి శంకుస్థాపన చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.





# జనరల్
STATE & REGIONAL NEWS

## తీజ్ ఉత్సవాలకు రైతు కమిషన్ సభ్యులకు ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ కళాశాలలోని సరస్వతీ టెంపుల్ ముందు ఈనెల 6 వరకు జరగనున్న తీజ్ ఉత్సవాలకు హాజరు కావాలని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులకు ఆహ్వానం అందింది.హైదారబాద్ బిఆర్‌కె భవన్‌లో రైతు కమిషన్ కార్యాలయంలో శనివారం రైతు కమిషన్ సభ్యులు రాములు నాయక్, గడుగు గంగాధర్, భవానీ రెడ్డిలకు ఓయూ విద్యార్థులు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.





## హైదరాబాద్‌లో రేషన్ కార్డుల పండుగ

### జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా పాలన ప్రభుత్వంలో హైదరాబాద్ జిల్లాలో 55 వేల పైచిలుకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్, అంబర్‌పేట్, సికింద్రాబాద్ నియోజకవర్గాలలో నూతనంగా లబ్ధిదారులకు ఆయన రేషన్ కార్డులను పంపిణి చేశారు. ముషీరాబాద్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్, అంబర్‌పేట్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎంపి వి.హనుమంత రావు, సికింద్రాబాద్‌లో ఎమ్మెల్యే టి.పద్మారావు గౌడ్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనలతో కలిసి మంత్రి రేషన్ కార్డులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణ మాసం వచ్చే వరకు ఆషాఢ మాసంలో బోనాల పండుగ జరిగిందని, ఇప్పుడు శ్రావణ మాసంలో హైదరాబాద్‌లో రేషన్ కార్డుల పండగ జరుగుతుందన్నారు. రేషన్ కార్డులు పంపిణి నిరంతర ప్రక్రియ అని, ఎవరు ఎప్పుడైనా పేర్లు నమోదు చేసుకోవచ్చు అన్నారు. గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు కూడా రాలేదన్నారు. ఒక్క పేరు కూడా నమోదు కాలేదన్నారు. రాజకీయాలకు అతీతంగా రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. పౌరసరఫరాలు, హైదరాబాద్ జిల్లా రెవెన్యూ యంత్రాంగం, జిహెచ్‌ఎంసి సమన్వయంతో రేషన్ కార్డుల పరిశీలన నడుస్తుందన్నారు. ఇంకా లక్ష రేషన్ కార్డుల పరిశీలన కొనసాగుతుందని చెప్పారు. రాష్ట్రంలో పెద్దలకు మాత్రమే పరిమితమైన దొడ్డు బియ్యం నుండి పేదవారికి సన్న బియ్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




### అభ్యర్థితో సంబంధం లేకుండా..

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

### కార్యకర్తలకు మంత్రి పొన్నం పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అభ్యర్థితో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పిజెఆర్ కమ్యూనిటీహాల్‌లో శనివారం సోమాజిగూడ డివిజన్ పార్టీ బూత్ స్థాయి ఇన్‌చార్జ్‌లు, ముఖ్య కార్యకర్తలతో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు, గ్రంథాలయ చైర్మన్ రియాజ్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే చనిపోయారని, అక్కడ అభివృద్ధి చేసుకోవాలని అధికార కాంగ్రెస్ పార్టీని ప్రజలు గెలిపించారన్నారు. జూబ్లీహిల్స్‌లో కూడా ఆకస్మత్తుగా జరిగిన సంఘటనల వల్ల ఉప ఎన్నిక వచ్చిందన్నారు. ఈ ఉప ఎన్నిక జూబ్లీహిల్స్ రూపురేఖలు మారుస్తుందన్నారు. అందరం కలిసి మెలిసి ఐక్యంగా ఏకలవ్యుడు గురి పెట్టిన విధంగా మనం జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కోరారు. ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేస్తుందని, రేషన్ కార్డులు ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం పంపిణి చేస్తున్నామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500కి గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని వివరించారు. 5 వేల రేషన్ కార్డులు జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఇచ్చామన్నారు. ఎవరికైనా రేషన్ కార్డులు రాకపోతే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందకపోతే సమాచారం ఇవ్వాలన్నారు. ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకరావాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఎలా కట్టాలని ఆలోచన చేస్తున్నామన్నారు. గతంలో సోమాజిగూడలో ఉపాధి ఉంటే కొల్లూరులో ఇల్లు కట్టారన్నారు. ఎక్కడ ఉపాధి ఉంటే అక్కడ ఇళ్లు కట్టాలన్నారు. ప్రతి రోజు కాంగ్రెస్ గెలుస్తుందని ఇంటింటికి ప్రభుత్వ పథకాలు ప్రచారం చేయాలని సూచించారు. కాంగ్రెస్ గెలుపు కోసం అందరం కలిసి ఐక్యంగా పని చేస్తామని మాటా ఇవ్వాలన్నారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా గెలుస్తుందన్నారు. ఈ సమావేశంలో స్థానిక కార్పొరేటర్లు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజలు గాంధీభవన్‌ను దేవాలయంగా భావిస్తున్నారు

### ఎంఎల్‌ఏ బాలునాయక్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజలు గాంధీ భవన్ ను దేవాలయంగా భావిస్తున్నారని ఎంఎల్‌ఏ బాలునాయక్ పేర్కొన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సిఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ప్రజా వినియోగ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు. స్థానికులు, ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి అక్కడిక్కడే ఆయా శాఖల అధికారులతో మాట్లాడటం జరిగిందన్నారు. ప్రజా పాలనలో ప్రజా సమస్యల పరిష్కారం ధ్యేయంగా కృషి చేస్తున్నామని తెలిపారు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వంలో ప్రజలు సమస్యలను ఏకరువు పెట్టుకోవడానికి ఎలాంటి సౌకర్యం కల్పించలేదని తెలిపారు.బిసిలను మోసం చేసిందే బిజెపి పార్టీ అని దుయ్యబట్టారు. రాష్ట్ర బిజెపి అధ్యక్ష పదవితో బిసిల పట్ల ఆ పార్టీ చిత్త శుద్ధి తేలిపోయిందన్నారు. బిజెపి అధ్యక్షుడు రామచంద్ర రావు ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదన్నారు. బనక చర్ల ప్రాజెక్టు బిఆర్‌ఎస్ హయంలో ప్రారంభించారని, నీటి వాటాను తాకట్టు పెట్టింది బిఆర్‌ఎస్ నేతలేనని అన్నారు.ఈ సమావేశంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణ లంబాడిలు జీవితాంతం ఇందిరాగాంధీ గారికి రుణపడి ఉంటామని అన్నారు. కెసిఆర్ మరో సీతయ్యలా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతిపక్ష నేతగా ప్రతిపక్ష నేతగా కెసిఆర్ ప్రతినెల 2 లక్షల 75 వేల రూపాయలు తీసుకుంటున్నాడని,18 నెలలో ఆయన తీసుకున్న జీతం అక్షరాల 49 లక్షల 50 వేల రూపాయలు అని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి గారు పదే పదే అసెంబ్లీకి రమ్మంటే అప్పనంగా జీతం తీసుకోని కేసిఆర్ ఫాం హౌస్ కే పరిమితమయ్యారని విమర్శించారు.

### యువత దృష్టి ఆకర్షించేలా

# తెలంగాణలో స్పోర్ట్స్ పాలసీ

### మంత్రి వాకటి శ్రీహరి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** యువతను దృష్టి వేరే వాటిపై మరలకుండా.. క్రీడల పట్ల మక్కువ పెంచుకోవడానికి వీ లుగా తెలంగాణలో క్రీడల స్పోర్ట్స్ పాలసీని తీసుకురావడం జరిగిందని రాష్ట్ర క్రీడల యువజన సర్వీసుల పశుసంవర్ధక శాఖ మంత్రి వాకటి శ్రీహరి తెలిపారు. శనివారం హెచ్‌ఐసిసి లో ఫస్ట్ ఎడిషన్ తెలంగాణ స్పోర్ట్స్ కన్ క్లేవ్ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసులు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకాటి శ్రీహరి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే కొత్తగా స్పోర్ట్స్ పాలసీని అమలు చేస్తూ అన్ని క్రీడలకు సముచిత స్థానం కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన ఈ పాలసీ ద్వారా క్రీడలు ఎంతగానో అభివృద్ధి చెందుతాయని తెలిపారు. క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ వాటి ప్రాముఖ్యతను పెంచే విధంగా నూతన క్రీడా విధానం అమలు చేస్తూ అమలు చేయుటలో పని చేస్తామని మంత్రి పేర్కొన్నారు.ఈ పాలసీలో గతంలో క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు, దీర్ఘకాలంగా క్రీడల్లో ఉన్న వారు, క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించే వారికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని ఆయన అన్నారు. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభిస్తున్న క్రీడల పాలసీ క్రీడల అభివృద్ధి కొరకు క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయుటకు దోహదపడుతుందని మంత్రి తన అభిప్రాయాన్ని తెలిపారు. ఈ పాలసీలో పొందుపరిచిన జాతీయ,అంతర్జాతీయ క్రీడల నిర్వాహకుల సహాయ సహకారాలు తీసుకొని ఆస్థాయిలో క్రీడల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని, 2036లో జరిగే ఒలింపిక్స్ ను లక్ష్యంగా చేసుకొని క్రీడాకారులకు ఆయా క్రీడలలో శిక్షణ ఇప్పించడం జరుగుతుందని,తమ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే విధంగా క్రీడాకారులకు విధి విధానాలను కల్పిస్తూ ఈ పాలసీకి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపారని మంత్రి తెలిపారు.తమ ప్రభుత్వం బడ్జెట్ లో క్రీడలకు ఎక్కువ నిధులు కేటాయించిందని, క్రీడల స్టేడియాలకు, క్రీడాకారుల వసతులకు, వసతులకు క్రీడాకారులకు కల్పించే మౌలిక వసతులకు అధిక నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి,అడ్వైజర్ జితేందర్ రెడ్డి,కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ్ రంజన్, వైస్ ఛైర్మన్ ఎం.డి.సోనీ బాల,గోపిచంద్ అకాడమీ ఫౌండర్ పుల్లెల గోపీచంద్, ప్రముఖ క్రీడాకారులైన గగన్ నారంగ్,అంజు బాబి జార్జ్, సుమిత్ పాండే, అభినవ్ బింద్రా, రవికాంత్ రెడ్డి, నీలం బాబర్ దేశాయ్,తతగత ముఖర్జీ, సబనా యకన్ విశ్వనాథ్, అడిళ్ళ సుమరివాల, తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ వర్సిటీ ఉత్తర్వులపై భగ్గుమంటున్న అధ్యాపకులు

### పనిగంటల పెంపుపై సర్వత్రా విమర్శలు

**న్యూఢిల్లీ:** దేశంలో విశ్వవిద్యాలయాలు నూతన విద్యా సంవత్సరంలోకి ప్రవేశించడానికి సిద్ధమవుతున్న తరుణంలో, ఢిల్లీ విశ్వవిద్యాలయం సరికొత్త నిర్ణయం తీసుకుంది. ఇది సంస్థాగత ప్రాధాన్యతలు, విద్యావేత్తల పని పరిస్థితులపై సాగుతున్న చర్చలను మరింత తీవ్రతరం చేసింది. ఈ నిర్ణయం నిర్మాణాత్మక మార్పుల అమలుకు దోహదపడుతుందని, క్యాంపస్‌లలో విద్యావాతావరణాన్ని ప్రభావితం చేస్తుందని బోధనా సంఘం అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. ఢిల్లీ విశ్వవిద్యాలయం తన తాజా ఉత్తర్వులలో వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలు,అనుబంధ సంస్థలు సాధారణ పనిదినాలలో ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల మధ్య పని చేయాలని అధికారికంగా ఆదేశించింది. గత నెల 31న జారీ చేసిన ఈ ఆదేశంలో... వనరులను ఉత్తమంగా ఉపయోగించుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. అయితే పని గంటలను పెంచాలనే ఈ ఆదేశం వర్సిటీలోని అన్ని విభాగాల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. గత నెల 12న జరిగిన విశ్వవిద్యాలయ కార్యనిర్వాహక మండలి సమావేశంలో చర్చించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు వర్సిటీ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. పొడిగించిన ఈ పని గంటలను సమర్థవంతంగా ఉపయోగిచుకునేందుకు అధ్యాపకులు, సిబ్బంది ముందుకు రావాలని విశ్వవిద్యాలయం సూచించింది. కొత్త విద్యా సంవత్సరానికి ముందు నుంచే ఈ విధానం అమలుకానుంది. మరోవైపు ఈ నూ తన విద్యాసంవత్సరం(2025–26) నుంచే నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌వైయూపీ) ప్రారంభం కానుంది. సీనియర్ రెగ్యులర్ ఫ్యాకల్టీకి నాల్గవ ఏడాది విద్యార్థులకు బోధ నా బాధ్యతలు అప్పగించనున్నట్లు తాజా నోటిఫికేషన్‌లో వర్సిటీ పేర్కొంది. దిల్లీ విశ్వవిద్యాల యం జారీ చేసిన ఆదేశంపై అధ్యాపకుల నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. ఈ ఉత్తర్వులను అసాధ్యమని, బోధనా సిబ్బందికి, విద్యార్థులకు హానికరం అని, అలాగే ఈ ఉత్తర్వులను అ మలు చేసేందుకు అవసరమైన ప్రాథమిక మౌలిక సదుపాయాలు లేవని పలువురు అధ్యాపకులు ఆరోపిస్తున్నారు. కళాశాలలకు దూరంగా ఉన్న అధ్యాపకులకు, విద్యార్థులకు ఇది సమస్యగా మారనున్నదనే వాదన వినిపిస్తోంది.

## కాళేశ్వరం కమిషన్ విచారణలో కెసిఆర్ కడిగిన ముత్యంలా బయటికొస్తారు

### మాజీమంత్రి జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం కమిషన్ విచారణలో కెసిఆర్ కడిగిన ముత్యంలాగ బయటికొస్తారని, ఏ కమిషన్ కూడా కెసిఆర్‌కు వ్యతిరేకంగా ఎటువంటి నివేదికలు ఇవ్వలేవని బిఆర్ ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్ ఎస్ ఎంపి లింగయ్య యాదవ్ ,మాజీ ఎంఎల్ ఎలు ఎన్ .భాస్కర్ రావు ,రవీంద్ర కుమార్‌తో కలిసి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును ఎపి పాలకులు ఎటిఎంగా మార్చుకున్నారని, కేంద్రం పోలవరం ప్రాజెక్ట్‌పైన ఇప్పటికే రూ 30 వేల కోట్లను ఖర్చు పెట్టిందని, ఇందులో రూ 2 వేల కోట్లు వరదల్లో కొట్టుకుపోయిన ప్రాజెక్ట్ కోసం వెచ్చించారని, .ఇప్పటికే 'పోలవరం' మూడు సార్లు కొట్టుకుపోయిందని అన్నారు. నాలుగేళ్ళలో పూర్తయిన కాళేశ్వరం ప్రాజెక్ట్ దాదాపు 38 లక్షల క్యూసెక్కులు వరద రావడం వల్లనే కేవలం రెండు పిల్లర్లు మాత్రమే కుంగిపోతే మోదీ ,చంద్రబాబు ,రేవంత్ కలిసి కెసిఆర్‌పైన దుర్మార్గమైన దాడి చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం కమిషన్‌నివేదిక పేరుతో ఇష్టమొచ్చిన రాతలు రాయిస్తున్నారని, ఇష్టమొచ్చిన కూతలు కూయిస్తున్నారని జగదీష్ రెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం కమిషన్ రహస్య నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తే, అందులోని అంశాలు స్లాటర్ హౌజ్‌లకు ఎలా తెలుసని ప్రశ్నించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఏ అధికారి చెప్పినా,ఏ నాయకుడు మాట్లాడినా మీడియా చూపించవచ్చని, కానీ కెసిఆర్‌ను, బిఆర్‌ఎస్‌ను బద్‌నామ్ చేసే విధంగా ఎటువంటి ఆధారాలు లేకుండా వార్తలు రాయకూడదని సూచించారు. సిఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ కి ఎక్కే ఫ్లైట్, దిగే ఫ్లైట్ తో అర్థశతకం పూర్తయిందని ఎద్దేవా చేశారు. కెసిఆర్ తన పదేళ్ల కాలంలో పది సార్లు కూడా ఢిల్లీకి వెళ్లలేదని, రేవంత్ రెడ్డి 20నెలల కాలంలో నెలకు రెండు సార్లకు పైగా ఢిల్లీకి వెళ్లారని వివరించారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్ళేది కేవలం సంచుల పంపిణి కోసమేనని ఆరోపించారు.కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తెలంగాణ రాష్ట్రంలో చేస్తున్న పాదయాత్ర సిఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్‌కు అవమానకరమని జగదీష్ రెడ్డి అన్నారు.

# స్వగృహ ఫ్లాట్ల విక్రయాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ పరిసరాల్లోని ఘట్ కేసర్ పోచారం, నాగోలు బండ్లగూడ ప్రాంతంలో మధ్య తరగతి వర్గాలకు నిర్దేశించిన రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ కు చెందిన 401 ఫ్లాట్లను శనివారం విక్రయించారు. నో లాస్ నో ప్రాఫిట్ విధానం కింద మొత్తం 401 ఫ్లాట్ల ను విక్రయించారు. ఈ ఫ్లాట్ల విక్రయం ద్వారా రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ కు సుమారు రూ.78 కోట్ల ఆదాయం సమకూరిందని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ప్రకటించింది. ఈ రెండు ప్రాంతాల్లో ఫ్లాట్ల విక్రయానికి సంబంధించి గత నెల 4 వ తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తులను స్వీకరించి,లాటరీ విధానం ద్వారా ప్రాథమిక కేటాయింపు ప్రక్రియను పూర్తి చేశారు. పోచారంలో వరుసగా రెండో రోజు(శనివారం) కూడా అలాట్ మెంట్ ప్రక్రియను నిర్వహించారు. రెండో రోజు 3 బిహెచ్ కె, సింగిల్ బెడ్ రూం ఫ్లాట్ల ప్రక్రియను ఘట్ కేసర్ తహాశీల్దార్ రజని, స్వగృహ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ నరేందర్ రెడ్డి తదితర అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఒక ఫ్లాట్ కు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చిన సందర్భాల్లో లాటరీ తీసి, ఫ్లాట్లను కేటాయించారు. కాగా ఒక ట్రిబుల్ బెడ్‌రూముకు 69 దరఖాస్తులు వచ్చాయి. కాగా బండ్లగూడ లో దరఖాస్తు చేసుకుని లాటరీలో ఫ్లాట్లు రానివారికి కూడా పోచారంలో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. వీరి కోసం శనివారం మరోసారి లాటరీ ప్రక్రియను నిర్వహించి, ఫ్లాట్లను కేటాయించారు. బండ్లగూడ, పోచారం ప్రాంతంలోని మిగిలిన 1,2 బిహెచ్ కె ఫ్లాట్లకు కూడా దరఖాస్తు చేసుకునేందుకు తమకు కొంత గడువు ఇవ్వాలని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు, ఆగస్టు 8 వ తేదీ వరకు అవకాశమిస్తున్నట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండి వి.పి.గౌతం తెలిపారు. ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన ఫ్లాట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశం కేవలం సింగిల్, డబుల్ బెడ్ రూములకు మాత్రమే అని ఆయన స్పష్టం చేశారు.

**4 వ తేదీ నుంచి ఓపెన్ ఫ్లాట్ల వేలం**

హైదరాబాద్ నగర శివార్లలోని పలు ప్రాంతాల్లో స్వగృహ కార్పొరేషన్ కు చెందిన ఓపెన్ ఫ్లాట్లను బహిరంగ వేలం పాట ద్వారా విక్రయించనున్నారు. 200 చదరపు గజాలు అంతకు మించిన విస్తీర్ణంలోని ఈ ఫ్లాట్ల విక్రయాలను ఈనెల 4న (సోమవారం) నుంచి వరుసగా మూడు రోజుల పాటు జరగనున్నాయి. రంగారెడ్డి జిల్లా కుర్మల్ గూడలో 20 ఫ్లాట్లు (4 వతేదీ), ఆ తరువాత మేడ్చల్‌మల్కాజిగిరి బహదూర్ పల్లి లోని 69 ఫ్లాట్లు, రంగారెడ్డి జిల్లా తొర్రూర్ లో (6 వతేదీ) 100 ఫ్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు.

## బిసి రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

### కేంద్రప్రభుత్వానికి పలువురు వక్తలు డిమాండ్



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన 42శాతం బిసిల రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టి, తమిళనాడు తరహాలోనే రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని పలువురు వక్తలు కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సోమాజిగూడలో తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి నిజ్జన రమేశ్ ముదిరాజ్ అధ్యక్షతన శనివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ బిసి సంఘాల నేతలు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎంపి వి.హనుమంతురావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం కామారెడ్డి బిసి డిక్లరేషన్ అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకొంటున్నదని ఆరోపించారు. ఈ సమయంలో రాష్ట్రంలోని బిసిలందరూ ఏకమై, ఒకే నినాదంతో ముందుకు రావాలని సూచించారు. తెలంగాణ జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ఎల్.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ బిసిల రిజర్వేషన్ల పెంపునకు ముందుకు రావాల్సిన రాజకీయ పార్టీలు రెండు నాల్కల ధోరణి అవలంభించడం సిగ్గుచేటన్నారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బిసి అయిన కేంద్రమంత్రి బండి సంజయ్ 'తొండి సంజయ్'లా మాట్లాడుతున్నారని విమర్శించారు.బిసిలకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని కోరారు. సమావేశంలో బిసి రాజ్యాధికార సమితి చైర్మన్ దాసు సురేశ్, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్, గౌడ సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ అంబాల నారాయణగౌడ్, నేతలు గణేశ్‌చారి, లక్ష్మణ్‌యాదవ్, కుల్కచర్ల శ్రీనివాస్, సాంబశివగౌడ్ , సంతోష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.




### మతతత్వ శక్తులను ప్రతిఘటించేందుకు

## మరింత బలోపేతం కావాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మతాల పేరుతో ప్రజలను వీడదీయాలని ప్రయత్నిస్తున్న మతతత్వ శక్తుల ప్రతిఘటించేందుకు ప్రజా పోరాటాలను సమర్థవంతంగా ముందుకు తీసుకువెళ్లేలా మరింత బలోపేతం కావాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి. నరసింహ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ లో శనివారం సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం కార్యవర్గ సభ్యులు పడాల నళిని అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఈటి నరసింహా మాట్లాడుతూ ప్రజా పునాదితో కూడిన బలమైన భారత కమ్యూనిస్ట్ పార్టీని ఎలా నిర్మించాలనే దానిపై దృష్టి పెట్టాలని కోరారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను ఏర్పరచుకొని, ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడానికి కొత్త నినాదాలు, వ్యూహాలు, సంస్థాగత నిర్మాణం అవసరం అని అన్నారు. మతతత్వ భావజాలాన్ని ఎదుర్కోవడానికి లౌకిక ప్రజాస్వామ్య విలువలను పెంపొందించగల సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాలను రూపొందించాలని ఆయన కోరారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి మాట్లాడుతూ నాటి నిరంకుశ నిజాం పాలనా నుండి నేటి నయా బూర్జువా పాలకుల ప్రజా వ్యతరేక విధానాలను నిరసిస్తూ హైదరాబాద్ నగరంలో అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించిన చరిత్ర హైదరాబాద్ సిపిఐ కు ఉందన్నారు.ఆ స్ఫూర్తితోనే ఆగష్టు 14 న సిపిఐ హైదరాబాద్ జిల్లా మహాసభలు హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ లో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి. స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి. చంద్రమోహన్ గౌడ్, ఆర్. శంకర్ నాయక్, నిర్లేకంటి శ్రీకాంత్, ఎండి. ఒమర్ ఖాన్, ఎండి. సలీమ్, మామిడిచెట్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## చార్మినార్ ఎక్స్‌ప్రెస్ చెన్నైబీచ్ వరకే

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నుంచి తాంబరం వెళ్లాల్సిన చార్మినార్ ఎక్స్‌ప్రెస్ (12760/12759) రైళ్లను చెన్నైబీచ్ స్టేషన్ వరకే నడపనునట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. చెన్నై ఎగ్మోర్ స్టేషన్‌లో జరుగుతున్న రీ డెవలప్‌మెంట్ పనుల కారణంగా ఈ మార్పు చేయాల్సివచ్చిందని సిపిఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు.

## ఢిల్లీ యాత్రలో సెంచరీ పూర్తి చేసిన రేవంత్ : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఢిల్లీ యాత్రలో సిఎం రేవంత్ రెడ్డి హాఫ్ సెంచరీ పూర్తి చేశారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో 50 సార్లు ఢిల్లీకి పోయిన రేవంత్ రెడ్డితో రాష్ట్రానికి పైసా ప్రయోజనం కలగలేదన్నారు. రేవంత్ రెడ్డి టూరిస్ట్ సిఎంగా దేశ చరిత్రలో మిగిలిపోతారని కెటిఆర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలించే ముఖ్యమంత్రి కావాలి కాని, ఢిల్లీకి విహార యాత్రలు చేసే టూరిస్ట్ సిఎం తెలంగాణకు అవసరం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదని, జాబ్ క్యాలెండర్ల జాడ లేదని, రుణమాఫీ కాలేదని ఆరోపించారు.

## 'ఫెర్టిలిటీ సెంటర్ల' కమిటీ ఏర్పాటు

### ఉత్తర్వులు జారీ చేసిన వైద్య ఆరోగ్య శాఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఫెర్టిలిటీ సెంటర్లలో ఉన్న లోపాలను గుర్తించేందుకు వైద్య ఆరోగ్య శాఖ శనివారం ఒక కమిటీ ఏర్పాటు చేసింది. కమిటీలో వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒ, డిఎంహెచ్ సభ్యులుగా నియమించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టియాన జెడ్ చొంగ్తు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫెర్టిలిటీ సెంటర్లలో నిబంధనల ఉల్లంఘనలు, చట్టవిరుద్ధమైన వాణిజ్య సరోగసీ పద్ధతులను కమిటీ గుర్తించనుంది. ఫెర్టిలిటీ సెంటర్ల నిఘా పెట్టడం పట్ల తదితర అంశాలను ఈకమిటీ పరిశీలించి పది రోజుల్లో ప్రభుత్వానికి నివేదికను సమర్పించాల్సి ఉంటుంది.

## ప్రభుత్వ బడుల్లో సమస్యలు పరిష్కరించాలి

### ఆప్ జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి (ఆప్), తెలంగాణరాష్ట్ర బాధ్యులు ప్రియాంక కక్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ప్రస్తుతం సర్కార్ బడులు అత్యంత దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయని,వాటిని చక్కదిద్దాలని ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆప్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దిడ్డి సుధాకర్‌తో కలిసి ఆమె మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల పేరిట లక్షల రూపాయలు దోచుకొంటున్నారని, దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా చితికిపోతున్నారని తెలిపారు. దేశంలో కాంగ్రెస్, బిజెపి దొందు దొందే అని విమర్శించారు. గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు వెలుగు చూస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## విపక్షాలను బెదిరించడం నా తండ్రి నైజం కాదు : రోహన్ జైట్లీ

**న్యూఢిల్లీ:** సాగు చట్టాలకు వ్యతిరేకంగా నిరసన చేపడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కేంద్ర మాజీ మంత్రి దివంగత అరుణ్ జైట్లీ తనను బెదిరించినట్లు రాహుల్ గాంధీ అన్నారు. శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ వార్షిక లీగల్ సదస్సులో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. దీన్ని అరుణ్ జైట్లీ కుమారుడు రోహన్ జైట్లీ ఖండించారు. రోహన్ తన ఆన్‌లైన్ అకౌంట్‌లో స్పందిస్తూ... సాగు చట్టాలను 2020లో ప్రవేశపెట్టారని, కానీ రైతు ఉద్యమం వల్ల ఆ మూడు చట్టాలను రద్దు చేసినట్లు గుర్తు చేశారు. తన తండ్రి అరుణ్ జైట్లీ... ఆ చట్టాలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి ముందే మరణించినట్లు రోహన్ తెలిపారు. విపక్షాలను బెదిరించడం తన తండ్రి నైజం కాదని, ఆయన బహిరంగ చర్చలకు ఇష్టపడేవారన్నారు. తన తండ్రి 2019లో చనిపోయారని, కానీ సాగు చట్టాలను 2020లో ప్రవేశపెట్టారన్నారు. దివంగత నేతల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

# భారత్‌తో పెట్టుకుంటే... పాతాళంలో ఉన్నా వదలిపెట్టం






- వారణాసి బహిరంగసభలో ప్రధాని మోదీ
- ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ రుద్రరూపాన్ని యావత్ ప్రపంచం చూసింది
- కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ సిందూర్‌ను 'ఒక తమాషా' అనడం సిగ్గుచేటని ధ్వజం

**వారణాసి :** ఉగ్రవాదంపై భారతదేశం తీసుకున్న దృఢ సంకల్ప చర్యను వివరించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శివుని రుద్రరూపాన్ని (ఉగ్ర రూపం) ప్రస్తావిస్తూ ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి దేశ బలాన్ని ప్రదర్శించిందన్నారు. భారతదేశంపై దాడిచేయడానికి సాహసం చేసే ఎవరినైనా పాతాళలోకంలో ఉన్నాకూడా వదిలిపెట్టబోమని ఆపరేషన్ సిందూర్ ద్వారా రుజువుచేశామని ప్రధాని మోదీ ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. 'పహల్గామ్ ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన 26మంది పట్ల నా హృదయం దు:ఖంతో నిండిపోయింది' అని ప్రధాని మోదీ తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో శనివారం నాడు జరిగిన ఒక బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించారు. 'నా కూతుళ్ల సిందూర్‌కు ప్రతీకారం తీర్చుకుంటానని నేను చేసిన వాగ్దానం మహాదేవ్ ఆశీర్వాదంతో నెరవేరింది' అని మోదీ చెప్పారు.'ఆపరేషన్ విజయాన్ని మహాదేవ్ పాదాలకు అంకితం చేస్తున్నాను' అని ప్రకటించారు. 140 కోట్ల మంది దేశవాసుల ఐక్యత ఆపరేషన సిందూర్‌కు బలంగా మారిందని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. శివుడు అంటే సంక్షేమం కానీ ఉగ్రవాదం వికృతరూపం తీసుకున్నప్పుడు మహాదేవ్ తన 'రుద్రరూప్'ను తీసుకుంటాడు అని , ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ విషయంలో 'యావత్ ప్రపంచం భారతదేశం రుద్రరూపానికి సాక్షిగా నిలుచున్నది' అని ప్రధానమంత్రి చెప్పారు. ప్రతిపక్షాల ధోరణిపై మోదీ విమర్శలతో విరుచుకుపడుతూ ఒక పక్క దేశ ం ఆపరేషన్ సిందూర్ సక్సెస్ సంబరాలు చేసుకుంటుంటే, మరోపక్క మన దేశానికి చెందిన కొంతమంది దీని వల్ల ఇబ్బంది పడ్డారని నిప్పులు చెరిగారు. పాకిస్థాన్ లోపల ఉగ్రవాద స్థావరాలను భారత్ కూల్చివేసిందనే నిజాన్ని కాంగ్రెస్ సహా దాని మిత్రపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయని ఆయన చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్ మీకు గర్వకారణంగా లేదా ? పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను కూల్చివేయడం మీరు గర్వపడటం లేదా ?' అని ప్రధాని మోదీ బహిరంగసభకు హాజరైన జనాన్ని ఉద్దేశించి ప్రశ్నించారు. మన డ్రోన్లు, క్షిపణులు ఉగ్రవాద శిబిరాలపై ఏవిధంగా ఖచ్చితంగా దాడిచేసి, శిథిలాలుగా మార్చి ఉగ్రవాద హెడ్‌క్వార్టర్స్‌ను ఏవిధంగా తగ్గించాయనే దృశ్యాలను మీరు చూసే ఉంటారని ప్రధాని అన్నారు. చాలా వరకు పాకిస్థాన్ వైమానిక స్థావరాలు నేటికీ ఇంకా ఐసియులోనే ఉన్నట్లుగా ఆ దేశ పరిస్థితి కనిపిస్తోందన్నారు.దిగ్భ్రాంతికరమైన విషయమమేమిటంటే కాంగ్రెస్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ కూడా పాకిస్థాన్‌పై దాడి విషయాన్ని తట్టుకోలేకపోతున్నాయని ప్రధాని మోదీ విస్మయం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ సాయుధ దళాల పరాక్రమాన్ని పదేపదే అవమానిస్తోందని, ఆపరేషన్‌సిందూర్‌ను తమాషా (వినోదం) అని కూడా అభివర్ణిస్తోందని, కాంగ్రెస్ పార్టీ ఆపరేషన్ సిందూర్‌ను ఒక తమాషా అనడం సిగ్గుచేటు అని ప్రధాని మోదీ నిప్పులుచెరిగారు. 'సిందూర్ ఎప్పుడైనా ఒక జోక్ అవుతుందా ? .వారు మన సోదరీమణుల పవిత్రచిహ్నమైన సిందూర్‌ను, సైనికుల పరాక్రమాన్ని అవమానించడానికి ధైర్యం చేశారు' అని మోదీ మండిపడ్డారు. సైనిక దాడుల సమయాన్ని ప్రశ్నించిన సమాజ్‌వాదీ పార్టీపై కూడా మోదీ విరుచుకుపడ్డారు. 'వారి నాయకులలో ఒకరు పార్లమెంట్‌లో పహల్గామ్ దాడి నిందితులను ఇప్పుడు ఎందుకు చంపారు? అని అడిగారు. నేను సమాజ్‌వాదీ పార్టీని పిలిచి ఇప్పుడే దాడి చేయలా? లేదా తర్వాత దాడి చేయాలా? అని వారిని అడగాలా? మనం వేచివుండి ఉగ్రవాదులు తప్పించుకుని పోయేలా చూడాలా?' అని మోదీ అడిగారు. ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి స్వదేశీ రక్షణ సామర్థ్యాలను ప్రదర్శించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ప్రధానమంత్రి వరుసగా మూడవ సారి లోక్‌సభ సభ్యుడిగా ఉన్న వారణాసి పర్యటన సందర్భంగా రూ.2,000కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపనలు చేయడం సహా దేశవ్యాప్తంగా 9.70 కోట్లమ ందికి పైగా ఉన్న అర్హులైన రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడతగారూ.20,500 కోట్ల నగదును పంపిణీ చేశారు.

# రాజ్యాంగ తిరుగుబాటు అనుమతించం

- దేశాన్ని ఒకే గొంతు... ఒకే పార్టీ... ఒకే సిద్ధాంతంగా మారనివ్వం
- మోదీ పాలనపై కాంగ్రెస్ నాయకుడు అభిషేక్ సింఘ్వీ ధ్వజం



**న్యూఢిల్లీ :** భారతదేశం ఒకే గొంతు, ఒకే పార్టీ, ఒకే సిద్ధాంతం కలిగిన దేశంగా మారనివ్వమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అభిషేక్ సింఘ్వీ స్పష్టం చేశారు. బిజెపి ప్ర జాస్వామ్యాన్ని ఆధిపత్యంగా, దాని బహుళత్వాన్ని ధ్రువణతగా మారుస్తోందని విమర్శించా రు. 'రాజ్యాంగ సవాళ్లుదక్షిణాలు మార్గా లు' అనే అంశంపై ఆదివారం ఇక్కడ ఒక రోజు పాటు జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగి స్తూ, 'రాజ్యాంగం కేవలం విస్మరించడమే కాదు... దానిని ఆధిపత్య సాధనంగా వక్రీకరిస్తున్నారు. మనకు ప్రజాస్వామ్య శ్వాస, స్వేచ్ఛ, సోదరభావం, సమానత్వం, న్యాయం ఇచ్చిన వి లువలు ఇప్పుడు గాలిలో కలిసిపోతున్నాయి' అని సింఘ్వీ అన్నారు. 'ట్యాంకులు పేలినప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం చనిపోదు. సంస్థలు కూలిపోయినప్పుడు కూడా చనిపోతుంది. రాజ్యాంగ కార్యకర్తలు పక్షపాత కీలుబొమ్మలుగా మారినప్పు డు మీడియా అద్దం కాకుండా మెగాఫోన్‌గా మారినప్పుడు, కోర్టులు ఆలస్యం చేయడం ప్రారంభించినప్పుడు వారు తిరస్కరించడానికి ధైర్యం చేయరు. అసమ్మతి దేశద్రోహం, నిరసన రెచ్చగొట్టడం, ప్రతి ప్రశ్నను 'జాతి వ్యతిరేకం' అని ముద్ర వేసినప్పుడు ప్రజాస్వామ్యం వెంటిలేటర్‌పై ఉందని మీకు తెలుస్తుంది' అని ఆయన అన్నారు. భారతదేశాన్ని ప్ర జాస్వామ్యంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని, అది రూపంలోనే కాదు, స్ఫూర్తిలోనూ ఉందని, ఆ రాజ్యాంగం ఆత్మను రక్షించడానికి, సంరక్షించడానికి, అవసరమైతే పునరుద్ధరించడానికి కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి రావాలని తెలిపారు. సవాలు కేవలం చెడు పాలన లేదా పేలవమైన ఆర్థిక వ్యవస్థ కాదని అన్నారు. కానీ ఇది 'లోతైన, మరింత కృత్రిమ సంక్షోభం... ఎన్నికల మెజారిటీ ముసుగులో రాజ్యాంగ విలువలను ఉద్దేశపూర్వకంగా కూల్చివేయడం' అని ఆయన అన్నారు. 'రాజ్యాంగంలో తనిఖీలు, సమతుల్యత ఉంది. వాటి స్థానంలో తనిఖీలు, బుల్‌డోజర్‌లు వస్తున్నాయి. రాజ్యాంగంలో హక్కులు, పరిష్కారాలు ఉన్నాయి. అవి దాడులు, వాక్చాతుర్యాన్ని అందిస్తాయి. ఇది స్వేచ్ఛ గురించి మాట్లాడుతుంది. అవి విధేయతను ఆయుధంగా మారుస్తాయి. ఇది పాలన కాదు... ఇది గణతంత్రాన్ని మంటల్లో పెట్టడం' అని ఆయన పేర్కొన్నారు. ముందుకు సాగే మార్గంలో ఇది రాజకీయ ధైర్యం, రాజ్యాంగ స్పష్టతతో ప్రారంభం కావాలని ఆయన అన్నారు. 'మనం పార్లమెంటును కాగితపు బిల్లులకు స్థలంగా కాకుండా నిజమైన చర్చల వేదికగా తిరిగి పొందాలి. మన న్యాయవ్యవస్థ నుంచి కేవలం వివరణ మాత్రమే కాకుండా జోక్యం కూడా కోరాలి. మనం మీడియాను నియంత్రించడం ద్వారా కాకుండా భయం, అనుకూలత నుంచి విముక్తి చేయడం ద్వారా రక్షించాలి. అన్నింటికంటే మించి రాజ్యాంగాన్ని సామాన్యుడితో తిరిగి అనుసంధానం చేయాలి' అని ఆయన నొక్కి చెప్పారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, కచ్ నుంచి కోహిమా వరకు ప్రతి భారతీయుడు రాజ్యాంగ ప్రవేశిక నాడిని అనుభవించేలా చూసుకోవడం కాంగ్రెస్ విధి అని పేర్కొంటూ, రాజ్యాంగాన్ని రక్షించే పోరాటం చట్టపరమైన పోరాటం మాత్రమే కాదని, అది నైతిక పోరాటం అని ఆయన అన్నారు. 'మనం జాగ్రత్తగా కాకుండా దృఢ నిశ్చయంతో పోరాడాల్సిన సమయం ఇది. డ్రాయింగ్ రూమ్‌లలో గుసగుసలతో కాదు... వీధుల్లో గర్జనలతో. ప్రకటనల ద్వారా మాత్రమే కాదు, నిరంతర సత్యాగ్రహం ద్వారా. ఇది విలపించాల్సిన క్షణం కాదు. నాయకత్వం వహించాల్సిన క్షణం. ఈ సంఘటన నుంచి మన సందేశాన్ని బిగ్గరగా, స్పష్టంగా చెప్పనివ్వండి. రాజ్యాంగ తిరుగుబాటు విజయవంతం కావడానికి మేము అనుమతించము' అని సింఘ్వీ తెలిపారు. 'భారతదేశం ఒకే స్వరం, ఒకే పార్టీ, ఒకే భావజాలం కలిగిన దేశంగా మారడానికి మేము అనుమతించము. భారతదేశం మోనోక్రోమ్‌లో ఉన్న పెయింటింగ్ కాదు. ఇది అనేక మిలియన్ల చిత్రాలతో కూడిన కుడ్యచిత్రం. ఒక రంగును చెరిపివేస్తే కాన్వాస్‌కు పగుళ్లు ఏర్పడతాయి' అని అన్నారు. 'మేము రాజ్యాంగాన్ని, దాని వాగ్దానాన్ని నమ్ముతాము. మన ప్రతి శ్వాసతో దానిని రక్షించుకునే సామర్థ్యాన్ని విశ్వసిస్తాము' అని తెలిపారు. 'సంప్రదింపులు లేకుండా పథకాలు ప్రారంభిస్తారు. రాజకీయ పక్షపాతంతో నిధులు నిలిపివేస్తారు. ఎన్నికయిన ప్రభుత్వాలను డబ్బు, బలం, తారుమారు ద్వారా పడగొట్టారు. ఇది సహకార సమాఖ్యవాదం కాదు. ఇది ప్రచారంలో చుట్టబడిన బలవంతపు సమాఖ్యవాదం' అని సింఘ్వీ మండిపడ్డారు. ప్రస్తుత పాలనకు వ్యతిరేకంగా, ప్రతిపక్షంగా కాకుండా అసలు దార్శనికతగా ప్రజలు ఉద్యమించాలని సింఘ్వీ పిలుపునిచ్చారు. 'చర్చలను గెలవడానికి మాత్రమే కాదు. దేశాన్ని తిరిగి గెలవడానికి మాట్లాడదాం. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు. రాజ్యాంగ విముక్తి కోసం మనం పని చేద్దాం. చరిత్ర చరిత్రలో చెప్పుకుందాం. రాజ్యాంగం దాని కన్నీళ్లను తుడిచింది కాంగ్రెస్. ప్రజాస్వామ్యం రక్తం కారినప్పుడు దాని గాయాలకు కట్టుకట్టింది కాంగ్రెస్. గణతంత్రం వణికినప్పుడు కాంగ్రెస్ ఒక శిలలా దృఢంగా నిలబడింది' అని అన్నారు.

## హాస్టల్ టెర్రస్ పైనుంచి దూకి.. ఐఐటి బాంబే విద్యార్థి ఆత్మహత్య

**మంబయి :** మహారాష్ట్రలోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఐఐటి బాంబేకు చెందిన విద్యార్థి హాస్టల్ టెర్రస్ పైనుంచి దూకి మరణించాడు. ఈ నేపథ్యంలో అతడి ఆత్మహత్యపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ సమయంలో మరో విద్యార్థి అక్కడ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఢిల్లీకి చెందిన 26 ఏళ్ల రోహిత్ సిన్హా ఐఐటి బాంబేలో చదువుతున్నాడు. మెటలర్జికల్ ఇంజినీరింగ్, మెటీరియల్స్ సైన్స్ కోర్సు నాల్గవ సంవత్సరంలో ఉన్నాడు. కాగా, శనివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో హాస్టల్ భవనం టెర్రస్‌పై నుంచి రోహిత్ సిన్హా కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థిని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. అయితే అతడు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రోహిత్ ఆత్మహత్యపై కేసు నమోదు చేశారు. అతడు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు అన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. అయితే రోహిత్ టెర్రస్‌పై నుంచి కిందకు దూకిన సమయంలో ఆ హాస్టల్‌లో ఉంటున్న మరో విద్యార్థి ఫోన్‌లో మాట్లాడుతూ అక్కడ ఉన్నట్లు తమకు తెలిసిందని పోలీస్ అధికారి తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఓటరు జాబితాలో నా పేరు ఏదీ?

### ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్



**పాట్నా :** బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా ఎన్నికల కమిషన్ ప్రచురించిన 'ముసాయిదా ఓటర్ల జాబితా'లో తన పేరు లేదని ఆర్‌జెడి నాయకుడు తేజస్వి యాదవ్ శనివారం పేర్కొన్నారు. అయి తే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సీనియర్ బిజెపి నాయకుడు సామ్రాట్ చౌదరి ఆ వాదనను తోసిపుచ్చారు. యాదవ్ వివరాలు, ఫోటోతో పాటు, చూడగలిగే ముసాయిదా ఓటర్ల జాబితా స్క్రీన్‌షాట్‌ను పంచుకున్నారు. మీడియా సమావేశంలో తేజస్వీ తన ఫోన్‌ను పెద్ద స్క్రీన్‌కు కనెక్ట్ చేసి, సొంత ఇపిఐసి నంబర్‌ను శోధించడానికి ప్రయత్నించగా, అది 'రికార్డులు కనుగొనబడలేదు' అనే జవాబు చ్చింది. 'ఇప్పుడు చూడండి! నేను ఓటరుగా నమోదు కాలేదు. ఇది నన్ను ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుని చేస్తుంది. బహుశా, నన్ను పౌరుడిగా పరిగణించకపోవడంతో ఈ సభలో ఉండే హక్కును కోల్పోవచ్చు' అని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న యాదవ్, గణన ఫారమ్‌తో తన స్థానానికి వచ్చిన బూత్‌స్థాయి అధికారి తనకు ఎటువంటి రసీదు ఇవ్వలేదని కూడా పేర్కొన్నారు. తాను సంతకం చేసి, సరిగ్గా నింపిన ఫారమ్‌ను అందజేస్తున్నప్పుడు ఫోటో తీశాను అని అన్నారు. శనివారం ఇసి అన్ని రాజకీయ పార్టీలకు అందించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రింటవుట్‌ను చూడమని కొంతమంది జర్నలిస్టులు తేజస్వీకి సూచించారు. దీనికి ఆయన స్పందిస్తూ ఆన్‌లైన్ పద్ధతి అంటే ఎక్కువ మందికి అందుబాటులో ఉంటుందని, బిహార్ వెలుపల నివసించే ఎవరైనా ఓటర్ల జాబితాలో తన పేరును చూసుకోవడానికి వస్తారని మీరు ఆశిస్తారా? అని ప్రశ్నించారు. నా ఉద్దేశం ఏమిటంటే మనలాంటి వ్యక్తులు రిసీవర్ ఎండ్‌లో ఉన్నప్పుడు, సామాన్య ప్రజల గురించి ఏమి చెప్పాలన్నారు. ఒక ఐఎఎస్ అధికారి దంపతుల పేర్లు తప్పిపోయినట్లు తాను విన్నానన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా పాలక ఎన్‌డిఎకు ఇసి సహాయం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ రానున్న ఎన్నికలను బహిష్కరిస్తానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముసాయిదా జాబితాలో బిజెపి నాయకుడి పేరు తప్పిపోయిందో లేదో చూడాలనుకుంటున్నాను వ్యాఖ్యానించారు.

**అంతా అబద్ధం : ఇసి**

బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) తర్వాత విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో తన పేరు లేదని, తాను ఎన్నికల్లో ఎలా పోటీ చేయాలని ఆర్‌జెడి అగ్రనేత తేజస్వియాదవ్ ప్రశ్నించడం పై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఓటర్ల జాబితాలో తన పేరు లేదని తేజస్వీ యాదవ్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అబద్ధమని, జాబితాలో ఆయన పే రు ఉన్నదని తెలిపింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో సీరియల్ నెంబర్ 416 తో తేజస్వీయాదవ్ ఓటు ఉన్నదని ఇసి వెల్లడించింది. కాబట్టి ఓటర్ల జాబితాలో తన పేరు లేదని తేజస్వియాదవ్ చేస్తున్న ప్రచారమంతా శుద్ధ అబద్ధమని పేర్కొంది.

## బాత్రూమ్‌లో జారిపడ్డ జార్ఖండ్ మంత్రి..

### బ్రెయిన్ ఇంజూరీతో ఆస్పత్రిలో చేరిక.. పరిస్థితి విషమం

**రాంచి :** జార్ఖండ్ మంత్రి ఒకరు ప్రమాదవశాత్తూ బాత్రూమ్‌లో జారి పడ్డా రు. దీంతో బ్రెయిన్ ఇంజూరీతో ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం మంత్రి పరిస్థితి విషమంగా ఉంది. జార్ఖండ్ విద్యాశాఖ మంత్రి రాందాస్ సోరెన్ శనివా రం ఉదయం తన ఇంట్లోని బాత్రూమ్‌లో జారిపడ్డారు. దీంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు మంత్రిని హుటాహుటిన జంషెడ్‌పూర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంత్రి మెదడులో రక్తం గట్టకట్టినట్లు వైద్యు లు గుర్తించారు. ఈ మేరకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆయన్ని ఢిల్లీ ఆస్పత్రికి తరలించినట్లు జార్ఖండ్ ఆరోగ్య మంత్రి ఇర్ఫాన్ అన్సారీ తెలిపారు. మరోవై పు రాందాస్ సోరెన్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని బిజెపి సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి అర్జున్ ముండా తెలిపారు. సోరెన్‌ను హె లికాప్టర్ ద్వారా ఢిల్లీ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఢిల్లీ అపోలో డైరెక్టర్ తో మాట్లాడినట్లు తెలిపారు. మంత్రి ఆస్పత్రికి చేరుకున్న వెంటనే చికిత్స ప్రారంభిస్తారని జంషెడ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో విలేకరులతో మాట్లాడుతూ అన్నారు.

# 'ఆ అణుబాంబును' వెంటనే పేల్చాలి

- రాహుల్‌గాంధీ ఆరోపణలపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కౌంటర్
- పేలేటప్పుడు హాని కలగకుండా చూసుకోవాలని ఎద్దేవా
- పాట్నాలో జరిగిన ఒక 'మీడియా హౌస్ కార్యక్రమం'లో బిజెపి మాజీ చీఫ్ రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగం



**పాట్నా :** త్వరలో జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పట్టుసాధించేందుకు పదునైన విమర్శ నాస్త్రాలతో కేంద్రంలోని అధికార బిజెపి, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు అక్కడ ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. బిహార్‌లో ఓట్ల చౌర్యానికి పాల్పడేందుకు ప్రయత్నిస్తున్న ఎన్నికల సంఘం (ఇసి), భారతీయ జనతాపార్టీ అవకతవకలను రుజువుచేసే 'ఆటంబాంబు సాక్ష్యం' తన వద్ద ఉందని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ ఆరోపించడంపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. రాహుల్‌గాంధీ ఆయన వద్ద ఉన్న అణు బాంబును పేల్చనివ్వండి అని ఎద్దేవా చేశారు. 'భారత ఎన్నికల సంఘం గురించి మేం సొంతంగాదర్యాప్తు జరిపి ఆటంబాంబు లాంటి ఆధారాలను గుర్తించాం. ఆ ఆటంబాంబు పేలినరోజు ఎన్నికల సంఘం దాక్కోవడానికి అవకాశమే ఉండదు' అని ఇటీవల లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తొలగింపు విషయమై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. రాహుల్ ఆరోపణలకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బిహార్ నుంచే కౌంటర్ ఇచ్చారు. ఆదివారం నాడు బిహార్ రాజధాని పాట్నాలో ఒక మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. బిహార్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికలను 'ఒక క్రాస్‌రోడ్డు' అని రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఒక మార్గం (ఎన్‌డిఏ కింద ) బిహార్ ప్రగతికి దారితీయనుందని, మరొక మార్గం (ఇండియా కూటమి కింద) బిహార్‌ను పాత చట్ట విరుద్ధత , కుల కలహాల యుగానికి తిరిగి వెనక్కి తీసుకెళుతుందని రక్షణ మంత్రి విపులీకరించారు. 'రాహుల్‌గాంధీ ఆయన వద్ద అణుబాంబు ఉందని చెబుతున్నారు. అయితే ఆయన దానిని వెంటనే పేల్చాలి. ఆయనకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా తప్పించుకునేలా చూసుకోవాలి' అని రాజ్‌నాథ్ సింగ్ ఎద్దేవాచేశారు. రాహుల్ గత వాక్చాతుర్యాన్ని కూడా దేశం గుర్తుచేసుకుంటున్నదని అన్నారు. 'పార్లమెంట్‌కు భూకంపం వస్తుంది' అని గతంలో రాహుల్‌గాంధీ బెదిరించాడు. కానీ ఆయన ఎప్పుడైతే మాట్లాడారో అప్పుడు అది తడిసపనిగా (తుస్సుమని) మారిపోయిందన్నారు. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ఒక సంస్థగా తిరుగులేని స మగ్రతకు ఖ్యాతిని కలిగి ఉందని మంత్రి రాజ్‌నా థ్ సింగ్ కితాబిచ్చారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిపేందుకు ఎన్నికల సంఘం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. 'రాజ్యాంగ విరుద్ధమైన సంస్థ అని ప్రకటనలు చేయడం ప్రతిపక్షనేత హోదాలో ఉన్న ఆయన నైజం అని బిజెపి నేత రాజ్‌నాథ్ సింగ్ రాహుల్‌గాంధీని తూర్పారబట్టారు. 1975లో ఎమర్జెన్సీ పీరియెడ్‌లో ప్రజాస్వామ్యాన్ని హత్యచేయడానికి ప్రయత్నించిన తన సొంతపార్టీ కూడా ఇదే బా టలో నడిచిందని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీకి రాజ్‌నాథ్‌సింగ్ పరోక్షంగా గుర్తుచేశారు. 20ఏళ్ల పాలనలో బిహార్ రాష్ట్రాన్ని ప్రగతిపథం దిశగా మలుపుతిప్పిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల భాగస్వామి నితీశ్‌కుమార్‌ను ఆయన ప్రశంసల్లో ముంచెత్తారు. 11సంవత్సరాల క్రితం ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిహార్ రాష్ట్ర ప్రగతి ఊపందుకుందన్నారు. ఎన్‌డిఏ ప్రభుత్వం బిహార్‌కు రూ.9లక్షల కోట్ల సహాయాన్ని అందించిందన్నారు. అంతకుముందు బిహార్‌లో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఏ ప్రభుత్వం ఒక దశాబ్దకాలంలో కేవలం రూ.2క్షల కోట్లు మాత్రమే ఇచ్చిందని ఎత్తిచూపారు.

## మోదీ, యోగి పేరు చెప్పాలని ఒత్తిడి

### మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ ఆరోపణ



**న్యూఢిల్లీ:** మాలెగావ్ పేలుడు కేసులో నిర్దోషిగా బయటపడిన మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ కేసు విచారణ సమయంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించిన తీరుపై విమర్శలు చేశారు. ప్రధాని మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ పేర్లు చెప్పాలని తనపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 'బిజెపి సీనియర్ నాయకుడు రామ్ మాధవ్ సహా పలువురి పేర్లు చెప్పాలని నాపై ఒత్తిడి తెచ్చారు. నన్ను హింసించారు. నన్ను ఆసుపత్రిలో అక్రమంగా నిర్బంధించారు. నేను గుజరాత్‌లో నివసించడం వల్ల మోదీ పేరు కూడా చెప్పించాలని చూశారు. నేను అబద్ధాలు చెప్పాలని వారు ప్రయత్నించారు. అవి అబద్ధాలు కావడంతో నేను ఎవరి పేరు చెప్పలేదు' అని ప్రజ్ఞ శనివారం మీడియాకు చెప్పారు. మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు విచారణ బందంలో ఉన్న మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ కూడా ఇలాంటి ఆరోపణలే చేసిన సంగతి తెలిసిందే. మోహన్ భగవత్‌ను అరెస్టు చేయాలని అప్పట్లో తనకు ఆదేశాలు వచ్చాయని ఆయన తెలిపారు. మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురోహిత్‌తో పాటు రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి ప్రధాన నిందితులుగా కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదనలో చాలా లోటుపాట్లు ఉన్నాయని ఎన్ఐఏ కోర్టు తెలిపింది. 'ఈ పేలుడుకు వినియోగించిన మోటార్‌బైక్... మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ పేరు మీద రిజిస్టర్ అయిందని ప్రాసిక్యూషన్ చేసిన వాదనకు తగిన సాక్ష్యాధారాలు లేవు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ మినహా ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవు' అని తీర్పు వెలువరించింది.

# రష్యా, అమెరికా మధ్య ఉక్రేన్ మంట




**మాస్కో:** ఉక్రేన్‌తో పది రోజుల్లో కాల్పుల విరమణ ఒప్పందానికి సిద్ధం కావాలని పుతిన్‌ను బెదిరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా అంతర్జాతీయ జలాల్లోని కీలకమైన ప్రాంతాలలో రెండు అణు జలాంతర్గాములు మోహరించాలని నౌకా దళానికి ఆదేశించారు. ఉక్రేన్ విషయంలో తన మధ్యవర్తిత్వానికి తలొగ్గడంలేదని, పుతిన్ తన మాట లెక్కచేయడంలేదని ఆగ్రహించిన ట్రంప్ రష్యాను రోజుకో రీతిన బ్లాక్‌మెయిల చేస్తున్నారు. ఉక్రేన్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి రావాలని కోరుతూ జులై 28 వ తేదీన ట్రంప్ ఏకపక్షంగా విధించిన 10–12 రోజుల గడువుపై రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వెదేవ్ తీవ్రంగా స్పందించారు. సోవియట్ యూనియన్ కాలంనాటి అణువ్యవస్థలు మహాసముద్రాలలో తమకు చాలా ఉన్నాయని వ్యాఖ్యానించడంతో ట్రంప్ ఆగ్రహించారు. రష్యాతో ట్రంప్ హెచ్చరికల గేమ్ ఆడుతున్నారని మెద్వెదేవ్ విమర్శించారు. ''ట్రంప్ రెండు విషయాలు గుర్తుపెట్టుకోవాలి, రష్యా అంటే ఇజ్రాయెల్, ఇరాన్ దేశమో కాదు, ఇక రెండో విషయం ఆయన చేసే ప్రతి హెచ్చరికా ఒక బెదిరింపే, ఇది యుద్ధానికి చేరువ చేసే బెదిరింపే, అది రష్యా–ఉక్రేన్ మధ్య కాదు, ఆయన సొంత దేశంతో యుద్ధం దిశగా బెదిరింపు'' అని మెద్వెదేవ్ అనడంతో ట్రంప్ ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నారని భావిస్తున్నారు. మెద్వెదేవ్ ఏ వ్యాఖ్యలు చేయడంవల్ల ఇంత తీవ్ర నిర్ణయం తీసుకున్న రన్న విషయంపై ట్రంప్ తనకు తానుగా పూర్తి వివరణ ఇవ్వలేదు. మెద్వెదేవ్ చాలా రెచ్చగొట్టే ప్రకటనలు చేశారని మాత్రం ట్రంప్ అన్నారు. ఈ జలాంతర్గాములను రోజువారీ సాధారణ పర్యవేక్షణకోసం మోహరించారా? లేక ప్రత్యేక కారణాలతో మోహరించారా? అనే అంశంపై కూడా స్పష్టత లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి ఘటనలైనా జరిగే అవకాశం ఉన్నందువల్ల ముందస్తు జాగ్రత్త పాటించాలని నౌకాదళానికి ఆదేశించినట్లు ట్రంప్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. రష్యాకు ఇచ్చిన గడువు వచ్చేవారంతో ముగిసిపోతూ ఉండటంతో ఈ విషయంపై చర్చలు జరిపేందుకు తమ ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్ రష్యాకు పయనమవుతున్నారని కూడా ట్రంప్ చెప్పారు. ఉక్రేన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం గురించి పుతిన్‌పై ఒత్తిడి చేసేందుకు ఆయన వెళుతున్నారు. ఈసారి కాల్పుల విరమణకోసం చర్చల బల్ల వద్దకు రాకపోతే అతి తీవ్రమైన ఆర్థిక ఆంక్షలు విధిస్తామని ట్రంప్ ఇప్పటికే రష్యాకు హెచ్చరిక చేశారు. మొదట ఆయన పుతిన్‌కు ఉక్రేన్ విషయంలో 50 రోజులు గడువు ఇచ్చారు. తర్వాత ఈ గడువును 12 లేదా పది రోజులకు తగ్గించారు.పుతిన్ వైఖరితో తాను విసిగిపోయానని ట్రంప్ ఇటీవల పదే పదే అన్నారు.

**రష్యాపై ఉక్రేన్ డ్రోన్ల దాడి, ముగ్గురు పౌరులు మృతి**

పశ్చిమ రష్యాలో ఉక్రేన్ చేసిన దాడుల్లో ఒక మహిళ సహా ముగ్గురు పౌరులు మరణించారు. శనివారం తెల్లవారకముందుగానే ఈ దాడులు జరిగాయి. రష్యా రక్షణ మంత్రిత్వశాఖ ఈ విషయం ప్రకటించింది. 12 డ్రోన్లను రష్యా దళాలు ధ్వంసం చేశాయని పేర్కొంది. రష్యాలోని ఎనిమిది ప్రాంతాలలో ఈ దాడులు జరిగాయి. రష్యా ఆక్రమణలో ఉన్న క్రిమియా ద్వీపకల్పంలోనూ ఉక్రేన్ డ్రోన్ల దాడులు చేసింది. సరిహద్దుల్లో ఉన్న రష్యా ప్రాంతం రోస్టోవ్‌పై డ్రోన్ల దాడి జరిగిందని ఆ ప్రాంత గవర్నర్ యూరీ స్లూసార్ చెప్పారు. రష్యా తమపై 53 డ్రోన్లతో దాడి చేసిందనీ, 45 డ్రోన్లను జామర్ల ద్వారా కూల్చివేశామని ఉక్రేన్ ప్రకటించింది. ఖార్కీవ్ ప్రాంతంలో జరిగిన దాడిలో 11 మంది గాయపడినట్లు తెలిపింది.

**కీలక జలాల్లో అణు జలాంతర్గాముల మోహరింపు**






## మక్కికి మక్కీ..




కొన్ని సంఘటనలు జనాలకు నవ్వు, బాధితులకు కోపం తెప్పిస్తాయి. భారత రాజధాని న్యూఢిల్లీలో ఇటీవల ఓ కేక్‌పై రాసిన సందేశం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన తల్లి పుట్టిన రోజును సెలబ్రేట్ చేసుకోవడానికి ఓ వ్యక్తి బేకరీలో కేక్ ఆర్డర్ చేశాడు. 'హ్యాపీ బర్త్ డే మమ్మీ' అని రాసి, 'కేక్‌పై ఈ సందేశం ఉండేలా చూడండి' అంటూ నోట్ పెట్టాడు. ఆర్డర్ చేసినట్టే కేక్ వచ్చింది. అయితే, దానిని చూసిన అతనికి మూర్ఛ వచ్చినంత పనైంది. కేక్‌పై చక్కగా 'హ్యాపీ బర్త్ డే మమ్మీ' అని రాసి ఉంది. కానీ, కింద భాగంలో 'కేక్‌పై ఈ సందేశం ఉండేలా చూడండి' అంటూ వారికి చేసిన సూచనను కూడా కేక్‌పై కనిపించింది. సోషల్ మీడియాలో అతను ఉంచిన ఈ పోస్ట్‌పై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం విశేషం. కేక్ తయారీదారుల నిర్లక్ష్యాన్ని క్షమించకూడదని కొంత మంది భావిస్తే, మరికొంత మంది కేక్‌కు చెల్లించిన డబ్బు వాపసు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేయాలని సూచించారు. కొంత మంది దీనిని 'మానవ తప్పిదం'గా చూడాలంటే, మరికొందరు 'ఇంగ్లీషు చదవడం రాని వాళ్లు ఈ కేక్‌ను తయారు చేసి ఉండవచ్చు. చూసీచూడనట్టు వెళ్లాలి. అయినా మీకు కేక్ ముఖ్యంగానీ, దానిపై ఏం రాసి ఉందో కాదుకదా? ఎలాగూ కేక్‌ను కట్ చేస్తారు కాబట్టి సమస్య ఉండదు' అంటూ హితవు పలికారు. ఏదిఏమైనా ముద్రా రాక్షసాలు కేవలం వార్తా పత్రికల్లో లేదా పుస్తకాల్లోనే కాదు... కేక్‌లపై కూడా ఉంటాయని ఈ ఘటన రుజువు చేస్తున్నది.

## ఆడడానికి కాదు.. చూడడానికే!




న్యూయార్క్ సిటీలోని ఎంఎల్‌బి ఫ్లాగ్‌షిప్ స్టోర్‌కు చేరుకున్న బేస్‌బాల్ అందరినీ ఆకట్టుకుంటున్నది. అయితే, ఇది కేవలం చూడడానికి మాత్రమే పరిమితం. ఆడడానికి కాదు. ఎందుకంటే దీని వ్యాసం ఏకంగా 8 అడుగులు. ఇంత భారీ బేస్‌బాల్‌పై 6,750 సంతకాలు ఉన్నాయి. ఇన్ని సంతకాలతో కూడిన బంతిగా ఈ భారీ బేస్‌బాల్ గిన్నిస్ పుస్తకంలోనూ చోటు సంపాదించింది. గత ఏడాది కేంబ్రిడ్జి యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ 2,146 మంది సంతకాలతో కూడిన బంతిని ప్రదర్శించి, గిన్నిస్ రికార్డు నెలకొల్పితే, తాజా బేస్‌బాల్ ఆ రికార్డును బద్దలు కొట్టింది.

## అభిమానుల డిమాండ్..



సాధారణంగా క్రీడాకారుల అభిమానులు వారిని చూసేందుకు ఎగబడతారు. వీలుంటే కరచాలనం చేయడానికి, అవకాశం కుదిరితే సెల్ఫీ తీసుకోవడానికి ప్రయత్నిస్తారు. కానీ, అమెరికా ప్రఖ్యాత స్విమ్మర్ మైఖేల్ ఫెల్ప్స్ అభిమానులు అందుకు భిన్నంగా ప్రవర్తించారు. బాల్టిమోర్ రావెన్స్ అమెరికన్ ఫుట్‌బాల్ (రగ్బీ) జట్టు అంటే ఫెల్ప్ ఇష్టపడతాడు. ఆ జట్టులో అత్యధిక శాతం మంది ఆటగాళ్లకు ఈత రాదు. ఫిట్నెస్ కోసం స్విమ్మింగ్ బాగా ఉపయోగపడుతుందని నమ్మిన మేరీలాండ్‌లోని వందలాది మంది ఫెల్ప్స్ అభిమానులు రోడ్డుమీదకు వచ్చి, ప్రదర్శనలు నిర్వహించారు. బాల్టిమోర్ సభ్యులకు ఈత నేర్పించాలని అతనిని డిమాండ్ చేశారు. ఈ ఫొటోను బాల్టిమోర్ జట్టు కార్నర్‌బ్యాక్ స్పెషలిస్ట్ మార్లోన్ హంఫ్రె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. 23 ఒలింపిక్ పతకాలతో ప్రపంచ రికార్డు సృష్టించిన తిరుగులేని స్విమ్మర్ ఫెల్ప్స్ కూడా అభిమానుల డిమాండ్‌కు సానుకూలంగా స్పందించడం విశేషం. ఈత నేర్పిస్తానని హామీ ఇచ్చి, అభిమానులకు ఊరట కలిగించాడు.

## అరుదైన రికార్డులు..



'పెన్నీ ఫార్తింగ్'లో కెనడాకు చెందిన లిజాన్నే విల్మోట్ రెండు అరుదైన ప్రపంచ రికార్డులు సృష్టించింది. విక్టోరియన్ కాలంనాటి నమూనాలో ఉండే పెద్ద చక్రంతో కూడిన బైసికిల్‌ను నడిపించడాన్ని 'పెన్నీ ఫార్తింగ్'గా పేర్కొంటారు. అత్యంత కష్టమైన ఈ విభాగంలో విల్మోట్ ఒక కిలోమీటర్ దూరాన్ని 52.75 సెకన్లలో చేరి, కొత్త రికార్డు నెలకొల్పింది. ఆ క్రమంలోనే, ఒక దశలో గంటకు 25.92 మైళ్ల వేగాన్ని అందుకొని, మరో రికార్డును సొంతం చేసుకుంది. ఈ రెండు రికార్డులతో గిన్నిస్ పుస్తకంలో చోటు సంపాదించింది.

— బిఎస్ఎస్ మైత్రేయి

# జిఎస్‌టి సంస్కరణ ఆవశ్యకత

ప్రజాపక్షం
03-08-2025, ఆదివారం

జిఎస్‌టి 2025 జులై ఆదాయ సంఖ్యలు వెలువడ్డాయి. గత సంవత్సరం ఇదే నెల ఆదాయంతో పోల్చితే అది ఈ నెలలో 7.5 శాతం పెరిగి రూ.1.95 లక్షల కోట్లకు చేరింది. ఇది ప్రభుత్వానికి ఎంతో సంతోషం కలిగించే సమాచారం. కానీ తరచి చూస్తే లోపాలు బయటపడతాయి. దేశ అంతర్గత వినిమయంపై పన్ను వసూళ్ల వృద్ధి తక్కువ స్థాయిలో ఉండగా, దిగుమతులపై వృద్ధి పెరిగింది. రిఫండ్‌లు భారీగా పెరిగాయి, ప్రాంతీయ అసమానతలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. 'ఒకే దేశం–ఒకే పన్ను' ప్రచారార్భాటంతో ఈ 'వస్తువులు–సేవల పన్ను' విధింపును పార్లమెంటు ప్రాంగణం నుంచి 'రెండవ స్వాతంత్రం' అన్నంత అట్టహాసంగా అర్ధరాత్రి ప్రకటించి 8 సంవత్సరాలు అవుతోంది. దీనివల్ల రాష్ట్రాల పన్ను విధింపు–వసూలు అధికారం కేంద్రీకృతమై, నిధుల విడుదలకు రాష్ట్రాలు కేంద్రం వైపు ఎదురుచూసే పరిస్థితిలో రాష్ట్రాల ద్రవ్య సార్వభౌమాధికారం కోతకు గురైంది. ఏ రాయి అయితేనేం పళ్ళు రాలగొట్టుకోవడానికి అన్నట్లుగా పన్ను పేరు ఏదైనా సామాన్య ప్రజలకు వనగూరిన మేలేమీ లేదు–మరింతగా పరోక్ష పన్నుల పీడన పెరగడం తప్ప. జిఎస్‌టిలో పన్ను శ్లాబులు అసమంజసంగా ఉన్నాయని, అసలే అధిక ధరలతో సతమతమవుతున్న ప్రజలకు ఉపశమనం నిమిత్తం అనేక నిత్యజీవితావసర సరుకులను కనీస శ్లాబులోకి తగ్గించాలనే ఘోష కేంద్ర ప్రభుత్వం చెవికెక్కించుకోలేదు. జిఎస్‌టి కౌన్సిల్‌ది నిర్ణయాధికారమంటూ తప్పించుకునే ప్రయత్నమే కొనసాగుతున్నది. జిఎస్‌టి పన్ను ఎగవేతలను అరికడుతుందని, ముడి సరుకు నుంచి వస్తువు విక్రయించే చివరి పాయింట్ వరకు అంతా కంప్యూటరే చూసుకుంటుందని భావించినప్పటికీ, తాడిని తన్నేవాడు ఒకడుంటే వాడి తలదన్నేవాడు మరొకడుంటాడని అన్నట్లు వందలు వేల కోట్లలో పన్ను ఎగవేతలు బయటపడుతున్నాయి. అయినా ఆర్థిక మంత్రిగారు తమ ఘనతగా చాటుకోవడానికి పెరుగుతున్న పన్ను వసూళ్ల సంఖ్యలను ఘనంగా ప్రస్తావిస్తుంటారు.

జులై నెల రెవెన్యూ పెరుగుదలను విశ్లేషిస్తే, ఇబ్బందికరమైన అసమతౌల్యాలు వెల్లడవుతాయి. దిగుమతుల నుంచి జిఎస్‌టి వసూలు 9.7 శాతం పెరిగింది. కాగా దేశీయ లావాదేవీల నుంచి వృద్ధి 6.7 శాతమే. దేశీయంగా వస్తూత్పత్తి పెంపు చేయడం, స్వావలంబన, సరఫరాల రవాణా చెయిన్ బలంగా ఉండటం, వగైరా ప్రభుత్వ ప్రకటిత లక్ష్యాల వైఫల్యాన్ని ఈ సంఖ్యలు సూచిస్తున్నాయి. దేశీయ మార్కెట్‌కన్నా దిగుమతుల ఆర్థిక వ్యవస్థ మీదే ఎక్కువగా ఆధారపడుతున్నాం. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ (స్వావలంబన) భారత్ నినాదాలు ఏమైనట్లు? మన దేశం సరుకులనే కాదు, వృద్ధిని కూడా భారీగా దిగుమతి చేసుకుంటున్నదన్న మాట!

జులై సంఖ్యలో మరో ఆందోళనకరమైన అంశం కూడా ఉంది. కోవిడ్ మహమ్మారి తర్వాత తొలిసారి జిఎస్‌టి దేశీయ నికర రెవెన్యూ సంవత్సరం/సంవత్సరం ప్రాతిపదికన తగ్గింది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గుదలను సూచిస్తున్న ఈ లక్షణం జిఎస్‌టి సమర్థతకు కొలబద్ధ కాబోదు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు మాసాల్లో (ఏప్రిల్–జులై) దిగుమతులపై పన్ను ఆదాయం 16శాతం పెరగ్గా, దేశీయంగా పెరుగుదల 9 శాతం మాత్రమే. అంత వ్యత్యాసం ఆర్థిక వ్యవస్థకు మంచిది కాదు.

జులై డేటాలో మరో ముఖ్యాంశం జిఎస్‌టి రిఫండ్స్‌లో 66.8 శాతం పెరుగుదల. గత సంవత్సరం ఇదే నెలతో పోల్చుకుంటే దేశీయ రిఫండ్‌లు 117.6 శాతం పెరిగాయి. జిఎస్‌టి వ్యవస్థ లోపల ఉన్న లోతైన లోపాలకు ఇది నిదర్శనం. మరో ఆందోళనకరమైన అంశం–రాష్ట్ర స్థాయి ఆర్థిక కార్యకలాపాల్లో వ్యత్యాసాలు. పారిశ్రామికంగా, ఆర్థికంగా ప్రాముఖ్యత గల రాష్ట్రాలలో పన్ను వసూళ్లలో వృద్ధి తక్కువగా ఉంది. ఉదాహరణకు ఢిల్లీ (2 శాతం), గుజరాత్ (3), రాజస్థాన్ (4), మహారాష్ట్ర (6), కర్ణాటక (7), తమిళనాడు (8) శాతం. ఇది ఆర్థికవ్యవస్థలో మందకొడితనాన్ని సూచిస్తున్నది.

అందువల్ల, ఆర్థికమంత్రి స్థూల సంఖ్యలతో సంబరపడక, లోతైన విశ్లేషణతో లోపాలను సరిదిద్దుకోవాలి. పన్ను ఆదాయం కాలక్రమంలో గణనీయంగా పెరుగుతున్నందున పేదలు, ఇతర సామాన్య ప్రజలకు ఉపశమనం చేకూర్చే విధంగా నిత్య జీవితావసర వినిమయ వస్తువులపై పన్ను మినహాయించాలి లేదా కనీస స్లాబ్‌లోకి మార్చాలి. రానున్న జిఎస్‌టి కౌన్సిల్ సమావేశానికి కేంద్రం ఈ మేరకు ప్రతిపాదనలు సమర్పిస్తే కాదనే రాష్ట్రం ఉండదు.

# మధ్య ఆసియాలో సరికొత్త 'గ్రేట్ గేమ్'

పాయ్‌టర్ ఒపలిన్‌స్కీ
(అంతర్జాతీయ సంబంధాల కేంద్రం, పోలెండ్)

అపారమైన ప్రకృతి వనరులు, ఖనిజ సంపదతో విరాజిల్లే మధ్య ఆసియాపై ఆధిపత్య పోరాటం కొత్త రూపాన్ని దాల్చుకుంటున్నది. ఈ ప్రాంతం ఒక శతాబ్దానికిపైగా బాహ్య శక్తుల మధ్య ఆధిపత్య పోరాటాలకు వేదికగా నిలిచింది. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో, నాటి సోవియట్ యూనియన్ (యుఎస్ఎస్ఆర్), అమెరికా మధ్య నలిగిపోయింది. అయితే, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో, మధ్య ఆసియా తన సొంత వ్యూహాత్మక ఎజెండాను రూపొందిస్తున్నది. బహు ముఖంగా విస్తరిస్తున్నది. చైనా, అమెరికా, రష్యా, భారత్, యూరోపియన్ యూనియన్ (ఇయు)తోపాటు, ఈ ప్రాంతంలోని టర్కీ, ఇరాన్, పాకిస్తాన్, గల్ఫ్ దేశాలను కూడగట్టుకొని, నాటి 'గ్రేట్ గేమ్'కు కొత్త రూపాన్ని ఇస్తున్నది. నేడు మధ్య ఆసియా దేశాలు అనుసరిస్తున్న విధానాలు, నిన్నమొన్నటి వరకూ చోటు చేసుకున్న పరిణామాలను సమతుల్యం చేస్తున్నాయి. సమకాలీన 'గ్రేట్ గేమ్' ఒకప్పటి మాదిరిగా ముడి పదార్థాలు, వాణిజ్య రవాణా మార్గాల కోసం మాత్రమేగాక, సాంకేతిక, డిజిటల్, సంస్థాగత ఆధిపత్యం వంటి అంశాల్లో పోటీగా కూడా మారింది. సామర్థ్యం, వ్యవస్థాగత స్థితిస్థాపకత, రాజకీయ షరతులు లేకుండా పరస్పర సహకారం, వివిధ యంత్రాంగాల ప్రత్యామ్నాయ నమూనాలు ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయి. ఒకప్పుడు పరాధీనంగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు స్వయం ప్రతిపత్తి సంతరించుకుంటున్నది. కొత్త యూరో–ఏషియన్ వ్యవస్థ ఆవిర్భావానికి కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నది. గతంలో ఆధిపత్యం చెలాయించిన దేశాలు ఇప్పుడు మధ్య ఆసియా దేశాలు కొత్త రూపురేఖలు సంతరించుకోవడానికి సహకరించే పరిస్థితి నెలకొంది. 2023 మే మాసంలో, జియాన్ వేదికగా చైనా, మధ్య ఆసియా దేశాల నాయకుల మధ్య మొదటి శిఖరాగ్ర సమావేశం (సి+సి5 ఫార్మాట్)లో పరస్పర సహకారానికి శాశ్వత వేదిక ఏర్పాటైంది. ఇందులో రాజకీయ, మౌలిక సదుపాయాలు, శక్తి, ఇత్యాది రంగాల్లో సహకారానికి సంబంధించిన మొత్తం 19 అంశాలు ఉన్నాయి. మధ్య ఆసియాతో తమ సంబంధాల్లో కొత్త స్వర్ణయుగం ఆరంభమైందని చైనా వ్యాఖ్యానించింది. డిజిటల్, పర్యావరణ వస్తువులను అందించేందుకు రాచబాట ఏర్పడుతుందని పేర్కొంది. ఇంధనం, విద్య, సాంకేతికాది రంగాల్లో సహకారం, ప్రాంతీ య అభివృద్ధికి ప్రత్యేక పెట్టుబడుల కోసం నిధులు ఏర్పాటు తదితర ప్రతిపాదనలు చేసింది. అస్తానాలో ఈ ఏడాది జూన్‌లో జరిగిన రెండవ శిఖరాగ్ర సమావేశంలో, సి+సి5 ఫార్మాట్ కోసం శాశ్వత సచివాలయాన్ని కజకిస్తాన్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి డాటా సెంటర్, కొత్త టెక్నాలజీ మార్పిడి వేదిక 'చైనా–మధ్య ఆసియా డిజిటల్ హబ్' నిర్మాణం తదితర ప్రణాళికలను ఆమోదించారు. ఈ విధంగా, రష్యా, పశ్చిమ దేశాల ప్రభావాన్ని పరిమితం చేస్తూ, షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) ఫ్రేమ్‌వర్క్ వెలుపల మధ్య ఆసియాలో తన ఉనికిని సంస్థాగతీకరించడానికి చైనా ప్రయత్నిస్తున్నది. సి+సి5 ఫార్మాట్ ఈ ప్రాంత రిపబ్లిక్‌లకు మరింత ఆకర్షణీయంగా మారుతోంది, వేగవంతమైన పెట్టుబడి, రాజకీయ షరతులు లేకపోవడంతో సహకార మార్గాలు వైవిధ్యాన్ని సంతరించుకోనున్నాయి. ఈ నమూనా మధ్య ఆసియాలో భౌగోళిక రాజకీయ శక్తి సమతుల్యతను గణనీయంగా మారుస్తుంది. ఈ ప్రాంతం బీజింగ్‌పై ఆధారపడటాన్ని పెంచుతుంది. దాని వ్యూహాత్మక స్థానాన్ని బలోపేతం చేస్తుంది.

అదే విధంగా, మధ్య ఆసియా దేశాలతో భారత్ నిరంతర భాగస్వామ్యాలను అభివృద్ధి చేస్తోంది. కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, తుర్క్‌మెనిస్తాన్ వంటి దేశాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, ఆర్థిక, సాంకేతిక, విద్యా సంబంధాలను బలపరచుకుంటున్నది. 'ఇండియా–సెంట్రల్ ఆసియా డైలాగ్' 2019 నుండి అమలులో ఉంది. 2022 జనవరిలో జరిగిన 'వర్చువల్ లీడర్స్ సమ్మిట్' ద్వారా దీని ప్రాముఖ్యత మరింత పెరిగింది. 2025 మే మాసంలో, నరేంద్ర మోదీ ప్రభుత్వం సమగ్ర 'ఇండో–యురేషియన్ కనెక్ట్ 2025' వ్యూహాన్ని ప్రకటించింది. రవాణా మౌలిక సదుపాయాల అభివృద్ధి (చబహార్ పోర్ట్, నార్త్‌సౌత్ కారిడార్), సాంకేతిక సహకారం (ఐటి, సైబర్ సెక్యూరిటీ, ప్రెసిషన్ అగ్రికల్చర్), విద్య, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్‌లలో ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)ను ఏర్పా టు చేయడం కూడా ఈ ప్రణాళిక లక్ష్యాల్లో ఒకటి. మధ్య ఆసియాలో పరస్పర సహకారం, భాగస్వామ్య ఆధారిత అభివృద్ధిలో కీలకంగా మారడానికి సాంకేతిక దౌత్యం, విద్యా సహకారం వంటి మృదువైన శక్తి సాధనాలను భారత్ ఉపయోగిస్తున్నది. చైనా, పాకిస్తాన్ ప్రభావాన్ని సమతుల్యం చేయడానికి, తన యురేషియన్ విదేశాంగ విధానాన్ని విస్తరించడానికి మధ్య ఆసియాను ఒక కీలకమైన ప్రాంతంగా భారత్ భావిస్తున్నది.

సామూహిక భద్రతా ఒప్పంద సంస్థ (సిఎస్‌టిఒ), యురేషియన్ ఆర్థిక సంఘం (ఇఎఇయు), ఎస్‌సిఒలలో రష్యా కీలక పాత్ర పోషిస్తున్నది. తద్వారా, మధ్య ఆసియా ప్రాంతంలో తన రాజకీయ, సైనిక ప్రభావాన్ని కొనసాగించడానికి ప్రయత్నిస్తున్నది. అయితే, మాస్కోపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ తదితర దేశాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. అంతేగాక, రష్యా తదితర దేశాలతో తమ సంబంధాలను మరింత సమాన స్థాయిలో పునర్నిర్వచించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. తత్ఫలితంగా రష్యాకు మధ్య ఆసియాలో ప్రతిఘటనలు తప్పకపోవచ్చు. ఇక, ఇయు సి5 ఫ్రేమ్‌వర్క్ ద్వారా మధ్య ఆసియా దేశాలతో సహకారాన్ని యూరోపియన్ యూనియన్ (ఇయు) పెంపొందించుకుంటున్నది. రాజకీయ చర్చలు, అభివృద్ధి అవకాశాలను బలోపేతం చేస్తోంది. 2025 ఏప్రిల్‌లో జరిగిన సమర్‌కండ్ సమ్మిట్‌లో, గ్లోబల్ గేట్‌వే వ్యూహంలో భాగంగా 12 బిలియన్ యూరోల పెట్టుబడి ప్యాకేజీని ప్రకటించారు. ఈ నిధులను ఇంధనం (6.4 బిలియన్), రవాణా (3 బిలియన్), కీలకమైన ముడి పదార్థాలు, డిజిటలైజేషన్ (2.5 బిలియన్) తదితర రంగాలకు కేటాయిస్తారు. మొత్తం మీద మధ్య ఆసియాలో చైనా లేదా రష్యాతో ఇయు నేరుగా పోటీపడడం లేదు. కానీ పారదర్శకత, స్థిరమైన అభివృద్ధి, అధిక పర్యావరణ ప్రమాణాలు, కార్మిక నిబంధనల ఆధారంగా సహకారానికి ప్రత్యామ్నాయ నమూనాను ప్రతిపాదించడం ద్వారా పరోక్షంగా పోటీలో ఉంది.

భద్రత, ఇంధనం, విద్య, ప్రాంతీయ సార్వభౌమత్వానికి మద్దతు వంటి రంగాలలో సహకారానికి వేదికగా 2015లో ప్రారంభమైన సి5+1 ఫార్మాట్‌లో మధ్య ఆసియా దేశాలతో అమెరికా చర్చలు, సంప్రదింపులు నిర్వహిస్తోంది. ఈనెలలో, ఉజ్బెక్ విదేశాంగ మంత్రిని కలిసిన అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పలు కీలక రంగాలలో నిరంతర సహకారాన్ని ధ్రువీకరించారు. ఇంధన పరివర్తన, డిజిటలైజేషన్, సరఫరా గొలుసు భద్రతతోపాటుగా, ప్రాంతీయ వాణిజ్య నిర్మాణంలో అఫ్గానిస్థాన్ పాత్రను పెంచేందుకు పరస్పర సహకారాన్ని ప్రకటించారు. ఆర్థిక సహకారం, లాజిస్టిక్స్, ఇ–కామర్స్, పునరుత్పాదక ఇంధన వనరులు, పర్యాటకంపై దృష్టి సారించిన బి5+1 (వ్యాపారం 5+1) చొరవ ద్వారా, మధ్య ఆసియాలో అమెరికా రాజకీయ ముఖ చిత్రానికి ఒక రూపాన్నిచ్చారు. ఇదే సమయంలో, మధ్య ఆసియా దేశాలు ఎక్కువగా సమతుల్య వ్యూహాన్ని అవలంభిస్తున్నాయి. అన్నివైపుల నుంచి వస్తున్న సహకారాన్ని ఉపయోగించుకుంటున్నాయి. అయితే, ఏ ఒక్క వర్గం లేదా కూటమికి కట్టుబడి ఉండకుండా సంయమనం పాటిస్తున్నాయి. అందుబాటులో ఉన్న ఆర్థిక సహకారంతో, మౌలిక సదుపాయాల కల్పనకు బహుముఖ విస్తరణ విధానం ఆచరణాత్మమని గుర్తించి, అదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఇంధన పరివర్తన, భద్రతా విధానాల్లో యురేనియం, లిథియం వంటి ముడి పదార్థాలు కీలకపాత్ర పోషిస్తాయి. ఇవి పుష్కలంగా ఉన్న మధ్య ఆసియా సహజంగానే ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న పోటీకి కీలకమైన ప్రాంతంగా మారింది. యురేనియం ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ దేశాల పట్ల చైనా, రష్యా, ఫ్రాన్స్ దేశాలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. అక్కడి నిక్షేపాలను పొందడం మాత్రమేగాక, ప్రాసెసింగ్, లాజిస్టిక్స్, అణు సాంకేతిక పరిజ్ఞానంపై నియంత్రణకు కూడా ఈ దేశాలు పోటీపడుతున్నాయి. కాగా, మధ్య ఆసియాను తన కీలకమైన ముడి పదార్థాల సరఫరాను వైవిధ్యభరితం చేయడానికి ఒక అవకాశంగా ఇయు భావిస్తోంది. 'క్రిటికల్ రా మెటీరియల్స్ యాక్ట్ ప్రోగ్రామ్' కింద, ఇఎస్‌జి ప్రమాణాలకు అనుగుణంగా పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నది. తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ వంటి దేశాల నుంచి ముడిసరుకుల నిరంతర సరఫరా ఒప్పందం కుదిరితే, ఆయా దేశాలకు యూరోపియన్ మార్కెట్‌లో ప్రాధాన్యతను కల్పించే అవకాశాలను కూడా ఇయు పరిశీలిస్తున్నది. మధ్య ఆసియా తెల్లబంగారంగా పేర్కొనే లిథియం భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నది. ఆసక్తి కనబరుస్తున్న దేశాలతో చర్చించి, తమకు అనుకూలమైన ఒప్పందాలను కుదుర్చుకునే స్థాయికి మధ్య ఆసియా దేశాలను చేర్చింది. అరుదైన ముడిపదార్థాలను వెలికితీయడానికి లేదా సరఫరా చేయడానికి మధ్య ఆసియా దేశాలు సాంప్రదాయ విధానాలకు క్రమంగా వీడ్కో లు చెప్తున్నాయి. డేటా, డిజిటల్ ప్రమాణాలు, అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించే ప్రయ త్నం చేస్తున్నాయి. కజికిస్తాన్ ఇప్పుడు ఎక్కువగా ఐటి, అణుశక్తి అభివృద్ధి రంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నది. ఉజ్బెకిస్తాన్ ఇ–గవర్నెన్స్‌ను అమలు చేస్తున్నది. చైనా అందిస్తున్న సాంకేతిక సహకారంతో తుర్కమెనిస్తాన్ పలు ఆధునిక వైజ్ఞానిక ప్రయోగాలు చేస్తున్నది. 5జి మౌలిక సదుపాయాల ఏర్పాటు, డేటా కేంద్రాల అభివృద్ధి, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ రంగాల్లో ప్రపంచ దేశాల మధ్య నెలకొన్న వ్యూహాత్మక పోటీ, ఇప్పుడు మధ్య ఆసియా దేశాల రంగ ప్రవేశంతో కొత్త ఒరవడిని సంతరించుకుంటున్నది. పశ్చిమ దేశాలతో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, చైనా అధికారిక డిజిటల్ మోడల్‌వైపు మధ్య ఆసియా దేశాలు మొగ్గు చూపుతున్నాయి. పారదర్శకత, డేటా రక్షణ, సాంకేతిక సంస్థల నియంత్రణ తదితర రంగాల్లో పాశ్చాత్య దేశాలకు ప్రత్యామ్నాయంగా చైనా టెక్నాలజీని భావిస్తున్నాయి. మొత్తం మీద, ముడిసరుకుల ఎగుమతుల నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం వరకూ అనేకానేక రంగాల్లో మధ్య ఆసియా దేశాలు బహుళ విస్తరణ విధానాన్ని అవలంభిస్తున్నాయి. ఒకే అధికార కేంద్రానికి లోబడి ఉండడాన్ని వ్యూహాత్మకంగా నివారిస్తున్నాయి. టర్కీతో కజకిస్తాన్ సన్నిహిత భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేస్తోంది. ఇయుతో ఉజ్బెకిస్తాన్ సంప్రదింపులు నెరపుతోంది. పరస్పర సహకార చర్చలను తీవ్రతరం చేస్తోంది. కాగా, తుర్క్మెనిస్తాన్ స్వయంప్రతిపత్తి ఇంధన సంబంధాలలో పెట్టుబడి పెడుతోంది. ప్రపంచ దేశాలు పోటీపడడానికి ఒక కేంద్రంలా కాకుండా, మధ్య ఆసియా దేశాలు ఇప్పుడు స్థిరత్వం, వైవిధ్యం, అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నాయి. ఆ దిశగానే అంతర్జాతీయ సంబంధాలను పెంచుకుంటున్నాయి. ఏ ఒక్క బలమైన కూటమి లేదా కేంద్రం ఆధిపత్యం కిందకు వెళ్లకుండా, సమతుల్య నెట్‌వర్క్‌ను రూపొందించుకోవాలని, స్వతంత్రంగా ఎదగాలని చూస్తున్నాయి. ఈ ప్రయత్నంలో ఈ దేశాలు ఎంత వరకూ సఫలమవుతాయో చూడాలి. సొంత ప్రయోజనాల కోసం బాహ్య శక్తుల బలమైన పోటీమధ్య సంతుల్యతను కొనసాగించడం అనుకున్నంత సులభం కాదు. అదే విధంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవడం, ఉద్యోగాల రూపంలో అదనపు విలువలను కాపాడుకోవడం, పెరుగుతున్న ఒత్తిడిని తట్టుకొని స్వయంప్రతిపత్తిని రక్షించుకుంటూ నిర్ణయాలు తీసుకోవడం కూడా సవాళ్లతో కూడిన పయనమే. అయినప్పటికీ, ఈ అడ్డంకులను ఎదుర్కొంటూ, ఒత్తిళ్లను తట్టుకుంటూ, స్వతంత్ర వ్యూహాత్మక వాతావరణాన్ని రూపొందించుకుంటూ ముందుకు వెళుతున్న క్రమంలో 'గ్రేట్ గేమ్' కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నది.

# త్రిముఖ వ్యూహంతో ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధం




భవిష్యత్తు ఎన్నికల్లో ఓటు బ్యాంకును స్థిరపరుచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. తెలంగాణ రాజకీయ రణక్షేత్రంలో మూడు పార్టీలు ప్రధానంగా కనపడుతున్నాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బిఆర్ఎస్, అధికారం కోసం పోటీ పడుతున్న బిజెపి పార్టీలు కీలకంగా ఉన్నాయి. కాంగ్రెస్‌కు స్థిరమైన ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ, అది ప్రత్యర్థి ఓటు బ్యాంకును, చెదిరిపోయిన పాత ఓటు బ్యాంకును దరి చేసుకునేందుకు ప్రణాళికబద్ధంగా సాగుతున్నది. ముఖ్యంగా ప్రత్యర్థి పార్టీలకు అడ్డుకట్ట వేసేందుకు త్రిముఖవ్యూహం రచించింది. అందులో భాగంగానే బిసి రిజర్వేషన్‌ల అంశం, దళితుల వర్గీకరణ, గత ప్రభుత్వ అవినీతిపై విచారణ కమిషన్‌లు, సంక్షేమ పథకాలను అస్త్రంగా చేసుకుంటోంది.

కాంగ్రెస్ పార్టీకి గతంలో అండగా నిలిచిన ముస్లిం మైనారిటీ వర్గం బిఆర్ఎస్ వైపు వెళ్ళింది. ఆ తరువాత మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాన ప్రత్యర్థిగా బిజెపి అవతరించడంతో పాటు, మైనారిటీలలో పట్టున్న ఎంఐఎం కూడా కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంతో తెలంగాణలో ప్రతి నియోజకవర్గంలో గణనీయసంఖ్యలో ఉన్న ఈ వర్గం తిరిగి కాంగ్రెస్‌కు చేరువవుతోంది. అలాగే దాదాపు పది శాతం ఉన్న ముస్లిం చేతి వృత్తుల కులాలు బిసిలలోభాగంగా ఉన్నాయి. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ పెంచుతూ రెండు బిల్లులను అసెంబ్లీలో ఆమోదింపచేసుకొని, కేంద్రానికి పంపింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఇది కేంద్రం ఆమోదం లభిస్తే ముస్లింలోని చేతి వృత్తుల వర్గాలకు కూడా లబ్ధి చేకూరనుంది. స్థానిక సంస్థల రిజర్వేషన్‌లలో కూడా వర్తించి రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతున్నది. సుప్రీం కోర్టు తీర్పుతో దళితుల వర్గీకరణకు బాటలు పడ్డాయి. వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్న ఎంఆర్‌పిఎస్ బిజెపికి మద్దతుగా నిలుస్తుండడంతో, వారిని చెదరకుండా చేసుకునేందుకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ కూడా పూర్తి చేసి అసెంబ్లీలో బిల్లును ఆమోదింపజేసింది. దళితుల్లో మరో ప్రధాన సామాజిక వర్గానికి కూడా సమప్రాధాన్యం ఇస్తూ, ఇరు కులాలకు మంత్రివర్గంలో చెరో రెండు చొప్పున మంత్రి పదవులను కట్టబెట్టింది.

వచ్చేసారి అధికారం మాదేనని రాష్ట్రంలో అడుగులు వేస్తున్న బిజెపిని అడ్డుకునేందుకు బిసి అస్త్రం రెండు విధాలుగా ఉపయోగించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. అటు బిసి రిజర్వేషన్‌ల బిల్లును పెంచుతూ తొమ్మిదవ షెడ్యూలులో రక్షణ కల్పించేందుకు కేంద్రానికి పంపింది. అక్కడ జాప్యం జరుగుతుండడంతో అందుకు కారణం కేంద్రంలో బిజెపి ప్రభుత్వమేనని బోనులో నిలబెట్టడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ సక్సెస్ అయింది. ఇటు స్థానిక సంస్థల ఎన్నికలు అనివార్యమవడంతో, ఆ బిల్లులు అలా ఉండగానే ఇప్పటికే ఉన్న పంచాయతీరాజ్ చట్టం–2018ని స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్‌ల పెంపునకు వెసులుబాటు కల్పించే విధంగా ఆర్డినెన్స్ ఆమోదానికి గవర్నర్ వద్దకు పంపింది. రాజ్‌భవన్‌కు చేరిన ఆర్డినెన్స్‌పై గవర్నర్ కేంద్రం సలహా తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతో అటూ ఇటూ చేరి కాంగ్రెస్ బిసి రిజర్వేషన్‌లు పెంచినా, అమలు కాకపోవడానికి కారణం బిజెపియేనని ప్రజల్లో బలంగా వెళ్ళింది. ఈ పరిస్థితుల్లో బిసి రిజర్వేషన్‌ల పెంపు సాధ్యం కాదనే రీతిలో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడి నుంచి వ్యాఖ్యలు వస్తుండడంతో కాంగ్రెస్‌కు కలిసివస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే బిసి ముఖ్యమంత్రిని చేస్తామని ప్రచారం చేసిన బిజెపి, కనీసం శాసనసభాపక్ష నాయకత్వాన్ని, రాష్ట్ర బిజెపి అధ్యక్ష పదవిని బిసిలకు కాకుండా అగ్రకులాలకు కట్టబెట్టడంపై ఆ పార్టీలోనే బిసిలు కుతకుతలాడుతున్నారు. మరోవైపు రాష్ట్రానికి నిధులపై కూడా బిజెపిని కాంగ్రెస్ పదే పదే ఇరుకునపెడుతోంది. బిజెపి ఇరుకున పెట్టేందుకు ఇప్పటికే ఢిల్లీలో ధర్నాకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.

ఇక బిఆర్ఎస్‌కు అడ్డకట్ట వేసేందుకు గత ప్రభుత్వ హయాంలో అవినీతి అక్రమాలపై వేసిన విచారణ కమిషన్‌లు, దర్యాప్తులు కొలిక్కి వస్తున్నాయి. ఇప్పటికే విద్యుత్ అక్రమాలపై వేసిన కమిషన్ నివేదిక సమర్పించగా, తాజాగా కాళేశ్వరం బ్యారేజీ కుంగుబాటుపై వేసిన కమిషన్ నివేదికను సమర్పించింది. వీటిని ఈ నెలలో జరిగే శాసనసభ వానాకాల సమావేశాలలో సభ ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. అలాగే ఫార్ములా ఈ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసులు కూడా ఆగస్టు మాసంలోనే తుది రూపం తీసుకోనున్నాయి. ఈ కేసులలో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, కీలక నేత టి.హరీశ్‌రావుల వైపే అన్ని వేళ్ళు చూపుతున్నట్లు భావిస్తున్నారు. బిఆర్ఎస్‌ను ప్రధానంగా అవినీతి అస్త్రంతోనే దెబ్బతీయాలని కాంగ్రెస్ యోచిస్తోంది.

వీటికి తోడు ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చినప్పటికీ, గత ప్రభుత్వ వారసత్వంగా వచ్చిన అప్పుల కారణంగా కొన్నింటినే అమలు చేస్తోంది. అందులో ముఖ్యంగా మహిళలకు ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణం, 200 యూనిట్‌ల ఉచిత విద్యుత్‌కు తోడు ఈ ఏడాది ప్రవేశపెట్టిన రేషన్ షాపుల ద్వారా ఉచిత బియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు పథకం ఇప్పుడిప్పుడే ప్రభావాన్ని చూపుతున్నాయి. వీటికి తోడు రుణమాఫీ, పెంచిన రైతు భరోసా ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలతో పేద, మధ్యతరగతి, గ్రామీణ కటుంబాలలో వెసులుబాటు లభిస్తున్నదని వివిధ సర్వేలు వెల్లడిస్తున్నాయి. మహిళలకు ఉచిత బస్సు పథకం ఫలితాలు చూపిస్తున్నదని తేలింది. తెలంగాణలో 2023–24లో కుటుంబ ఖర్చుల్లో అత్యధికంగా 36 శాతం నుంచి 47 శాతం ఆహార ఖర్చుకే పోతున్నదని హౌజ్ హోల్డ్ కన్సంప్షన్ ఎక్స్‌పెండీచర్ సర్వే (కుటుంబ వినిమయ వ్యయ సర్వే –హెచ్‌సిఇఎస్)లో వెల్లడి అయింది. మిగత ఆహారేతర ఖర్చులో 20 శాతం బస్సు, రవాణా ఖర్చేనని నిర్ధారణ అయ్యింది. అయితే, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా తెలంగాణలో కుటుంబ రవాణా వ్యయం 20 నుంచి 29 శాతం తగ్గినట్లు ఈ సర్వేలో తేలింది. ఇక ఈ ఏడాది ప్రవేశపెట్టిన ఉచిత సన్న బియ్యం పథకం కూడా 47 శాతంగా ఉన్న కుటుంబ వ్యయం గణనీయంగా తగ్గే అవకాశం లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది అత్యధిక కుటుంబాలలో కనిపించనుంది. ఎందుకంటే సన్నబియ్యం పథకం ద్వారా 3 కోట్ల మంది లబ్ధి పొందుతారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి.

అందుకే ఈ మూడు అంశాల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చినా, ఖైరతాబాద్ సహా పది అనర్హత పిటిషన్‌లకు సంబంధించి భవిష్యత్తులో ఉప ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్‌కు ప్రయోజనం చేకూరుతుందని కాంగ్రెస్ ఆలోచన. అందుకే దానిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు పిసిసి అధ్వర్యంలో కాంగ్రెస్ జన హిత పేరుతో పాదయాత్రను చేపట్టింది. అయితే, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్వర్యంలో పాదయాత్ర సాగుతుండడాన్ని ప్రత్యర్థి పార్టీలు విమర్శిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి యాత్రలు ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో నడవడం కొత్తేమి కాదు. 2004 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నేతలందరినీ వెంటబెట్టుకొని నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి గులాం నబీ ఆజాద్ రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా బస్సు యాత్ర చేసిన సంప్రదాయం ఉంది.

## విద్యార్థులకు ఇంటర్నెట్ సౌకర్యంతో ఎన్నో ఉపయోగాలు



ప్రజాపక్షం/నారాయణపేట్: నారాయణపేట్ జిల్లా బాజాపూర్ గ్రామంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాజాపూర్‌కు సమగ్ర శిక్ష తెలంగాణ ప్రభుత్వం వారు, ఇంటర్నెట్ కనెక్షన్ వల్ల విద్యార్థులకు మరి ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులకు ఇంటర్నెట్ సౌకర్యం వల్ల ఎంతో ఉపయోగపడుతుందని, విద్యార్థులకు ఇంటర్నెట్ సౌకర్యం వల్ల ఎంతో ఉపయోగపడుతుంది విద్యకు సంబంధించినటువంటి విషయాలను దూరదర్శన్ ద్వారా తెలియజేయవచ్చు పాఠశాల ఇన్చార్జ్ హెడ్‌మాస్టర్ మధుసూదన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ భాను ప్రకాష్, నరసింహ రఘురాం రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గ్రామాల సూచిక బోర్డు లేక వాహనదారుల ఇక్కట్లు



ప్రజాపక్షం/వీపనగండ్ల : నాలుగు కూడళ్ల వద్ద ఏ రోడ్డు వెంట వెళ్తే ఏ గ్రామానికి వెళ్లాలో తెలిపే సూచిక బోర్డులు లేక వాహనదారులు తికమక పడుతున్నారు. మండల పరిధిలోని తూంకుంటకు సమీపంలోని బొల్లారం చౌరస్తా వద్ద నాలుగు వైపులా రోడ్లు ఉండటంతో ఏ రోడ్డు వెంట వెళ్తే ఏ ఊరు వస్తుందో తెలిపే సూచిక బోర్డులను ఆర్అండ్‌బి అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో కొత్తగా ఈ రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలోని గ్రామాలను కలిపే ఈ చౌరస్తా వద్ద సంబంధిత అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

## ట్రైనీ కలెక్టర్‌కు సన్మానం



ప్రజాపక్షం/నారాయణపేట్: ట్రైనింగ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ ట్రైనింగ్ నిమిత్తం ప్రభుత్వం ఉట్కూర్ మండలం విజిట్ చేయడానికి, వారం రోజులు ఉట్కూర్ మండలం పరిధిలోని గ్రామాలను విజిట్ చేయడానికి రావడం, జరిగింది, కనుక శనివారం వారం రోజుల విజిట్ ను అన్ని గ్రామాలలో పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, మాట్లాడుతూ ట్రైనింగ్ నిమిత్తం ఉట్కూరుకు వచ్చిన కలెక్టర్ గ్రామాలలోని సమస్యలను పరిశీలించి, వివిధ గ్రామాలలో కొన్ని సమస్యలకు పరిష్కారం చూపారు. అందరూ అధికారులతో మమేకమై, పర్యటించారన్నారు. వారం విజయవంతం చేసుకొని, విధులపై జిల్లాకు వెళ్తున్నా, సందర్భంగా శనివారం ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్‌కి, ఎంపీడీఓ ధనుంజయ్య గౌడ్, ఎంపీఓ రాజు ఏపి ఓ లక్ష్మ రెడ్డి, ఈసి మైపాల్ రెడ్డి, టెక్నీకల్ అసిస్టెంట్‌లు, పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సీనియర్ మెట్స్ అందరూ కలిసి ట్రైని కలెక్టర్‌కు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచాన్ని ఆకర్షించేలా తెలంగాణ టూరిజం

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : రాష్ట్రంలో ప్రతిపేదవారు ఆత్మగౌరవంగా జీవించే అవకాశాలను కల్పించడమే, ప్రజాప్రభుత్వ ధ్యేయం, లక్ష్యమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని కొల్లాపూర్ పట్టణంలో రాజాగారికోటవద్ద గ్గర ఏర్పాటుచేసిన నియోజకవర్గపరిధిలోని వివిధ మండలాల పరిధిలోని వివిధ గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రాలను ఎస్పిడిసిఎల్ సిఎండి ముషారఫ్అలీఫరూఖీ, వనపర్తి ఎమ్మెల్యే తూడిమేఘారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లురవి, రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులతో కలిసి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నూతన రేషన్‌కార్డులు, లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిర్మాణాల పట్టాలు, షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో రూ.65.67కోట్ల అంచనావ్యయంతో నిర్మించనున్న ఏడు విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకిరాగానే స్వేచ్ఛగా అభిప్రాయాలు చెప్పే అధికారాన్ని ప్రజలకు ఇచ్చామన్నారు. కొల్లాపూర్‌లోనే రాజకీయ ఓనమాలు దిద్దుకున్నాను. మాసోదరుడు స్వర్గీయ మల్లు అనంతరాములు 1980లో నాగర్‌కర్నూల్ ఎంపిగా పోటీ చేసిన సమయంలో తాను విద్యార్థిగా ఉన్నానని, ఆసమయంలో తనను కొల్లాపూర్ ఇంచార్జీగా నియమించారని ఆనాడే తాను రాజకీయ ఓనమాలు దిద్దుకున్నానని వివరించారు. నియోజకవర్గ ఇంచార్జీగా ఊరూరాతిరిగి ప్రజలతో మమేకం కావడం కొల్లాపూర్‌తోనే ప్రారంభమైందన్నారు. తనకు మధిర నియోజకవర్గంలో ఎంతటి అనుబంధం ఉందో కొల్లాపూర్‌తోనూ అంతటి అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రమైనార్టీ ఫైనాన్స్‌కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, గద్వాల మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సరిత తిరుపతయ్య, సంబంధితశాఖల అధికారులు, కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**నిరంతర విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం**

చిన్నంబావి మండలం వెలటూరు గ్రామంలో రూ.2.2 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర ఆబ్కారీ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవితో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి మారుమూల ప్రాంతానికి నాణ్యమైన నిరంతర విద్యుత్ ఇవ్వటమే ప్రభుత్వం ధ్యేయమన్నారు. మారుమూల గ్రామమైన చిన్నంబావి వెలటూర్ గ్రామంలో ఒక దీనితో పాటు పాన్‌గల్ మండల పరిధిలో రూ.49.86 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 132/33 కేవీ



విద్యుత్ ఉప కేంద్రానికి, పాన్‌గల్ మండలం జమ్మాపూర్ గ్రామంలో రూ.2.02 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి నేడు కొల్లాపూర్‌లో శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. పాన్‌గల్ మండలంలో 132/33 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి అయి ప్రారంభిస్తే అక్కడి నుంచి కొత్తగా మరో (15) 33/11 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అనుసంధానం చేయవచ్చన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని కోడేరు మండలంలోని మైలారం, మాచుపల్లి, పస్పుల, పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని వెన్నచర్ల, మరికల్ గ్రామాలు సంబంధించిన మరో 4 సబ్‌స్టేషన్లకు కొల్లాపూర్‌లో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. వెలటూరు గ్రామంలో రూ. 2.2 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 33/11 కెవి సబ్ స్టేషన్ ద్వారా 3 ఫీడర్లతో 950 బోరుబావులు, 600 డొమెస్టిక్ కనెక్షన్లు ఇవ్వడానికి ఉపయోగపడుతుంది. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఇంచార్జీ సుబ్రమణ్యం, టిజిఎస్‌పిడిసి ఎల్ఎస్ ఈయు బాలస్వామి, డిఈ శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, కాంగ్రెస్ నాయకులు కొత్త కళ్యాణ్ రావు, జూపల్లి అరుణ్ , రాజేంద్ర ప్రసాద్, అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తులో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన పరికరాలదే అగ్రస్థానం



ఎడిఆర్ డాక్టర్ టి.రాంప్రకాష్

ప్రజాపక్షం/బిజినేపల్లి : భవిష్యత్తులో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞాన పరికరాలదే అగ్రస్థానమని ప్రాంతీయ పరిశోధనస్థానం ఎడిఆర్ డాక్టర్ టి.రాంప్రకాష్ అన్నారు. కృషివిజ్ఞాన కేంద్రం పాలెంవారి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కిసాన్‌సమ్మాన్‌నిధి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి వికసిత్ భారత్ సంకల్పయాత్ర వివిధ కార్యక్రమాలను డ్రోన్‌దిదికో ఆపరేషన్‌సింధూర్ దేశంలో ప్రతిరైతుకు అవసరమని ఆయన కోరారు. ఎగిరే వివిధ స్కీములద్వారా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని కావున రైతన్నలు వీటిని సద్వినియోగం చేసుకొని మంచిసాగుపద్ధతులను పాటించి అధిక లాభాలను పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు, పూర్ణచంద్రారెడ్డి, వివిధగ్రామాల రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బిసి సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల కలెక్టర్ తనిఖీ



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ పట్టణంలోని సారిక టౌన్‌షిప్ వద్ద ఏర్పాటు చేసిన భూత్పూర్ మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బి.సి. సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను కలెక్టర్ విజయేందిర బోయి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్న బియ్యం, నిత్యావసర సరుకులను పరిశీలించారు. మెనూ బోర్డును పరిశీలించి, మెనూకు అనుగుణంగా భోజనం అందిస్తున్నారా లేదా అన్నది గమనించారు. ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారుచేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆహార పదార్థాల కలుషిత కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. 5,10వ తరగతి విద్యార్థినిలతో మాట్లాడారు. ఎలా చదువుతున్నారు, వసతులు ఎలా ఉన్నాయి. భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి చర్చించారు. ఆయా సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన అందిస్తూ, మరింత మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. అధ్యాపకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ సమయపాలన పాటిస్తూ, అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. పర్యవేక్షణ అధికారి ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

ప్రజాపక్షం/అచ్చంపేట : అచ్చంపేట నియోజకవర్గంలో విధుల పట్ల నిర్లక్ష్యం ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం సస్పెన్షన్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు. అచ్చంపేట మండలంలోని అంకిరోనిపల్లి పంచాయతీ కార్యదర్శి కల్పన, అక్కారం పంచాయతీ కార్యదర్శి రాత్లావత్‌మట్టాలాల్ విధుల నుంచి తొలగించారు. జూలైనెలలో డిఎస్ఆర్ యాప్‌లో నకిలీ ముఖచిత్రాలను పొందుపర్చినట్లు గుర్తించారు. వీరు ఉద్దేశ్యపూర్వకంగా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నందున విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

## నల్లమలలో అటవీ భూములులేవు

ప్రజాపక్షం/అచ్చంపేట : నాగర్‌కర్నూల్ జిల్లా ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో అటవీభూములులేవని అమ్రాబాద్ ఉమ్మడి మండలంలో 80 సంవత్సరాలనుంచి పంటపొలాలు ఉన్నాయని అటవీశాఖ భూములులేవని మండలరైతాంగం తెలిపింది. శనివారం అమ్రాబాద్ మండలకేంద్రంలో మండల రైతుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. అమ్రాబాద్ మండలంలో 2వేల ఎకరాల ప్రభుత్వభూమి ఉందని అటవీశాఖ అధికారులు రెవెన్యూవారితో సర్టిఫికెట్ తీసుకుంటున్నారని ఆరోపించారు. పట్టాభూములు 26వేల ఎకరాలు మాత్రమే ఉన్నాయని రెవెన్యూశాఖవారు తెలుపుతున్నారని మిగతవారికి రెవెన్యూ పట్టా ఎలా ఇచ్చారని వారు ప్రశ్నించారు. తరతరాలుగా ఉన్నతమ భూములను అటవీశాఖవని చెప్పడం సరైంది కాదని తెలిపారు. తమభూముల జోలికివస్తే ప్రత్యక్షంగా ఆత్మహత్యచేసుకుంటామని రైతులు ఆరోపించారు.

## పోలీసు జాగిలంకు బ్రాంజ్ మెడల్




ప్రజాపక్షం/నారాయణపేట్: వరంగల్ జిల్లాలోని పిటిసి మమునూరులో జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్లో జోగులాంబ జోన్ నుండి ట్రాకింగ్ విభాగం పోటీలో పాల్గొని హత్య నేరాలు, దొంగతనాలను ట్రాకింగ్ చేయడంలో పోలీసు జాగిలం రుద్ర, డాగ్ హ్యాండ్లర్ రవి కి బ్రాంజ్ మెడల్ రావడం జరిగిందని అని జోగులాంబ జోన్ పోలీస్ డ్యూటీ మీట్ నోడల్ అధికారి అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్ తెలిపారు. 2006 సంవత్సరం ఫిబ్రవరిలో పూణేలో జరిగే నేషనల్ పోలీసు డ్యూటీ మీట్లో పాల్గొని మరిన్ని పథకాలు సాధించాలని అదనపు ఎస్పీ తెలిపారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సామాజిక బాధ్యత

బాలలను పనిలో పెట్టుకున్న 20 మందిపై కేసులు నమోదు : ఎస్పీ యోగేష్ గౌతమ్



ప్రజాపక్షం/నారాయణపేట్ : బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరంలో రెండుసార్లు ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన/ వదిలివేయబడిన, వివిధ రకాల బాల కార్మికులు కిరాణం షాప్‌లలో, మెకానిక్ షాపులలో, ఇటుక బట్టీలలో, హోటళ్లలో, వివిధ కంపనిలలో పనిచేస్తూ, రోడ్డు పై భిక్షాటన చేస్తున్న పిల్లలు బాలకార్మికులుగా ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం, లేదా స్టేట్ హోమ్‌కు పంపించడం జరుగుతుందని దానిలో భాగంగా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ 11 కార్యక్రమం జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్, వివిధ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ విజయవంతంగా ముగిసిందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లా పరిధిలో ఆపరేషన్ ముస్కాన్ టీం లు ఏర్పాటు చేసి జూలై 1 నుండి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్11 కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించి 56 మంది బాల కార్మికులను పట్టుకోవడం జరిగింది. అందులో 48 బాలురు, 08 మంది బల్లిను పట్టుకొగా అందులో 16 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన బాల కార్మికులు ఉన్నారు. మొత్తం 20 కేసులు నమోదు చేయడం జరిగిందని బాల కార్మికులుగా ఉన్న పిల్లలకు, తల్లిదండ్రులకు పాఠశాలలో చర్చే విధంగా కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నదని ఆది ఒక సామాజిక బాధ్యతగా గుర్తించి, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. బాలల హక్కులను, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడం జరుగుతుందని, అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్న, ఎక్కడైనా పనిచేసిన, తప్పిపోయిన వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 (చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్) వారికి, డయల్ 100కి కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వగలరనీ తెలిపారు. బాలకార్మికులుగా పెట్టుకున్న వారి పై కూడా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసు శాఖతో కలిసి ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేయడంలో కృషి చేసిన వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## 31న పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం

ప్రజాపక్షం/జడ్చర్ల: బాదేపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 31న పట్టణంలోని చంద్రగార్డెన్‌లో పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం ఉంటుందని కమిటీ అధ్యక్షుడు రవిశంకర్ వెల్లడించారు. శనివారం హైస్కూల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబరు 27,28,29 తేదీల్లో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా నిర్వహించే సన్నాహక సమావేశానికి పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి ఎమ్మెల్యే జానంపల్లి అనిరుద్‌రెడ్డి పూర్తి సహకారం అందిస్తున్నారని స్పష్టం చేశారు. 1925లో ప్రారంభమైన పాఠశాల దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం మూడు భాషల్లో బోధన కొనసాగుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు చంద్రకళ మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసుకుందామని అందుకు తమ పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. సమావేశంలో శతాబ్ది ఉత్సక కమిటీ ప్రధాన కార్యదర్శి రమణాచార్యులు వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ, ఉపాధ్యక్షులు సయ్యద్ ఇబ్రహీం, గోపాల్, పెద్ద బాలకృష్ణ, ఆకుల వెంకటేశ్, జీనురాల సత్యం, టైటాన్స్ సత్యం, శ్రీనివాస్ చారి, జయప్రకాష్, ప్రకాష్, సంతోష్ చారి, కార్యనిర్వహణ కార్యదర్శి కంచుకోట ఆనంద్, రాఘవేందర్ గౌడ్, ఉపాధ్యాయులు సునీల్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/బిజినేపల్లి : మండలంలోని నందివడ్డెమాన్ గ్రామంలోసురాయికుంట గత నాలుగురోజులక్రితం బాకీ వెంకటరాములు చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. ఈవిషయం తెలుసుకున్న శెట్టిరాజేష్, విష్ణువర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమప్రగాఢసానుభూతిని తెలిపి మృతుడి కుటుంబానికి తమవంతుగా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఉషన్న, వీరస్వామి, చిన్నయ్య, నాగరాజు , తిరుపతయ్య పాల్గొన్నారు.

# స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన విద్యార్థిని అభినందించిన మంత్రి



ప్రజాపక్షం/మక్తల్ : హకీంపేట్ పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాల ఎంపికలో మక్తల్ సాయి జ్యోతి హైస్కూల్ విద్యార్థి బి.నిశాంత్, పాల్గొని అసమాన క్రీడ నైపుణ్యతను ప్రదర్శించి హైదరాబాద్ హకీంపేట క్రీడా పాఠశాలలో నాలుగో తరగతి ప్రవేశం పొందుటకు ఎంపిక కావడం పట్ల తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్.వాకిటి శ్రీహరి సన్మానించి అభినందించినట్లు కరస్పాండెంట్ వెంకటయ్య చైర్మన్ నర్సింలు, పిడి రమేష్ కుమార్ తెలిపారు. బి.నిశాంత్, తల్లిదండ్రులు అంజప్ప, సావిత్రమ్మ మక్తల్ మండలం చిట్యాల గ్రామానికి చెందినవారు. కాగా కూలి పని చేస్తూ తమ కుమారుని చదివిస్తున్నారని అక్కింపేట క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశం దొరకడంతో ఆనందాన్ని వ్యక్తపరుస్తూ బి.నిశాంత్‌కు నెల రోజుల పాటు క్రీడా పాఠశాల కొరకు తొమ్మిది క్రీడాంశాలలో శిక్షణ ఇచ్చిన పిడి రమేష్ కుమార్‌కు పాఠశాల యాజమాన్యానికి తండ్రి అంజప్ప కృతజ్ఞతలు తెలియజేశారు. సాయి జ్యోతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థి హకీంపేట క్రీడా పాఠశాలకు ఎంపిక కావడం పట్ల ఆ పాఠశాల కరస్పాండెంట్ వెంకటయ్య, చైర్మన్ నర్సింలు, ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి, వాయిస్ ప్రిన్సిపాల్ రవి శంకర్ రెడ్డి, కవిత, పిడి రమేష్ కుమార్, ఉపాధ్యాయులు జ్ఞానేశ్వరి మహేశ్వరి, సుజాత, రమాదేవి, సంగీత, రియాజ్, రోహిత్, సంతోష్ విద్యార్థులు శాలువతో సన్మానించి అభినందించారు.

## డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి



మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్

ప్రజాపక్షం/పెబ్బేరు : పెబ్బేరు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత ఎగ్జామినేషన్ సెంటర్ లేకపోవడంతో ప్రిన్సిపల్ వెంకటప్రసాద్ కాంగ్రెస్ నాయకులకు విజ్ఞప్తి చేశారు. పెబ్బేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎద్దుల విజయ్ వర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృషితో పెబ్బేరు డిగ్రీ కళాశాలకు సొంత పరీక్ష కేంద్రం మంజూరు అయిందని వివరించారు. ఎగ్జామినేషన్ సెంటర్ మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ నాయకులను ప్రిన్సిపల్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కారుపాకుల వెంకట్రాములు, సీనియర్ నాయకులు దయాకర్ రెడ్డి, 8వ వార్డు ఇంచార్జ్, మైనార్టీ సెల్ టౌన్ అధ్యక్షులు జహంగీర్, యువ నాయకులు కురుమూర్తి ముదిరాజ్ , అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులకు డప్పుల పంపిణీ



ప్రజాపక్షం/వెల్దండ : మండలపరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో యువ నాయకుడు కేశమల్ల కృష్ణ జన్మదినం సందర్భంగా గ్రామ యువకులకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా గ్రామ డప్పు కళాకారులకు డప్పులను పంపిణీ చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మట్టవెంకటయ్యగౌడ్, పురుషోత్తమచారి, కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజశేఖర్, వెంకటేష్, చంద్రశేఖర్, శ్రీను, హరికిషన్‌నాయక్, భీమరాజు పాల్గొన్నారు.

# వీక్లి పరేడ్‌లో పాల్గొన్న ఎస్పీ



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: జిల్లా పోలీసు కవాతు మైదానము నందు నిర్వహించిన వీక్లి పరేడ్ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.జానకి హాజరయ్యారు. పరేడ్ ముగిసిన అనంతరం సిబ్బందిని వ్యక్తిగతంగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకుని, అవసరమైన సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధుల్లో నిత్యం ఒత్తిడి, భౌతిక మానసిక శ్రమ ఎక్కువగా ఉంటుంది. అందుకే ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. సమయం దొరికినప్పుడల్లా కుటుంబంతో గడిపి ఆత్మీయతను పెంపొందించుకోవాలి. అలాగే యోగా, మెడిటేషన్ అనునిత్యం చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా బలంగా మారవచ్చు. మన ఆరోగ్యం బాగుంటేనే మన సేవలు ప్రభావవంతంగా ఉంటాయని పేర్కొన్నారు. అదే విధంగా, విధుల్లో నిబద్ధతతో పాటు సేవా దృక్పథాన్ని ప్రదర్శిస్తూ, ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవాలన్నారు. పోలీసు కుటుంబం అందరికి అధికారుల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరేడ్ నందు అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఏఆర్‌డిఎస్‌పి శ్రీనివాసులు, కృష్ణయ్య, రవి, నాగేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాపక్షం/వెల్దండ : మండల పరిధిలోని బండోనిపల్లి గ్రామానికి చెందిన ఎనుముల నారాయణరెడ్డి ఇటీవలే మృతి చెందాడు. శనివారం నారాయణరెడ్డి కుటుంబాన్ని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రనాయకులు, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పరామర్శించి వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు ఉమాపతి, బిక్షపతి, ఉపేందర్, రవి, సురేష్, కుమార్ పాల్గొన్నారు.

## లోన్‌లకు 10లోగా దరఖాస్తు చేసుకోవాలి

ఎంపిడిఓ కృష్ణారావు

ప్రజాపక్షం/కొత్తపల్లి: కొడంగల్ నియోజకవర్గంలోని మైనార్టీలకు స్వయం ఉపాధి కల్పించడంలో భాగంగా ఇందిరా డెయిరీ, షీప్ ఫార్మింగ్ పథకాన్ని 10లోగా దరఖాస్తు చేసుకోవాలని శనివారం ఎంపిడిఓ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా 2 లక్షల రుణం అందించబడునని, ఇందులో 80 శాతం సబ్సిడీ కూడా ఉంటుందన్నారు. కొడంగల్ నియోజకవర్గం పైలట్ ప్రాజెక్టుగా ఆమోదించబడిందని తెలిపారు. ఆసక్తిగల ముస్లిం లబ్ధిదారులు 10లోగా దరఖాస్తు సమర్పించాలన్నారు.

## విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలి

ప్రజాపక్షం/మక్తల్ : మక్తల్ మండల పరిధిలోని చిట్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో జూలై మాసానికి గాను 24 రోజులు పాఠశాల పని దినములు క్రమం తప్పకుండా 100% హాజరైన విద్యార్థిని విద్యార్థులను అభినందించి బహుమతులను ప్రధానోత్సవం చేసిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సవిత.. మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న ఒకటవ తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులు క్రమం తప్పకుండా, క్రమశిక్షణగా పాఠశాలకు హాజరై తరగతి గదుల్లో బోధించే పాఠాలను విని అర్థం చేసుకొని మంచిగా చదువుకొని మీ బంగారు భవిష్యత్తును, నిర్మించుకోవాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు హాజరు శాతం పెంచే ఉద్దేశంతో తన ఆలోచనను మాతో పంచుకొని ఆచరణలో పెట్టిన విధుర్ కుమార్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు, తెలియజేస్తున్నానని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకొని క్రమం తప్పకుండా నెల వారీగా, అకాడమిక్ చివరన ఇచ్చే బహుమతులను అందుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమం విజయవంతం అవ్వాలి అంటే ఆయా తరగతిలా తరగతి ఉపాధ్యాయులు సహకరించాలని విన్నవించారు.

## రాజీవ్ యువ వికాసం లోన్లు ఇవ్వాలి

ప్రజాపక్షం/డిండి: రాజీవ్ యువ వికాసం లోన్లు నిరుద్యోగ యువతకు ఇవ్వాలని ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం గోనకల్ గ్రామంలో ఎఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాలని అన్నారు. అనంతరం ఎఐవైఎఫ్ గోనకల్ నూతన కమిటి అధ్యక్షులుగా నూనె భూపాల్, కార్యదర్శిగా కాంపల్లి శ్రీకాంత్, కోశాధికారి కర్ణాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి మహేష్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి లవన్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్‌కుమార్, ప్రవీణ్, అరవింద్, రాజు, శంకర్, వెంకటయ్య పాల్గొన్నారు.



## త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్లు

ప్రజాపక్షం/తుర్కపల్లి : తుర్కపల్లి మండలంలోని ములకలపల్లి గ్రామంలో లబ్ధిదారులు చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ హనుమంతరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి గృహప్రవేశాలు జరిగేలా చూడాలని కోరారు. తుర్కపల్లి మండలం చోక్ల తండా, బబ్లు నాయక్ తండా, రుస్తాపూర్ గ్రామాల్లో శనివారం జిల్లా పంచాయతీ అధికారి సునంద పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నర్సరీలు ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గీతారెడ్డి, హౌసింగ్ ఏఈ నరేష్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ పాల్గొన్నారు.





## పేదలకు మెరుగైన వైద్యసేవలు

### కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి

ప్రజాపక్షం/కోదాడ: కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిని కార్పోరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దుతానని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో 10 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో 26 కోట్ల రూపాయలతో వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే 3కోట్ల 66 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన సిటి స్కాన్ యంత్రం అందుబాటులోకి వస్తుందన్నారు. ఉమ్మడి జిల్లాలోనే మొట్టమొదటిసారిగా కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక డాక్టర్,ముగ్గురు స్టాఫ్ నర్సులతో కలిపి జాతీయ రాబిస్ కంట్రోల్ ప్రొగ్రాం ఏర్పాటు చేయడంతో పాటు పట్టుకతో బరువు తక్కువ ఉన్న పిల్లలందరికి రిహాబిటేషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో జరుగుతున్నపనుల్లో వేగం పెంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మినారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సూర్యానారాయణ, డిసిహెచ్ఎస్ ఎస్.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ దశరథ, కమిషనర్ రమాదేవి, వైద్యులు అభిరామ్, వైష్ణవి, నర్సింహా పాల్గొన్నారు.

## ముగిసిన ఆపరేషన్ ముస్కాన్

### జిల్లాలో 143 మంది బాల కార్మికులు గుర్తింపు

### 65 కేసులు నమోదు



ప్రజాపక్షం/సూర్యాపేట: వెట్టిచాకిరికి, నిరాదరణకు గురైన బాలబాలికలను, తప్పిపోయిన బాలలను గుర్తించి సంరక్షించడంలో భాగంగా ప్రతి సంవత్సరం జనవరి నెలలో నిర్వహించే అపరేషన్ స్మైల్, జూలై నెలలో నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ ముగిసింది. జిల్లాలో 143 మంది బాలకార్మికులను గుర్తించి 65 కేసులను అధికారులు నమోదు చేశారు. వెట్టిచాకిరికి గురైన బాలలను తల్లిదండ్రులకు, సంరక్షకులకు క్షేమంగా అధికారులు అప్పగించారు. వీరిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 76 మంది బాలలుండగా, వీరిలో 7బాలికలు, 69 మంది బాలురు ఉన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు 67 మంది బాలలుండగా, 50 మంది బాలురు, 17 మంది బాలికలున్నారు. ఆపరేషన్ ముస్కాన్ ముగిసిన బాలల రక్షణ కోసం నిరంతరం తనిఖీలు చేస్తామని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా తెలిపారు. బాలలను వెట్టిచాకిరికి గురి చేస్తే చర్యలు తప్పవన్నారు. బాలల వికాసానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఆపరేషన్ ముస్కాన్‌లో పాల్గొన్న తన పోలీస్ సిబ్బందిని ఆయన శనివారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డి, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ హరిబాబు లున్నారు.

## సిమెంట్ అక్రమ విక్రయదారుల అరెస్టు



ప్రజాపక్షం/చివ్వేంల: సిమెంట్ అక్రమంగా విక్రయిస్తున్న నలుగురు నిందితులను చివ్వేంల పోలీసులు శనివారం అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎ1 నిందితుడు నర్సాపురానికి చెందిన కాంపాటి రాజు, ఎ2 నిందితుడు సూర్యాపేట మండలం ఇమాంపేటకు పోలోజూ ఉపేంద్రచారి, ఎ3 నిందితుడు మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన ఎస్‌కె బాబుతో కలిసి కుట్రపూరితంగా వివిధ కంపెనీలకు చెందిన సిమెంట్ బస్తాలను సేకరించి నకిలీ సిమెంట్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నకిలీ బ్రాండ్ సంచులను సరఫరా చేసే బండి వెంకటరమణ నార్కెట్‌పల్లి ఎ4 నిందితుడని తెలిపారు. అతని నుండి అల్ట్రాటెక్, రామ్‌కో, కెసిపి, ఎంసిఎల్ వంటి అసలు బ్రాండ్ పోలిన నకిలీ ఖాళీ సంచులను తీసుకుని అందులో సిమెంట్ నింపి విక్రయిస్తున్నట్లు తెలిపారు. దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ఓ గోదాములో నిల్వ ఉంచిన 940 బస్తాల సిమెంట్, 30 ఖాళీ బ్రాండ్ సంచులు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ మహేశ్వర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కీచక ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

### మహిళా కానిస్టేబుల్‌పై వేధింపులు

### జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేసిన బాధితురాలు

### డిఐజి కార్యాలయానికి అటాచ్



ప్రజాపక్షం/సూర్యాపేట: తుంగతుర్తి సర్కిల్ పరిధిలోని నూతన్‌కల్ ఎస్ఐ వాస ప్రవీణ్‌కుమార్ అదే స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ మహిళ కానిస్టేబుల్‌ను గతకొన్ని రోజులుగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో సదరు మహిళ కానిస్టేబుల్ జిల్లా ఎస్‌పి కె.నర్సింహాకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ గతంలో పనిచేసిన ప్రతిచోట మహిళలను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్లు అనేక అరోపణలు ఉన్నాయి. గతంలో గద్వాలలో ఎస్ఐగా పనిచేసినప్పుడు, నల్లగొండ జిల్లాలోని శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో పనిచేసిన సమయంలో వివిధ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మహిళలను లైంగిక వేధింపులకు గురిచేశారనే అరోపణలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలో పనిచేసిన సమయంలో కొంతమంది మహిళల ఫోన్ నెంబర్లు తీసుకుని అసభ్యకరమైన మెసేజ్‌లు పంపినట్లు గత ఫిబ్రవరి నెలలో జరిగిన శ్రీలింగమంతుల స్వామి పెద్దగట్టు జాతర సమయంలో నూతనంగా విధుల్లో చేరిన ఇద్దరు మహిళ కానిస్టేబుళ్లతో చట్టపట్టాలు వేసుకుని తిరిగినట్లు అరోపణలు లేకపోలేదు. గతంలో తోటి మహిళ ఉద్యోగులను అనేక మార్లు లైంగిక వేధింపులకు గురిచేయడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నూతన్‌కల్ పోలీస్‌స్టేషన్‌లో లైంగిక వేధింపులకు గురైన మహిళ కానిస్టేబుల్ జిల్లాకు చెందిన మంత్రికి దగ్గర బంధువు కావడంతో ఈ విషయం ఆయన వద్దకు కూడా చేరినట్లు సమాచారం. దీనిపై జిల్లా ఎస్‌పి కె.నర్సింహా సమగ్ర విచారణ చేశారు. ఇది వాస్తవం అని తెలడంతో డిఐజి కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఇయన స్థానంలో నూతన ఎస్ఐగా నాగరాజుకు పోస్టింగ్ ఇచ్చారు.

## సాగర్ ప్రాజెక్టుకు తగ్గిన వరద

### 8 గేట్లు మూసివేత, 18 గేట్ల ద్వారా నీటి విడుదల



ప్రజాపక్షం/నందికొండ: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి వచ్చే వరద ప్రవాహం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది గత కొన్ని రోజులుగా ప్రాజెక్ట్ అధికారులు వరద ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్త చర్యగా ప్రాజెక్టు నీటిమట్టాన్ని గరిష్ఠ మట్టం 590 అడుగులకు ఐదు అడుగుల తక్కువ అంటే 585 అడుగులను కొనసాగిస్తూ నీటిని విడుదల చేస్తున్నారు. శనివారం శ్రీశైలం నుంచి వరద ప్రవాహం తగ్గడంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవాలనే ఉద్దేశంతో 8 గేట్లు మూసివేసి 18 గేట్లను 5 అడుగుల మేర పైకి లేపి 136656 క్యూసెక్కుల నీటిని క్రస్ట్ గే ట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. దీనితో సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు శనివారం సాయంత్రానికి 585.30 అడుగులతో ఉండి నీటి నిల్వ సామర్థం 312.0450 టిఎంసిలకు గాను 298.3005 టిఎంసీలుగా ఉన్నది. కుడి, ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తూ, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. అయితే నాగార్జునసాగర్ కు శ్రీశైలం నుంచి ఇన్ ఫ్లో గా 210499 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతూ ఉండగా 183786 క్యూసెక్కుల నీరు మొత్తం అవుట్ ఫ్లోగా దిగువకు విడుదలవుతుంది.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించం

### డాక్టర్లు, సిబ్బంది విధులకు గైర్హాజరుపై కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఆగ్రహం

### ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/సూర్యాపేట: సూర్యాపేట ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఒపి రిజిస్టర్, డాక్టర్లు, సిబ్బంది హాజరు రిజిస్టర్, బయోమెట్రిక్ రిజిస్టర్‌ను ఆయన క్షుణంగా పరిశీలించారు. ఈ తనిఖీలో పలువురు డాక్టర్లు, సిబ్బంది విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. మరి కొంతమంది సమయపాలన కూడా పాటించడంలేదని తనిఖీలో తేలడంతో ఆయన అగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. అనతరం ఆయన ఆసుపత్రిలోని జనరల్ వార్డు, జనరల్ మెడిషన్ వార్డు, సర్జరి వార్డు, ఎమర్జెన్సీవార్డు, సైక్రాటిక్ వార్డులను కలియతిరిగి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర చికిత్స విభాగంలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న రోగితో ఆయన మాట్లాడి ఆరోగ్యం ఎలా ఉందని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బ్లడ్ బ్యాంక్‌ను సందర్శించి ఎన్ని యూనిట్ల రక్తం నిల్వ ఉన్నదో ఆరా తీశారు. ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన సువిన్ అనే బాలుడు ఆసుపత్రికి రాగా అతనితో కూడా కలెక్టర్ మాట్లాడి ఎందుకు ఆసుపత్రికి వచ్చావ్ అని అడిగారు. అందుకు బదులుగా జ్వరం కారణంగా చికిత్స కోసం వచ్చినట్లు చెప్పారు. ఆసుపత్రి సూపరిండెంట్ శ్రావణ్‌కుమార్‌ను ఆసుపత్రిలోని ఆయా విభాగాల్లో పనిచేస్తు విధులకు హాజరుకాని వారి వివరాలతో కూడిన నివేదికను తనకు అందించాలని అదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్‌తో ఆర్ఎంవో విజయ్‌కుమార్, డాక్టర్లు విజయానంద్, లక్ష్మణ్ లు ఉన్నారు.

### నీట్ పిజి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

### పరీక్షకు హాజరుకానున్న 230 మంది అభ్యర్థులు

(నేడు) ఆదివారం నిర్వహించనున్న నీట్ పిజి ప్రవేశ పరీక్షకు అవసరమైన అన్నిఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. జిల్లాలో 230 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానుండగా సూర్యాపేట ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో, కోదాడలోని సన ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సూర్యాపేటలో 180 మంది, కోదాడలో 50 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 9 గంటల నుండి మద్యాహ్నం 12:30 వరకు పరీక్ష జరగనుంది. ఉదయం 7 గంటల నుండి 8:30 లోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రాలలోకి అనుమతి ఉంటుందని అధికారులు సూచించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పిజి ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షకు హాజరుకావాలని కోరారు. ఒరిజినల్ అడ్మిట్‌కార్డు (ప్రింటెడ్ ఫోటోతో కూడినది), ఒరిజనల్ ఫోటో ఐడెంటికార్డు (ఓటర్‌ఐడి పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసన్స్, ఆధార్ లేదా ప్రభుత్వం ద్వారా జారీ చేయబడిన ఫోటో గుర్తింపుకార్డు) లలో ఎదైన ఒకటి తప్పని సరిగా తీసుకరావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ జయలత, తహసిల్దార్ కృష్ణయ్య ఉన్నారు.





## అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు

### ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ : అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు, శనివారం మండల కేంద్రంలో శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలానికి చెందిన 12814 పాత కార్డులు ఉండగా కొత్తగా 1207 మందికి కొత్త రేషన్ కార్డులను జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ లతో కలసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అనేక రకాల హామీలు ఇచ్చి అభివృద్ధి ఏమి చేసింది లేదని అన్నారు. కాంగ్రెస్ పాలనలో పేదల సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి కొత్త రేషన్ కార్డులను అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగ రెడ్డి, హాలియ మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, గడ్డం సాగర్ రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ భగవాన్ నాయక్ , మండల పార్టీ అధ్యక్షులు క్రిష్ణ నాయక్ , వల్లభ రెడ్డి , లాలూ నాయక్ ,రాఘవ రెడ్డి , పాండు నాయక్, ముని నాయక్ పాల్గొన్నారు.

## పోలీస్ వాలీబాల్ క్రీడామైదానం ప్రారంభం

### సిబ్బందితో కలిసి ఉల్లాసంగా వాలీబాల్ ఆడిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి




ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయం నందు నూతనంగా నిర్మించిన వాలీబాల్ కోర్టును శనివారం జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా లు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీస్ శ్రమిస్తున్నారని అన్నారు. నిరంతరం విధుల నిర్వహణ వల్ల సిబ్బంది వత్తిడికి లోనవద్దన్నారు. పోలీస్ సిబ్బంది శారీరక దృడత్వం ముఖ్యమని అన్నారు. సమయం ఉన్నప్పుడు వ్యాయమం చేయడం ఆటలు ఆడటం మంచిదన్నారు. క్రీడలు శారీరక దృడత్వానికి మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. జిల్లా ఎస్‌పి కె.నర్సింహా మాట్లాడుతూ క్రీడల వల్ల ఒత్తిడిని దూరం చేయడం, ఫిటెన్స్ కాపాడటం కోసం సిబ్బంది సంక్షేమంలో భాగంగా క్రీడామైదానం నిర్మించినట్లు తెలిపారు. సిబ్బంది క్రీడా మైదానాలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్‌పి లు ఉల్లాసంగా వాలీబాల్ ఆడి సిబ్బందిలో ఉత్సాహం నింపారు. కోర్టు ఏర్పాటుకు కృషి చేసిన ఆర్ఎస్ఐలనపు, సిబ్బందిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి జనార్ధన్‌రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, కోదాడ డిఎస్‌పి శ్రీధర్‌రెడ్డి, సిఐల వెంకటయ్య, రాజశేఖర్, ఆర్ఐ నారాయణరాజు, ఆర్ఎస్ఐ సురేష్, రాజశేఖర్, కె.అశోక్, ఎం. అశోక్, మహేష్, సాయిరాం, అన్వర్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ లు, ఎఆర్ సిబ్బంది ఉన్నారు.

## ముందుకు సాగని డబుల్ రోడ్డు నిర్మాణ పనులు

### నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సదర్ కాంట్రాక్టర్

### పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



ప్రజాపక్షం/మునుగోడు: మునుగోడు మండల కేంద్రాన్ని అన్ని రకాల అంగులతో అభివృద్ధి చేయడానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 25 కోట్ల నిధులతోమునుగోడు చండూరు,మునుగోడుచౌటుప్పల్ ఈ రెండు రోడ్లను 66 ఫీట్ల వెడల్పుతో డివైడర్ సెంట్రల్ లైటింగ్ ఫుట్ పాత్ నిర్మించేందుకు సంవత్సరం కిందట శంకుస్థాపన చేశారు. అధికారులు రోడ్డును మధ్య నుంచి అటు 33ఫీట్లు, ఇటు 33 ఫీట్లలతో మార్కింగ్ చేశారు. మార్క్ చేసిన వరకు మునుగోడు చండూరు,మునుగోడు చౌటుప్పల్ రోడ్‌లో ఉన్న దుకాణ యజమానులు స్వచ్ఛందంగా మార్కింగ్ చేసిన వరకు సొంత ఖర్చులతో తొలగించారు. గత ఐదు నెలల క్రితం పనులు ప్రారంభించిన సదర్ కాంట్రాక్టర్ మునుగోడుచౌటుప్పల్ రోడ్ లో ఇరువైపులా కొంతమేరకు మురికి కాలువలు నిర్మించి మునుగోడు చండూరు రోడ్‌లో ఇరువైపులా పనులను మొదలుపెట్టి మురికి కాలువలతో పాటు రెండు వైపులా కొత్త రోడ్డు ను వేసేందుకు ఇరువైపులా పాత మట్టిని తవ్వి ఒకవైపు మాత్రమే కొంతమేరకు కంకర పరిచారు మరోవైపు రోడ్డుని నిర్మించకుండా మూడు ఫీట్ల లోతులో వదిలివేయడంతో అటుగా వెళుతున్న ప్రయాణికులు ఇబ్బందులకు గురై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత శాఖ అధికారులు నిద్రమత్తుని వీడి రోడ్డు నిర్మాణ పనులు త్వరతగతిన చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మునుగోడు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## వన మహోత్సవంలో జిల్లా జడ్జి

ప్రజాపక్షం/ఉండవెల్లి: అల్లంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అల్లంపూర్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో శనివారం నాడు జోగులాంబ గద్వాల జిల్లా జడ్జి ప్రేమలత వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మిథున్ తేజ ఆధ్వర్యంలో విరివిరిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కాళీ ప్రదేశాల్లోని మొక్కలు నాటేందుకు సీనియర్ న్యాయవాదులు ఫారెస్ట్ అధికారులు సిబ్బంది విద్యాశాఖ అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.





## ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని పెంచాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/హాలియా(పెద్దవూర): ఇందిరమ్మ ఇండ్ల పురోగతి తక్కువగా ఉన్న మండలాలలో ఈ నెల 10 నాటికి 50 పురోగతి వచ్చేలా చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.శనివారం ఆమె పెద్దఊర ఎంపిడివో కార్యాలయంలో నాగార్జున సాగర్ నియోజక వర్గ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పై ఎంపిడివోలు,ఏఈ, ఏపిఎం, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.ఇల్లు మంజూరై నిర్మించుకోనెందుకు ఆర్థిక స్థితి లేని లబ్ధిదారుకు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా రుణ సహాయం అందించి ఇల్లు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఏ పి ఎం లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పూర్తిగా అర్హులే ఉండాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. అంతేకాక పాఠశాల ఆవరణ, వంటగది, స్టోర్ రూమ్ ను, పరిసరాలను, పరిశీలించారు. విద్యార్థులకు సరైన భోజనం విద్యను అందించాలన్నారు. ఆ తర్వాత ప్రాథమిక వైద్య ఆరోగ కేంద్రాన్ని సందర్శించి ఓపి రిజిస్టర్, ఏఎన్ సి, మందు ల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్ ఉన్నారు.

## ద్విచక్ర వాహనాల అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

ప్రజాపక్షం/నార్కట్‌పల్లి : నకిలీ తాళం చెవిలతో మోటర్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నల్లగొండ డివిజన్ డిఎస్‌పి కె శివరాం రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జర్గుతున్న బైక్ దొంగతనాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘాతో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో యన్నారం గ్రామానికి చెందిన మట్టిపల్లి శ్రీకాంత్ , మట్టిపల్లి వెంకన్న, మట్టిపల్లి అనిల్ నిందితులను అదుపులోకి తీసుకుని విచారించి 7 కేసుల్లో సుమారు 16 లక్షల విలువ గల 12 మోటర్ సైకిళ్లను స్వాదీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. బైక్‌లు పోయినవని వచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ ఐ క్రాంతి కుమార్ తన సిబ్బందితో పట్టణంలోని అమ్మనబోలు రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా సరియైన పత్రాలు లేనటువంటి బైక్ , అనుమానస్పదంగా తిరుగుతుండడంతో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించడంతో జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నట్లు ఒపుకున్నారు. ఇట్టి దొంగతనాలు తెలంగాణ లోనే కాకుండ ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా చేయడంతో వీరిపై కేసులు రెండు రాష్ట్రాలలో నమోదైనట్లు ఆయన వివరించారు. నార్కట్‌పల్లి సిఐ కె నాగరాజు ఆధ్వర్యంలో పట్టుబడి చేసిన నార్కట్‌పల్లి ఎస్ ఐ డి క్రాంతికుమార్‌ను డిఎస్‌పి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సి రాము, జవహర్, రమేష్, సత్యనారాయణ, కానిస్టేబుళ్లు సత్యనారాయణ, శ్రీకృష్ణ , శివ, తిరుమల్ లను జిల్లా ఎస్పీ అభినందించి నగదు ప్రకటించినట్లు తెలిపారు.

# క్రీడ

## 'చిన్నస్వామి'కి చిక్కులు..

### పోలీసులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేనా?



క్రికెట్‌ను ఎంతగానో ప్రేమించే బెంగళూరువాసులకు షాకింగ్ న్యూస్ తొక్కిసలాటతో అప్రతిష్ఠను మూటగట్టుకున్న చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు ఇప్పట్లో జరిగేలా లేవు. ఆర్సీబీ జట్టు విక్టరీ పరేడ్ సందర్భంగా 11మంది మృతికి దారితీసిన దురదృష్టకర ఘటనే అందుకు కారణం. కర్నాటక క్రికెట్ సంఘం చిన్నస్వామిలో ఆగస్టు 11 నుంచి మహారాజా టీ20 నిర్వహించాలనుకుంటోంది. కానీ, తొక్కిసలాట కేసుపై దర్యాప్తు కొనసాగుతున్నందున బెంగళూరు పోలీసులు మాత్రం అనుమతి ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం కేసీఏ పెద్దలు గట్టిగానే ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఒకవేళ గడువులోపు పోలీసులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వకుంటే.. అలుర్, వదయరార్ మైదానాల్లో మ్యాచ్‌లు ఆడించేందుకు సిద్ధపడుతోంది కేసీఏ.



## యశస్వీ, ఆకాశ్, సుందర్

# విధ్వంసం..

అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ విజేతను నిర్ణయించే ఓవల్ టెస్టులో సమిష్టిగా రాణించిన భారత జట్టు భారీ స్కోర్ కొట్టింది. ఆతిథ్య జట్టు బౌలర్లను వచ్చినవాళ్లు వచ్చినట్టు ఉతికేయగా.. కొండంత లక్ష్యాన్ని ముందుంచింది. మూడో రోజు ఓపెనర్ యశస్వీ జైస్వాల్(118) సెంచరీకి ఆకాశ్ దీప్ (66) తొలి అర్ధ శతకంతో విరుచుకుపడగా.. టీ సెషన్ తర్వాత రవీంద్ర జడేజా(53), వాషింగ్టన్ సుందర్(53) విధ్వంసక అర్ధ శతకంతో చెలరేగారు. జడ్డూ వెనుదిరిగాక టెయిలెండర్ల అండతో రెచ్చిపోయిన సుందర్ సిక్సర్లతో దడపుట్టించి జట్టు స్కోర్ 390 దాటించాడు. ధాటిగా ఆడబోయిన అతడు పదో వికెట్‌గా వెనుదిరగగా టీమిండియా ప్రత్యర్థికి 373 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఫలితాన్ని తేల్చే ఓవల్ టెస్టులో భారత బ్యాటింగ్ యూనిట్ గొప్పగా రాణించింది. ఒకరిద్దరూ విఫలమైనా.. ప్రత్యర్థికి సవాల్ విసిరే స్కోర్ చేసింది టీమిండియా. ఓవర్ నైట్ స్కోర్ 75/2తో మూడో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ మ్యాచ్‌పై పట్టుబిగించింది. రెండో రోజే మెరుపు బ్యాటింగ్‌తో అర్ధ శతకం బాదేసిన ఓపెనర్ యశస్వీ (118) మూడో రోజు అదే జోరు చూపించాడు. నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాశ్(66) నమ్మశక్యంకాని విధంగా క్రీజులో పాతుకుపోయాడు. ఇంగ్లాండ్ పేసర్ల ఎత్తుల్ని చిత్తు చేస్తూ యశస్వీ.. స్లిప్‌లో బంతిని బౌండరీ దాటిస్తుంటే ఫీల్డర్లు అయ్యో అని తల పట్టుకుంటున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 107 రన్స్ జోడించి మంచి పునాది వేశారు.

**తొలి హాఫ్ సెంచరీ..**

ఇంగ్లాండ్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్న ఆకాశ్ కెరీర్లో తొలి హాఫ్ సెంచరీ బాదాడు. ఓవర్టన్ ఓవర్లో అతడు బౌండరీతో ఫిఫ్టీ సాధించాడు. అతడు ఔటయ్యాక వచ్చిన కెప్టెన్ గిల్ ఎక్కువ సేపు క్రీజులో నిలవలేదు. కరుణ్ నాయర్ సైతం నిరాశపరచగా.. మాంచెస్టర్ హీరో రవీంద్ర జడేజా (53), ధ్రువ్ జురెల్ (34) బాధ్యతగా ఆడారు.ఏడో వికెట్‌కు 50 రన్స్ జోడించి ఆధిక్యాన్ని 300లకు చేర్చింది. అయితే.. ఆ తర్వాత బంతికే ఓవర్టన్ బౌలింగ్‌లో జురెల్ ఎల్బీగా వెనుదిరిగాడు. అయినా సరే వాషింగ్టన్ సుందర్ (53) జతగా జడేజా భారీ స్కోర్ అందించే పనిలో నిమగ్నమయ్యాడు. ధనాధన్ ఆడిన జడ్డూను టంగ్ ఔట్ చేయగా.. సుందర్ గేర్ మార్చి విధ్వంసం కొనసాగించాడు. టంగ్ వేసిన ఓవర్లో రెండు ఫోర్లు, సిక్సర్ బాదిన అతడు.. సూపర్ ఫిఫ్టీతో జట్టు స్కోర్ 390 దాటించాడు. కానీ, అతడి ఓవర్లోనే పెద్ద షాట్‌కు యత్నించిన సుందర్ మిడాన్‌లో క్రాలే చేతికి చిక్కాడు. దాంతో.. రెండో ఇన్నింగ్స్‌లో 396 వద్ద భారత జట్టు పోరాటం ముగిసింది.

## విడాకులపై పునరాలోచిస్తున్నాం

### ఇన్‌స్టా పోస్ట్‌తో హింట్ ఇచ్చిన సైనా

పెళ్లితో ముడిపడిన అనుబంధాన్ని తెంచుకోవడం అంత సులభం కాదంటారు పెద్దలు. అయితే.. ఎన్నో ఏళ్లు భార్యాభర్తలుగా ఉండి.. విడాకులతో దూరమవుతున్న జంటలు చాలానే. ఈమధ్యే తాము విడిపోతున్నామని చెప్పిన భారత బ్యాడ్మింటన్ ప్లేయర్ సైనా నెహ్వాల్ మాత్రం యూటర్న్ తీసుకుంది. భర్త పారుపల్లి కశ్యప్ నుంచి బ్రేకప్ విషయాన్ని పునరాలోచిస్తున్నానంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టింది సైనా. దూరం ఎన్నో పాఠాలు నేర్పిస్తుందంటూ ఇద్దరు కలిసి ఉన్న ఫొటోను షేర్ చేసిందామె.

జూలై 13న భర్త నుంచి విడిపోతున్నట్టు ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా సైనా వెల్లడించిన విషయం తెలిసిందే. అయితే.. నెల లోపే ఆమె తన నిర్ణయాన్ని మార్చుకుంది. భర్తతో కలిసి ఉండేందుకు సిద్ధమవుతున్నట్టు సైనా సోషల్ మీడియా పోస్ట్ ద్వారా చెప్పకనే చెప్పింది. 'కొన్నిసార్లు దూరం వర్తమానం గొప్పతనాన్ని మనకు తెలియజేస్తుంది. అందుకే మేము విడాకుల వార్తలపై పునరాలోచిస్తున్నాం' అని శనివారం సైనా పోస్ట్‌లో రాసుకొచ్చింది.



ఈ పోస్ట్ చూసిన చాలామంది.. వీరిద్దరూ మనసు మార్చుకున్నారని, దంపతులుగా కొనసాగేందుకు నిర్ణయించుకున్నారని అనుకుంటున్నారు. భారత బ్యాడ్మింటన్ స్టార్లుగా పలు టైటిళ్లు కొల్లగొట్టిన సైనా, కశ్యప్‌లు పదేళ్లపాటు ప్రేమలో ఉన్నారు. తమ అనుబంధాన్ని మరో మెట్టు ఎక్కిస్తూ 2018లో పెళ్లి చేసుకున్నారిద్దరూ.

# ఫోకస్ బిజినెస్



## కుప్పకూలిన 'వాల్‌స్ట్రీట్'



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచ దేశాలనేకాదు... అగ్ర రాజ్యాన్ని కూడా ఆర్థిక సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం కనిపిస్తున్నది. ట్రంప్ తాజా సుంకాలతో పాటుగా కార్మిక మార్కెట్ డేటాతో ఈనెల మొదటి రోజే (శుక్రవారం) స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. వాల్‌స్ట్రీట్‌లోని న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్ భారీ నష్టాలను నమోదు చేసింది. ప్రపంచ దేశాలపై ట్రంప్ సుంకాల దాడి, అమెరికా కార్మిక రంగంలో బలహీన సంకేతాలు స్టాక్ మార్కెట్ పతనానికి కారణమయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆందోళనకు గురయ్యారు. పెట్టుబడులను భారీగా ఉపసంహరించుకున్నారు. నెలల తరబడి న్యూయార్క్ మార్కెట్లు స్థిరంగా ఉన్న సమయంలో, ట్రంప్ చేపట్టిన మార్పులు, తీసుకుంటున్న నిర్ణయాలు గ్లోబల్ వాణిజ్యంపై మరోసారి గందరగోళ పరిస్థితులను సృష్టించాయి. ముఖ్యంగా, చైనా, మెక్సికో, ఇండియా వంటి కీలక వాణిజ్య భాగస్వామిక దేశాలపై అమెరికా భారీగా సుంకాలను విధించడం ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నది. ట్రంప్ తాజా సుంకాల వార్త మార్కెట్‌లో శరవేగంగా వ్యాపించింది. అదే సమయంలో అమెరికా కార్మిక శాఖ విడుదల చేసిన ఉద్యోగాల డేటా పెట్టుబడిదారులను నిరాశపరిచింది. జూన్, జూలై నెలల్లో ఉద్యోగాల సృష్టిలో స్పష్టమైన మందగమనాన్ని ఈ నివేదిక వెల్లడి చేయడమే ఇందుకు కారణం. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగ రంగంలో డిమాండ్ తగ్గుతున్నదనే సంకేతాలను ఇస్తోంది. నిరుద్యోగిత రేటు స్వల్పంగా పెరగడం కూడా పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేసింది. ఈ క్రమంలోనే స్టాక్ మార్కెట్ ఇండెక్స్ శుక్రవారం 1.6 శాతం పడిపోయింది. ఏప్రిల్ తర్వాత ఇదే అతి పెద్ద నష్టంగా పేర్కొంటున్నారు. మొత్తం మీద వారాంతంలో ఈ సూచీ 2.4 శాతం మేర తగ్గింది.

## పుంజుకున్న 'బులియన్'

స్వల్ప కాలం స్తబ్దంగా ఉన్న బులియన్ మార్కెట్ ఈవారం ఒక్కసారిగా పుంజుకుంది. బంగారం, వెండి ధరలు పరుగులు తీశాయి. శనివారం 100 గ్రాములు బంగారం ధర ఏకంగా రూ. 15,300 పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా పరిస్థితులు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే బంగారం ధరలు కూడా పెరిగిపోతున్నాయి. కొంత కాలం క్రితం ఒక్కసారిగా ఆకాశాన్నితాకిన బంగారం ధరలు, ఈ ఏడాది మొదటి త్రైమాసికం నాటికి ఎన్నడూ లేని విధంగా పెరిగాయి. స్టాక్ మార్కెట్లు నిత్యం ఆటుపోట్లను చవిచూస్తూ, గందరగోళ పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలో, పెట్టుబడిదారులు బంగారం, వెండిపై మొగ్గు చూపుతున్నారు. ద్రవ్యోల్బణం, యుద్ధాల భయాలు, ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ గందరగోళంతోపాటు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై విధిస్తున్న భారీ సుంకాలు సమస్యను పెంచుతున్నాయి. ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 24 క్యారట్ల గ్రాము బంగారం ధర 153 రూపాయలు పెరిగి, రూ.10,135 వద్ద ట్రేడ్ అవుతున్నది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర 9,290గానూ, 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.7,601గానూ ఉంది. గ్రాము 24 క్యారెట్ల బంగారం ధర, హైదరాబాద్, చెన్నై, ముంబయి, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.10,135కాగా, ఢిల్లీలో రూ. 10,150గా కొనసాగింది.



## మార్కెట్లపై ట్రంప్ టారిఫ్ ప్రభావం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించిన కొత్త టారిఫ్ జాబితా కారణంగా ప్రపంచ మార్కెట్ తీవ్రమైన ఆటుపోట్లకు గురైంది. భారత్‌కు కూడా దీని ప్రభావం తప్పలేదు. 'రెడ్ ఫ్రైడే'గా పేర్కొనదగిన ఈ వారం లావాదేవీలకు చివరి రోజైన ఆగస్టు ఒకటో తేదీన భారత స్టాక్ మార్కెట్లు నష్టాలను చవిచూశాయి. ఆరంభంలో కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ, క్రమంగా అమ్మకాల ఒత్తిళ్లు ఎదుర్కొన్నాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్ 585.67 పాయింట్లు పతనమై, 80,599.91 పాయింట్ల వద్ద స్థిరపడగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ 203 పాయింట్ల నష్టంతో 24,565 పాయింట్లుగా ముగిసింది. మొత్తం 69 దేశాలపై 10 నుంచి 41 శాతం వరకూ టారిఫ్‌లను పెంచే ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేసిన విషయం తెలిసిందే. గతంలో విధించిన 15 శాతం అదనపు సుంకాలు ఈనెల ఒకటో తేదీ నుంచి అమల్లోకిరాగా, అదే రోజు జారీ చేసిన ఉత్తర్వుల్లో 25 శాతం సుంకాలు విధించారు. ఆ నిర్ణయం ఈనెల 7వ తేదీ నుంచి అమలుకానుంది. అప్పటిలోగా అమెరికాతో భారత్ వాణిజ్య చర్చలు జరపడం, సుంకాలపై సానుకూల ఒప్పందం కుదరడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తున్నది. ఈ పరిణామం సహజంగానే భారత స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని నిపుణుల అభిప్రాయం. సోమవారం (ఆగస్టు 4) నుంచి స్టాక్ మార్కెట్ లావాదేవీలు తిరిగి ప్రారంభమైన మొదటి సెషన్‌లోనే మార్కెట్ల తీరుతెన్నులు ఏ విధంగా ఉంటాయనే విషయంపై ఒక అభిప్రాయం ఏర్పడవచ్చు. అయితే, ట్రంప్ నిర్ణయాల ప్రభావంతో ఆరంభం నుంచే మార్కెట్లపై అమ్మకాల ఒత్తిడి మొదలవుతుందనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొనసాగిస్తున్న వాణిజ్య యుద్ధ ప్రభావం డాలర్‌పైన కూడా కనిపిస్తున్నది. ఫోరెక్స్ మార్కెట్‌లో డాలర్ విలువ కూడా భారీ నష్టాలను ఎదుర్కొంటున్నది. అమెరికా

## ఫోరెక్స్‌పైనా ప్రభావం

ఆర్థిక భవిష్యత్తుపై మదుపరులలో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, సమీప భవిష్యత్తులోనూ ఇదే పరిస్థితి కొనసాగవచ్చనని పరిశీలకుల అంచనా. ఇకపై ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య సంఘర్షణలు తిరిగి తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక వృద్ధిలో మందగమనం సంకేతాలు కలిసి ఫోరెక్స్ మార్కెట్ సెంటిమెంట్‌ను కూడా దెబ్బతీశాయి. పెట్టుబడిదారులు తదుపరి ఫెడరల్ రిజర్వ్ సమావేశాన్ని, ట్రంప్ పరిపాలన నుండి రాబోయే మరిన్ని తక్షణ చర్యలను నిశితంగా గమనిస్తున్నారన్నది తాజా పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

'బిజినెస్' శీర్షికన ఇస్తున్న సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. పెట్టుబడులు లేదా లాభనష్టాలపై 'ప్రజాపక్షం' ఎలాంటి బాధ్యత వహించదు. నిపుణులను సంప్రదించి, మార్కెట్ తీరును సమీక్షించుకొని, వ్యక్తిగత బాధ్యతపై నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నాం.

# నిబద్ధత కలిగిన నేత బరిగెల వెంకయ్య

### వెంకయ్య స్మారక స్థూపాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర నాయకుడు ఉజ్జిని రత్నాకర్ రావు



**ప్రజాపక్షం/చండూరు :** పార్టీ సిద్ధాంతాలకోసం నిబద్ధతలో శుదిశ్వాస వరకు పోరాడిన నిరాడంబర జీవి, నిబద్ధత కలిగిన అమరజీవి బరిగెల వెంకయ్య అని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సిపిఐ సీనియర్ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా చండూరు మండలం కొండాపురం గ్రామంలో బరిగెల వెంకయ్య 2వ వర్ధంతి సందర్భంగా నూతనంగా నిర్మించిన ఆయన స్మారక స్థూపాన్ని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పార్టీ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కొండాపురం గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం కృషి చేసిన నాయకుడు బరిగెల వెంకయ్య అని అన్నారు. గ్రామంలో భూస్వాముల కు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల పక్షాన నిలబడి వారికి అండగా ఉన్న నికార్సయిన కమ్యూనిస్టు అన్నారు. గ్రామంలో ఇండ్లు లేని వారికి ఇండ్లు , భూమి లేని వారికి భూమి ఇప్పించిన నాయకుడు బరిగెల వెంకయ్య అని అన్నారు. రైతు సేవా సహకార సంఘం ఉపాధ్యక్షుడుగా రైతుల సమస్యలపై పోరాడిన నేతగా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. ఉజ్జిని రత్నాకర్ రావు మాట్లాడుతూ పేద ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం నిరంతరం పోరాటం చేసిన బరిగెల వెంకయ్య లేని లోటు ఈ ప్రాంతానికి తీరని లోటన్నారు. కమ్యూనిస్టు పార్టీ చేసిన ప్రతి పోరాటంలో ముందుండేవారని గుర్తు చేశారు. బరిగెల వెంకయ్య భౌతికంగా మన మధ్య లేకపోయిన వారి ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. రాబోయే సానిక సంస్థల ఎన్నికల్లో చండూరు మండలంలో ఎర్రజెండా రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. కాండాపురం సిపిఐ శాఖ కార్యదర్శి గడ్డం నవీన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, జిల్లా సమితి సభ్యులు తిప్పర్తి రాములు, మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు,ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగెల వెంకటేష్ , దోటి వెంకన్న, కర్నాటి వెంకటేశం, ఇరిగి సంజీవ, బండమీది వెంకన్న, సిహెచ్ ఊషయ్య, గడ్డం పరమేష్, పల్లె శంకరయ్య, శివర్ల లింగస్వామి, ఇరిగి గోపయ్య, బోయపల్లి అంజయ్య, గడ్డం యాదయ్య, బరిగెల శ్రవన్ కుమార్ , వెంకటదాస్, మోహన్ దాస్ ,వెంకయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల పక్షపాతి కమ్యూనిస్టు పార్టీ

### యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** పేద ప్రజల పక్షాన కమ్యూనిస్టు పార్టీ ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యదర్శికి, జిల్లా కార్యవర్గ సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బునాదిగాని కాలువ పనులను వెంటనే పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ ఉనికి చాటుకోవాలన్నారు. కార్యక్రమానికి ముందు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డికి, జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చెడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుల ముత్యాలు, కుసుమని హరిచంద్ర, ఎండి ఇమ్రాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసి కంటి లక్ష్మీ నరసయ్య, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, సహకార దర్శి ఎండి నయుం, మండల నాయకులు యాస బుచ్చిరెడ్డి, జల్ది రాములు, సుల్తాన్ పురుషోత్తం, జక్క దయాకర్ రెడ్డి, సోలిపురం లింగారెడ్డి, కసరబోయిన సత్తయ్య, గుర్రం రాజమణి బొబ్బల లాల్ రెడ్డి, కల్వల నరసయ్య, పంజాల వెంకటేశం, మజ్జిగ నరసయ్య, సోమనబోయి నరసింహ, మారుపాక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



## చీపురుగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్ డిమాండ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** విద్యార్థులకు సరైన ఆహారాన్ని అందించకుండా తీవ్ర ఇబ్బందుల పాలు చేస్తున్న చీపురుగూడెం హెచ్‌ఎం, వార్డెన్‌ను తక్షణమే విధుల్లో నుండి తొలగించాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏటిడబ్ల్యూఓ కార్యాలయ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ దమ్మపేట మండలంలోని చీపురుగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల్లో విద్యార్థులు ఆకలికి అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గిరిజన విద్యకు పెద్దపీఠ వేస్తూ వసతులు, ఆహారాన్ని సమకూరుస్తుంటే పర్యవేక్షించాల్సిన అధికారులు ప్రభుత్వ లక్ష్యాని నీరు గారుస్తున్నారని మండిపడ్డారు.విద్యార్థులకు ఆహార పదార్థాలు జీసిసి నుండి వస్తుంటే వాటిని అమ్ముకుంటూ గిరిజన విద్యార్థుల పొట్టకొడుతున్నారన్నారు. వార్డెన్,హెచ్‌ఎం కుమ్మక్కై మెనూ ప్రకారం ఆహారాన్ని అందించడం లేదని, గుడ్డు మొదలుకుని అరటి పండు, బిస్కెట్లు అందివ్వకుండా విద్యార్థులను నోరు కొడుతున్నారన్నారు. విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై ఐటిడిఏ పిఒ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వినతి పత్రం అందించిన వారిలో సహాయ కార్యదర్శి గుండాల సుజన్, జిల్లాసమితి సభ్యులు రాజ్ కమల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆమడ దూరంలో ఆదివాసీ గుడాలు

- ఆదివాసీల ఉసురు తీసిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్
- గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రాంమూర్తి నాయక్



**ప్రజాపక్షం/గూడూరు:** గత రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసి గుడాలను అభివృద్ధి పేరుతో గ్రామపంచాయతీలుగా చేసి ఆదివాసీలను సర్పంచులుగా నియమించినప్పటికీ ఆదివాసి గుడెంలు అభివృద్ధికీ మాత్రం ఆమడ దూరంగానే మిగిలిపోయాయని గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రాంమూర్తినాయక్ అన్నారు. శనివారం గూడూరు మండల కేంద్రంలో తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా రెండవ మహాసభ జిల్లా అధ్యక్షుడు లావుడ్య రాము నాయక్ అధ్యక్షతన శనివారం జరిగింది. గూడూరు మండల కేంద్రంలో భారీగా ర్యాలీ నిర్వహించి అనంతరం సభను నిర్వహించడం జరిగింది. ఈసభకు ముఖ్యఅతిథులుగా హాజరై గిరిజర సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర రాంమూర్తి నాయక్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో గిరిజనులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోన్నారని పరిపాలన సౌలభ్యం కోసం తండాలను గ్రామపంచాయతీలుగా చేసినప్పటికీ అభివృద్ధిలో మాత్రం ఏమాత్రం బిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. గిరిజనులు పోడు చేసుకున్న భూములను హక్కు పత్రాలు ఇస్తానని హామీ ఇచ్చి హక్కు పత్రాలు ఇవ్వకపోగా వారి హక్కులను కాలరాసే విధంగా అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ పోలీసులను పెట్టి గిరిజనులను తీవ్ర హింసలకు గురి చేసి వారి ఉసురుతీశాడని ఆరోపించాడు. అయితే 10 సంవత్సరాల పరిపాలనలో గిరిజనులకు మేలు జరగలేదని నిత్యం గిరిజనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నాయని అన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వంసైతం గిరిజనుల సమస్యలపై ఏమాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదని గిరిజనులకు రావలసిన పథకాలను ఇవ్వడంలేదని ఆరోపించారు. ఎలాగైతే కాంగ్రెస్ ప్రభుత్వం 40/శాతం బిసి రిజర్వేషన్ బిల్లుకు ప్రయత్నం చేస్తుందో గిరిజనులకు 10/శాతం రిజర్వేషన్ అమలు చేసి చట్టసభలో అవకాశం ఇవ్వలని ఆయన డిమాండ్ చేశారు. మన రాష్ట్రంలో గిరిజన జనాభా దాదాపు 40 లక్షలు ఉన్నాయని గిరిజనులు అనేక తెగలు ఆదివాసి గిరిజనులు లంబాడి, ఎరుకలు కోయలు వేరువేరు జీవనస్థితిలో జీవిస్తున్నారని అయితే వారంతా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆదివాసి బతుకులు దుర్భరమైన స్థితిలో ఉన్నాయన్నారు.గిరిజనులకు దక్కాల్సిన పథకాలు దక్కడం లేదని జల్ జంగిల్ జమీన్ నీరు అడవి భూమి రాజ్యంగం కల్పించిన సర్వహక్కులను పాలక ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని తెలంగాణ రాష్ట్రం ఏర్పాడితే గిరిజనుల తలరాతలు మారుతాయని కలలు కన్నామని కానీ కలలు కలలాగనే మిగిలిపోయాయని రాజ్యంగంలో గిరిజనులకు ఆదివాసులకు దక్కవలసిన వాటా రాజకీయంగా ఆర్థికంగా సామాజిక రంగాల్లో రిజర్వేషన్లు రావడంలేదని అన్నారు. ఆదివాసి గిరిజనులకు కేటాయించిన బడ్జెట్ వాళ్ళు అభివృద్ధి కోసం ఖర్చు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేవెళ్ల డిక్లరేషన్‌లో గిరిజనులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**సంపద కోసమే ఆదివాసీల హత్యలు**

కేంద్ర ప్రభుత్వం గత కొన్ని రోజులుగా చతీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో గిరిజన ప్రజలను మావోయిస్టు పేర్లతో ఎన్‌కౌంటర్ చేసి చంపేస్తున్నారని సుమారు ఈ మధ్యకాలంలో గిరిజన యువత భారీగా మృత్యువాత గురయ్యారని మహబూబాబాద్ సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారధి అన్నారు. కర్రెగుటల్లో ఉన్న సంపద కోసం బడా బాబులకు దానిని కట్టబట్టేందుకు అమాయక గిరిజనులను పోట్టన పెట్టుకున్నారని అటవీ ప్రాంతంలో నివసించకుండా చేస్తున్నారని ఆయన అన్నారు. మానుకోట జిల్లాలో బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తానని చెప్పి కేంద్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తుందని ఆరోపించారు.ఈపరిశ్రమ ద్వారా గిరిజనులకు ఆదివాసిలకు ఉద్యోగాలు వస్తాయని అన్నారు.

# కార్మికుల హక్కులు కాపాడేది ఎఐటియుసి మాత్రమే

### ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



**ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ :** సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న, లేకున్నా కార్మికుల పక్షాన నిలుస్తూ వారి హక్కులను కాపాడేది ఒక ఎఐటియుసి యూనియన్ మాత్రమేనని ఆయూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం ఏరియాలోని సిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన ద్వార సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. జూలై నెలలో ఆర్ఎల్‌సి దగ్గర జరిగిన అగ్రిమెంట్‌లో డిస్మిస్ అయిన జిఎంకు ఇటీలకు తిరిగి ఉద్యోగం ఇవ్వడానికి అగ్రిమెంట్ చేయించడం జరిగిందన్నారు. డైరెక్టర్ స్థాయిలో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో మెడికల్ అన్ఫిట్ అయినా మైనింగ్ సూపర్‌వైజర్లను సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వడానికి ఒప్పుకుందని పేర్కొన్నారు. కాకపోతే మొన్న జరిగిన మెడికల్ బోర్డులో మైనింగ్ సూపర్‌వైజర్లను అన్ఫిట్ అయినప్పటికి వారికి జనరల్ అసిస్టెంట్లు ఇచ్చారని, వారికి కూడా సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ ఇవ్వడానికి కంపెనీ ఒప్పుకుందని తెలిపారు. 2018 నుండి మెడికల్ అన్ఫిట్ సర్ఫేస్‌లో జనరల్ అసిస్టెంట్‌గా చేస్తున్న వారికి కూడా సూటబుల్ జాబ్ ఇవ్వడానికి కంపెనీ ఒప్పుకున్నట్లు, వాటికి సంబంధించిన సర్కులర్లు త్వరలో వస్తాయని అన్నారు. సింగరేణికి రావాల్సిన రూ. 40 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం పైన ఇక్కడి ప్రజా ప్రతినిధులు ఒత్తిడి తెచ్చి వెంటనే చెల్లించేలా చొరవ చూపాలని కోరారు. పెర్క్స్ అలవెన్సుల మీద ట్యాక్స్ చెల్లించే విధంగా, సొంత ఇంటి పథకం అమలు తదతర అంశాల పైన స్ట్రక్చర్ మీటింగ్‌లో య ఆజమాన్యం ఒప్పుకున్నట్లు, వాటి అమలుకు చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే శ్రీరాంపూర్‌లో ఎవరైతే కంపెనీ క్వార్టర్లలో నివసిస్తున్నారో వద్దనుకుంటే కంపెనీ వాపస్ తీసుకుంటుందని, వారికి క్వార్టర్ వెకేషన్ సర్టిఫికెట్ కూడా ఇస్తుందని పేర్కొన్నారు. దానికి సంబంధించిన సర్క్యులర్ త్వరలో రాబోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరి ఎస్కె బాజీ సైదా, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరి మోత్కూరి కొమరయ్య, జిఎం చర్చల ప్రతినిధులు ప్రసాద్ రెడ్డి, బద్రి బుచ్చయ్య, ఫిట్ సెక్రటరి తిరుపతి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరి సాయిరాజ్, మీడియా ఇన్చార్జి రాజ్ కుమార్, నాయకులు రమేష్, లచ్చయ్య, నారాయణ, ఓదేలు, మావో ఎలక్ట్రీషన్ ప్రభాకర్, రవి పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**ప్రజాపక్షం/పరిగి:** పరిగి మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్ చౌరస్తాలో బైకును డీసిఎం ఢీకొంది. బైక్‌పై ప్రయాణిస్తున్న వారిలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డీసిఎం డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలుస్తుంది. ప్రమాదానికి గురైన వారు బొంరాస్పేట్ మండల నాగిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన కొడిగంటి వెంకటయ్య ,లక్ష్మి లుగా గుర్తించిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఎరువుల అమ్మకాలు నమోదు చేయాలి



**ప్రజాపక్షం/నవాబ్ పేట్ :** రైతులకు అవసరం మేరకు యూరియా కోసం వెనువెంటనే ఇం డెంట్లు పెట్టుకోవాలని వికారాబాద్ వ్యవసాయ సంచాలకుడువెంకటేశం ఎరువు దుకాణదారులకు సూచించారు.శనివారం మండల కేంద్రం లోని ఎరువుల విక్రయ కేంద్రాల్లో ఎరువుల నిల్వలను వికారాబాద్ వ్యవసాయ సంచాలకుడు వెంకటేశం తనిఖీ చేశారు. నవాబ్ పేటలో ప్రవేట్ ఫర్టిలైజర్ దుకాణాలను, రైతు ఆగ్రో సేవా కేంద్రాన్ని, పిఎసిఎస్ లో ఎరువుల నిల్వలు విక్రయానికి సంబంధించి రిజిస్టర్లను క్లుప్తంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, రైతులకు అవసరం మేరకు యూరియా కోసం వెనువెంటనే ఇండెంట్లు పెట్టుకోవాలని యూరియా కొరత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని దుకాణదారులకు సూచించారు. రైతు వేదికలో వికారాబాద్ ఎడీఏ వెంకటేశం, మండల వ్యవసాయాధికారి జ్యోతి, ప్రసంగాన్ని తిలకించారు. ఏ కార్యక్రమంలో ఏఏఓలు పాల్గొన్నారు.

## కీసర సిఐకి అభినందనలు

**ప్రజాపక్షం/నాగారం:** కీసర పోలీస్‌స్టేషన్ నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయులును నాగారం మున్సిపాలిటీ సీనియర్ నాయకులు గూడురు ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఇందులో రాధాకృష్ణ,ముక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐ ఆంజనేయులును నాగారం బిజెపి యువ నాయకులు కౌకుట్ల రాహుల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, సాయికుమార్, సాయికిరణ్, వామన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన ఉండాలి




**ప్రజాపక్షం/చర్లపల్లి:** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మీడియేషన్,బాల్య వివాహలపై అవగాహన కార్యక్రమాన్ని కోర్టు ఆవరణలో నిర్వహించారు.జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్ శ్రీదేవి అధ్యక్షతన తెలంగాణ హైకోర్టు ,ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జడ్జి సామ్ కోషిలు పాల్గొని మధ్యవర్తిత్వం,బాల్య వివాహల ప్రాముఖ్యత గూర్చి వివరిస్తూ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రెటరీ పంచాక్షరీ,జిల్లా న్యాయమూర్తి తిరుపతి, సంస్థ జిల్లా కార్యదర్శి కిరణ్‌కుమార్,బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయ మూర్తులు,ఏఎస్‌హెచ్‌ఏ కమిటీ సభ్యులు,నల్సార్ యూనివర్శిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సుభిక్షంగా ఉండాలి

**ప్రజాపక్షం/బోడుప్పల్:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ శివాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో బోనాల జాతరకు ఆహ్వానం పలికారు. పలారం బండి కార్యక్రమం చేపడుతున్న బోడుప్పల్ శివాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు కొత్త శ్రీకాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శి జడిగె సుధాకర్ యాదవ్ వారు ఆదివారం సాయంత్రం బంగారం మైసమ్మ దేవాలయం నుండి బయలుదేరునని దీనికిగాను ప్రజా ప్రతినిధులకు, బోడుప్పల్ ప్రజానీకానికి సగర్వంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడారు. శివాజీ యూత్ క్లబ్ మాజీ అధ్యక్షులు, సలహాదారులు, కమిటీ మెంబర్స్ ఈగ వెంకటేష్ ముదిరాజ్, శ్రీరాములు, రమేష్, తలరి కృష్ణ యాదవ్, ముదిగొండ బిక్షపతి, కొత్త శ్రీశైలం యాదవ్, దాసరి రమేష్ యాదవ్,శ్రీరాములు, మహేష్, కాటేపల్లి సత్యం రెడ్డి, కళారి వెంకటేష్ యాదవ్, కటారి అశోక్ యాదవ్, జనిగే వెంకటేష్ యాదవ్, కొత్త వినోద్ యాదవ్, ఈగ మల్లేష్ ముదిరాజ్ ,తలారి మల్లేష్ యాదవ్, బజార్ కిరణ్ గౌడ్ లు ఆహ్వానం పలికారు.

## 5న విశ్వవిశ్వానిలో జాబ్ మేళా

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపాలిటిలోని విశ్వవిశ్వాణి గ్రూప్ ఆఫ్ ఇన్సిట్యూషన్స్‌లో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం శనివారం తెలిపారు. విశ్వవిశ్వాణి ఇన్సిట్యూషన్స్ ప్లేస్‌మెంట్ బాగస్వామి కన్సల్టెంట్‌తో కలిసి వచ్చే మంగళవారం ఆగష్టు 5న మెగాజాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటలకు ముగుస్తాయన్నారు. గ్రాడ్యుయేషన్ అర్హత కల్గిన ఫ్రెషర్లు సంబంధిత డోమైన్ అనుభవం ఉన్నఅనుభజ్ఞులైనఉద్యోగార్థులనునిర్వాహకులు ప్రోత్సహిస్తాయని చెప్పారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి

**ప్రజాపక్షం/తాండూర్ :** తాండూర్ ఖాంజపూర్ గుట్టలో రూ. 50లక్షలతో నూతనంగా నిర్మించే హిందు ఉత్సవ కేంద్ర సమితి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డిఎంఎఫ్‌టి నుండి నిదులు మంజూరు చేయిస్తాను అన్నారు. నియోజకవర్గంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తాం అన్నారు. తాండూర్ ఇఓ ఉన్న ఆలయాల అభివృద్ధికి నూతన కమిటీలు వేశం అన్నారు. జుంటుపల్లి , సీతారామచంద్ర స్వామి ఆలయం అభివృద్ధి ,ఎకంబరి దేవాలయంకు ప్రత్యేక రోడ్డు వేస్తాం అన్నారు.ఈ కార్యక్రమంలో హిందు ఉత్సవా కేంద్ర సమితి చైర్మన్ పట్ల నర్సింలు డిసిసిబి వైస్ చైర్మన్ రవి గౌడ్ , విజయలక్ష్మి ,సప్న , రాజుగౌడ్ , విజయలక్ష్మి , స్వప్న పరిమల్ , సంసత్ కుమార్ తదిరులు పాల్గోన్నారు.

## పనుల పరిశీలన



**ప్రజాపక్షం/వికారాబాద్:** రాష్ట్ర వైద్య విద్యా సంచాలకులు డాక్టర్ నరేందర్‌కుమార్ వికారాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. వికారాబాద్ జిల్లా వైద్య అధికారి లాలితాదేవి, సుపరింటెండెంట్ రాజ్యలక్ష్మి తో కలిసి రాష్ట వైద్య సంచాలకులు వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. సేవల విస్తరణ కొరకు వైద్యులకు సూచనలు చేశారు. పాత ఆసుపత్రిలో నిర్వహిస్తున్న మాతశిశు సంరక్షణ సేవలను పరిశీలించారు. రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిశీలించారు.

# రేషన్‌కార్డులు నిరంతర ప్రక్రియ

### రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/బంట్వారం/మర్పల్లి:** పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వ పని చేస్తుందని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం అన్నారు.మండల కేంద్రం లోని సుధాకర్ గౌడ్ ఫంక్షన్ హాల్‌లో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పోచారం వెంకటేశం ఆధ్వర్యంలో జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని, రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అని అన్నారు. రేషన్ కార్డు లేని వారు సంక్షేమ పథకాలు అందుకోలేకపోతున్నారని ప్రభుత్వం గుర్తించి అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్ కార్డు మంజూరు చేస్తుందన్నారు.బంట్వారం మండలానికి కొత్తవి మరియుమెంబర్ ఆడిషన్ మొత్తం 746 కార్డులు మంజూరు కావడం జరిగిందన్నారు. ప్రతి గ్రామానికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేశామని, వివిధ దశల్లో వాటి నిర్మాణం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో 95 లక్షల రేషన్ కార్డులకు ఉచితంగా సన్నబియ్యం అందజేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్దిదారులు ఇబ్బందులు ఎదుర్కొనకూడదనే ఉద్యేశంతో బిల్లులు కూడా సకాలంలో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ 10 లక్షల రూపాయలతో రాజీవ్ ఆరోగ్య శ్రీ, ఉచిత విద్యుత్, మహాలక్ష్మి వంటి పథకాలు అందించి దేశంలోనే అగ్రగామిగా నిలిచామన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు స్థాపించి ప్రారంభం చేసుకున్నామని, వాటిలో చదువుకున్న విద్యార్థులను ప్రపంచంలోనే గేమ్ చేంజర్స్‌గా నిలబెడతామని అన్నారు. జిల్లాలో గత పదేళ్ళుగా రోడ్ల పరిస్థితి దారుణంగా మారిందని గుర్తించి కొత్తగడి నుంచి వయా మోత్కుపల్లి, బార్వాద్ మీదుగా బంట్వారం, యాచారం ఎక్స్ రోడ్ నుంచిబంట్వారం,బంట్వారంనుంచి తొర్మామిడి గ్రామాలకు రోడ్లు మంజూరు కావడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో 60 లక్షల నుంచి కోటి రూపాయల వరకు సీసీ రోడ్లు వేయించామని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను ఆధునీకరణ చేయడానికి ప్ర యత్నాలు చేస్తునానని, చెరువుల ఆధునీకరణతో వ్యవసాయానికి ఉపయోగపడుతుందన్నారు. మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తహసిల్దార్ విజయ్ కూమార్, నయబ్ తహసిల్దార్ మహేష్ ఉన్నారు.

## 2,479 మంది బాల కార్మికులను రక్షించాం

### రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నెల రోజుల పాటు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ XI ద్వారా కమిషనర్ పరిధిలో 2479 మంది బాల కార్మికులను రక్షించటంతో పాటు 530 కేసులను నమోదు చేసి రాష్ట్రంలోనే అగ్రస్థానం దక్కించుకొందని రాచకొండ కమిషనర్ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు తెలిపారు. వీరిలో 2353 మంది బాలురు కాగా 126 మంది బాలికలు అని, 1077 మంది తెలంగాణా రాష్ట్రానికి చెందిన వారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 133 మంది, బీహార్, చత్తీస్‌ఘడ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, తదితర రాష్ట్రాలకు చెందిన 1269 మంది కాగా మరో 12 మంది నేపాల్ దేశస్తులని ఆయన వివరించారు. శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటి వరకు 3550 మంది బాలకార్మికులను రక్షించి 1002 కేసులు నమోదు చేసామన్నారు. నెల రోజుల పాటు జరిగిన ఆపరేషన్ ముస్కాన్‌లో కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 9 ప్రత్యేక బృందాలు రేయింబవళ్లు పని నిబద్ధతతో పని చేసాయని, బస్టాండ్‌లో భిక్షాటన చేస్తున్న బాలబాలికలతో పాటు ఇటుక బట్టీలు, బోర్ బావులు, నిర్మాణ స్థలాలు,మెకానిక్ దుకాణాలు పౌల్ట్రీ ఫామ్‌లు, గ్లాస్ వర్క్‌షాపులు, హార్డ్‌వేర్ దుకాణాలు, బ్యాంగిల్ తయారీ పరిశ్రమలు, కార్ వాషింగ్ సెంటర్లు లాంటి ప్రమాదకర ప్రదేశాల్లో చట్ట విరుద్ధంగా పనుల్లో పెట్టుకొని పని చేయిస్తుండగా వారిని గుర్తించి రక్షించారన్నారు. వీరందరిని విద్యా శాఖల సాయంతో ప్రాథమిక విద్యాకోర్సుల్లో చేర్పించామని కమిషనర్ తెలిపారు. బాల కార్మికులతో పని చేయిస్తే ససంబంధితులపై బిఎన్ఎస్ చైల్డ్ అడోలెసెంట్ లేబర్ ప్రోహిబిషన్ రెగ్యులేషన్ యాక్టు మేరకు కేసులు నమోదు చేయటంతో పాటు వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహిళా భద్రతా విభాగ డిసిపి ఉషారాణి నేతృత్వంలో ఎహెచ్‌టియు సిఐ దేవేందర్, బృందం, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటి చైర్‌పర్సన్లు, సభ్యులు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, కార్మిక శాఖ, అసోసియేషన్ ఫర్ వాలంటీర్ యాక్షన్, చైల్డ్ లైన్ సభ్యుల సాయంతో ఈ ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించామని, బాల కార్మికుల విషయాన్ని తమకు 100, 112, 1098 ద్వారా సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంల పలువురు పోలీసు అధికారులు, పాల్గొన్నారు.

## ఆలయంలో అన్నదానం

**ప్రజాపక్షం/కాప్రా:** బోనాల ఉత్సవాల్లో భాగంగా ఓల్డ్ మల్లాపూర్ శ్రీ ఈదమ్మ దేవాలయంలో ఉప్పలమ్మ పోతరాజు శిఖర ప్రతిష్ట మహోత్సవం శనివారం భక్తుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పాల్గొని అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని ఆంకాక్షించారు.

# ఫోర్జరీ పత్రాలతో ప్లాట్ల కబ్జాకు యత్నం

### విష్ణుపురి, శ్రీపాదకాలనీ ప్లాట్ల బాధితులు



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ఫోర్జరీ పత్రాలతో తమ ప్లాట్లను కబ్జా చేయడానికి కొందరు వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారని విష్ణుపురి,శ్రీపాద కాలనీ ప్లాట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మేడిపల్లి మండల ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌లో బాధితులు విలేకరుల సమావేశం నిర్వహించారు.వారు మాట్లాడుతూ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విష్ణుపురి, శ్రీ పాద కాలనీలో భూ యజమానుల నుండి పోగుల నరసింహారెడ్డి జిపిఏ తీసుకున్ని ప్లాట్లు చేసి అమ్మగా తాము ప్లాట్లను కొనుగోలు చేశాము. వాటికి ప్రభుత్వ నిబంధనల మేరకు ఎల్ఆర్ఎస్, మున్సిపల్ పర్మిషన్ తీసుకొని నిర్మాణం చేసుకోవడానికి తాముతమస్థలం దగ్గరకు వెళ్లగా జమాల్, కాశీం భూ యజమానులతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకొని దిలీప్‌రెడ్డి అనే వ్యక్తి బెదిరించి తమపై దౌర్జ న్యం చేస్తుండగా పోలీసులను ఆశ్రయించామన్నారు. కొందరు పోలీసులు అక్రమార్కులకే వత్తాసు పలికి వారికే సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికి పలుమార్లు పిఎస్‌లో ఫిర్యాదు చేసి కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్న వారికే పోలీసులువత్తాసుపలుకుతున్నారనివాపోయారు. సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తోట శ్రీనివాస్ రెడ్డి, ధర్మారావు,కే.వెంకటయ్య, రామారావు, జె.యన్. గౌడ్, ఎస్.సుజాత తదితరులు పాల్గొన్నారు.

**పోలీసులే దగ్గర ఉండి..**

తమకు న్యాయం చేయమని పోలీసులను ఆశ్రయించగా పోలిసులే దగ్గర ఉండి కబ్జా దారులకు సపోర్ట్ చేస్తున్నారనికాలనీవాసులు వాపోయారు. మేడిపల్లి సీఐ తమను నిందిస్తున్నారన్నారు.

**ఆరోపణలు అవాస్తవం**
**మేడిపల్లి సిఐ అర్ గోవింద్‌రెడ్డి**

స్థలం వివాదం విషయంలో తాము ఎవరికి మద్దతు ఇవ్వలేదు. ఘర్షణ వాతావరణం రాకుండా,ఇతరులకుఇబ్బంది కలుగకుండా పరిష్కారం చేసుకోవాలని ఇరు వర్గాలకు చెప్పటం జరిగింది. చట్టపరంగా విధులను నిర్వహిస్తున్నామన్నారు.

# ప్రభుత్వ పథకాలతో స్వయం ఉపాధి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో స్వయం ఉపాధి అవకాశాలు బోలెడు అవకాశాలు ఉన్నాయని, వీటి కోసం సెట్విన్ సంస్థ ఇస్తున్న వివిధ ఉపాధి సంబంధిత శిక్షణా కార్యక్రమాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ సూచించారు. ఉప్పల్‌లోని జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో మేరా భారత్ రంగారెడ్డి విభాగం ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. సెట్విన్ కోర్సులు అధునిక సాంకేతిక ఆధారంగా రూపొందించామని, వీటి ద్వారా యువత తమ కాళ్లపై తాము స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకొనేందుకు దోహదపడుతాయన్నారు. డిగ్రీ కోర్సులు చదువుతున్న వారితో పాటు పూర్తి చేసిన వారికి సైతం శిక్షణలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వ పథకాల ఉపయోగాల గురించి జిల్లా యువజన అధికారి టి.ఐజయ్య వివరించారు.మేడ్చల్ జిల్లా డిఆర్‌ఏడిపియం ఆనంద్, సర్చు ద్వారా యువత కిషోర సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎల్డీఎం శివప్రసాద్ ఎంఎస్‌ఎంఈలు మాట్లాడారు.

## మహాసభ విరాళాల కోసం అభ్యర్థన



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ జిల్లా గాజులరామారంలో ఆగస్టు 19 నుండి జరుగనున్న సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభలకు గాను శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్లు, వ్యాపారస్తులు, ప్రముఖులు, శ్రేయోభిలాషులను కల్సి ఉదారంగా విరాళాల అందించాలంటూ ఏఐటియుసి, రైతు సంఘ ప్రతినిధులు కలిసి అభ్యర్థన లేఖలందించారు. మహాసభల గౌరవ అధ్యక్షులు డిజి సాయిలు గౌడ్, ఏఐటియుసి రాష్ట్ర నాయకులు రవిచంద్రన్, శామీర్‌పేట మండల కార్యదర్శులు, రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, బికెఎంయు నేతలు పాల్గొన్నారు. జంగయ్య, ఆల్వాల్ మండల కార్యదర్శి ఏ.బాబు, శామీర్‌పేట మండల కార్యదర్శి డిజి నరేందర్ ప్రసాద్, మండల కౌన్సిల్ సభ్యుడు రమేష్, నరేంద్రచారి, వెంకటేష్, డి.చంద్రయ్య, ఏ.బాబు, కోమల, రమేష్‌సింగ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే పించన్లు సాధిస్తున్నాం

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**ప్రజాపక్షం / కొడంగల్:** ప్రభుత్వాలు మారుతున్న పాలకులు మారుతున్న నిరుపేదల పక్షన ఎంఆర్‌పిఎస్ సంఘం పోరాటాలు చేస్తు పించన్‌లు సాధిస్తుందని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం కొడంగల్ పట్టణంలోని కేఎస్‌వి పంక్షన్ హాల్‌లో దివ్యాంగుల మహాగర్జనసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతు తమ సంఘం అన్ని కులాలు మతాల్లోని పేదల తరపున పోరాడుతుందన్నారు. 18 ఏళ్లుగా ఉద్యమాలు చేస్తు దివ్యాంగులు, వృద్దులు, పించన్ దారుల కొసం ప్రభుత్వాలు ప్రతిపక్షాలతో సమన్వాయం చేస్తు పోరాడుతునే ఉన్నామని అన్నారు. మహాగర్జన ముగింపు కార్యక్రమం ఈ నెల 13వ తేదిన హైద్రాబాద్‌లోని ఎల్బి స్టేడియంలో నిర్వహించి పించన్‌లు సాధించుకుంటామన్నారు. సంఘ నాయకులు భీంరాజ్ మాదిగ కుటుంబ సభ్యులు గజమాలాతో సత్కరించారు. విహెచ్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, అందె రాంబాబు, ఎంఆర్ఎపిఎస్ జాతీయ కార్యదర్శి కోళ్ల శివమాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకులు సోట్ట నరేంద్రమాదిగ,కొల్లి నాగేశ్వరరావు, బికె నర్సింహా, శ్యామ్‌ప్రసాద్ ఉన్నారు.

## బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** బెస్ట్ అవలబుల్ పాఠశాలల్లో (డే స్కాలర్) ఒకటో తరగతి నుండి జిల్లాలోని షెడ్యూల్ కులాల బాల బాలికల నుండి 2025–26 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు ధరఖాస్తులు సమర్పించాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కోరా రు. 5 నుండి ఆరేళ్ల వయస్సు కలిగి ఉండాలని, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వాస్తవ్యులై ఉండాలని, అభ్యర్థుల తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాం తాల వారికి రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంత వాసులకు రూ 2 లక్షల లోపు ఉండాలని, ఒక కుటుంబం నుండి ఒకే విద్యార్థికి ప్రవేశం ఉంటుందని, కుల, ఆదాయ ధృవపత్రాలు మీ సేవ ద్వారా పొంది ఉండాలన్నారు. ఈ నెల మూడవ తేదీ నుండి తమ కార్యాలయంలో 14వ తేదీలోగా ధరఖాస్తులు తీసుకొని అదే రోజు సాయంత్రం 5 గంటల లోపు పూర్తి చేసిన ధరఖాస్తు ఫారాలను కార్యాలయంలో నేరుగా సమర్పించాలని,వచ్చిన ధరఖాస్తుల్లో ఈ నెల 25న లాటరీ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. జిల్లాలో బెస్ట్ అవలబుల్ పాఠశాలలుగా గుర్తించిన చింతల్‌లోని ఆర్ఎస్‌కె ఉన్నత పాఠశాల, కుషాయిగూడలోనిబ్రిలియంట్ గ్రామర్ఉన్నత పాఠశాల,కూకట్‌పల్లిలోని బ్రిలియంట్ గ్రామర్ ఉన్నత పాఠశాల, బోడుప్పల్‌లోని పద్మశ్రీ ఉన్నత పాఠశాల, సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్, మల్కాజిగిరిలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల, తూంకుంటలోని విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల, జగద్గిరిగుట్టలోని శ్రీసాయి విద్యా నికేతన్ ఉన్నత పాఠశాలల్లో ఈ ప్రవేశాలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ‘జనహిత’ కాదు.. అది జనహత పాదయాత్ర

### మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/పరిగి:** జనహిత పాదయాత్ర కాదు జనహత పాదయాత్ర అని వికారాబాద్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యేఅనంద్ , పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి కలిసి మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర సాధన అనంతరం గడిన 10సంవత్సరాలలో బిఆర్ఎస్ పాలనలో ప్రగతి పథంలో నడిచిన తెలంగాణ రాష్ట ం అన్ని వార్గలకు సంక్షేమ అందిస్తూ ఆదర్శ రాష్టంగా నిలిచింది. ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ కాలం వెళ్లదీస్తూ ,ప్రజలను కొత్త నాటకాలతో మోసం చేస్తుంది. అందులో ఈ పాదయాత్ర ఒకటి పాదయాత్ర అంటే మాములు విషయమేం కాదు ఎన్నో అంశాలు ఇమిడి ఉంటాయి. పాదయాత్రకు అనుమతి అంత సులువేమీ కాదు అలాంటిది చిటికెలో ఎఐసిసి ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ అర్పటలు వద్దు అన్ని ముఖ్యమంత్రి ,మినాక్ష నటరాజన్ మధ్య విబేదాలకు ఈ పాదయాత్ర మరింత ఆజ్యం పోసింది.దీంతో టీపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ పాదయాత్రగా మార్చారు. ప్రస్తుతం రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వనికి పాలన చేతకావడం లేదు కాబట్టి ఈ పాదయాత్రలు చేస్తున్నాట్లు తెలుస్తుంది అని అన్నారు. త్వరలో సిఎంను మార్చే అవకాశం ఉందరి సంకేతం ఇస్తున్నట్టుగా మినాక్ష పాదయాత్ర ఉందని రాష్ట కాంగ్రెస్ నాయకులు సైతం అనుకుంటున్నారు. జనలను ఇబ్బంది పెట్టి రోడ్లపైకి వచ్చి రోడ్డు అక్రమంచారుకాని ,రైతులకు ,వృద్దులకు , నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ పాదయాత్ర చేయడం సిగ్గు చెటు అని అన్నారు. రాబోయే స్తానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు మీనాయకులకు తరిమి కొట్టి మీ ప్రభుత్వనికి గుణపాఠాన్ని చెప్పడనికి సిద్దంగా ఉన్నారు అని అన్నారు.

## రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** ఈ నెల మేడ్చల్ జిల్లాలో జరుగనున్న సిపిఐ 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలంటూ రాష్ట్ర వ్యవసాయ సంఘ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్ కోరారు.శనివారం జవహర్‌నగర్‌లోని దళిత భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఆవశ్యకతను గుర్తించి సాధించిన సిపిఐ రాష్ట్ర మహాసభకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, నానేలు, సాంసన్, ఏఐటియుసి మండల నాయకులు ఎల్లయ్య, డిహెచ్‌పిఎస్ మండల నాయకులు పి.నరసింహ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా **కాప్రా....** ఈసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మహాసభలకు సంబంధించి గోడపత్రికలను విడుదల చేసారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్ బోస్ మాట్లాడుతూ వందేళ్ల ప్రస్థానంతో సాగుతున్న పార్టీని మరింత మమేకం చేయటమే లక్ష్యమన్నారు.పార్టీ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.దామోదర్‌రెడ్డి,ఉప్పల్ మండల జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, నియోజకవర్గ సభ్యులు నారా నర్సింహ, లక్ష్మి నారాయణ, బాబురావు, మిరియాల సాంబశివరావు, జాన్ ఉన్నారు.

# రూ.100 కోట్లతో దేవాలయాల పునరాభివృద్ధి

### రాష్ట్ర దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్



**ప్రజాపక్షం / కొడంగల్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో వెలసిన పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయ పునరాభివృద్ధి చెందుతుందని రాష్ట్ర దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజా రామయ్యార్ అన్నారు. శనివారం ఆమె జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సమక్షంలో దేవాలయ పునరాభివృద్ధి పనులను ప్రారంబించేందుకు క్షేత్ర పరిశీలన చేశారు. ఆమె మాట్లాడుతు తిరుమల తిరుపతి దేవస్థాన తరహాలో ఆలయ అభివృద్ధి చేసేందుకు 100 కోట్లు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. తిరుపతి తరహాలోనే అన్ని రకాల పూజలు, ఉత్సవాలు కార్యక్రమాలు పూర్తి స్థాయిలో నిర్వహించి ఈ ప్రాంత భక్తుల ముక్తికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేవాలయ పునరాభివృద్దిలో ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ఇండ్ల స్థలాలను కేటాయించడం జరిగిందన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## వస్త్ర ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** శ్రావణమాసంలో నిర్వహిస్తున్న వస్త్ర ప్రదర్శనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం డివిజన్‌లోని చైతన్య నగర్ బిడి రెడ్డి గార్డెన్స్‌లో శ్రావణమాస ఎగ్జిబిషన్ సేల్ ఎస్3 ఈవెంట్స్‌ను నిర్వహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అనుకులమైన ధరలకు అందించి వారి మన్ననలు పొందాలని ఆకాక్షించారు. ప్రజలకు నాణ్యతమైన వస్త్రాలు అందించాలని నిర్వహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్స్ నిర్వహకులు సబితా రెడ్డి, శ్రీలత, స్వప్న, మహిళ నాయకులు పద్మరెడ్డి, కవితరెడ్డి, గీతరెడ్డి, పార్టీ నాయకులు శంకయ్య గౌడ్, సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## చేనేత కార్మికుల సంక్షేమం కోసం రూ.1000 కోట్లు : మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చేనేత కార్మికులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రూ.1000 కోట్లతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వ్యవసాయ చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో తెలంగాణ పద్మశాలి మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమైన హ్యాండ్లూమ్ చేనేత వస్త్ర ప్రదర్శనను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర హస్తకళల సంపదను ప్రోత్సహించడం, చేనేత బట్టలకు మద్దతుగా మూడు రోజులపాటు హ్యాండ్లూమ్ చేనేత వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు . అన్ని రకాల వస్తువులతో ప్రదర్శన ఏర్పాటు వృత్తిని ప్రపంచ వ్యాప్తంగా చేనేత కార్మికులు కళాకారులు త యారు చేసే ఉత్పత్తులను ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించేలా రాష్ట్ర ప్ర భుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. నేతన్నలకు ఏడాది మొత్తం పని కల్పించేలా ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. అదేవిధంగా చేనేత కార్మికుల రుణాలకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే నిధులను మంజూరు చేసిందని, త్వరలో ఈ ప్రక్రియ కూడ పూర్తి అవుతుందని చెప్పారు. బహ్యాండ్లూమ్ చేనేత వస్త్ర ప్రదర్శనను మహిళా విభాగాన్ని మంత్రి అభినందించారు.

## పిసిసిఎంగా ఇతి పాండే బాధ్యతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వేలో ప్రినిసపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పిసిసిఎం) గా ఐఆర్‌టిఎస్1995 బ్యాచ్‌కు అధికారిణి ఇతి పాండే శనివారం బాధ్యతలు స్వీకరించారు. పాండే అలహాబాద్ విశ్వవిద్యాలయం నుండి మనస్తత్వశాస్త్రంలో బంగారు పతక విజేతగా నిలిచారు. దక్షిణ మధ్య రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ముందు, పాండే భూసావల్ డివిజన్‌లో డివిజనల్ రైల్వే మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆమె సెంట్రల్ రైల్వే ప్రధాన కార్యాలయంలో చీఫ్ కమర్షియల్ మేనేజర్ (ప్యాసింజర్ సర్వీసెస్)గా కూడా పని చేశారు. ఆమె గతంలో సెంట్రల్, వెస్టర్న్ రైల్వేలలో చీఫ్ కమర్షియల్ మేనేజర్, డిప్యూటీ చీఫ్ కమర్షియల్ మేనేజర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, డివిజనల్ కమర్షియల్ మేనేజర్, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్‌తో సహా వివిధ ముఖ్యమైన పదవులలో సేవలను అందించారు. పాండేకు వాణిజ్య విభాగంలో నైపుణ్యంతో పాటు, భద్రత, విజిలెన్స్ విభాగాలలో పని చేసిన అనుభవం కూడా ఉందని రైల్వే చీఫ్ పిఆర్‌ఒ ఎ.శ్రీధర్ తెలిపారు. శ్రీమతి ఇతి పాండే భూసావల్‌లో డివిజనల్ రైల్వే మేనేజర్‌గా ఉన్నప్పుడు మారుమూల ప్రాంతాలలోని రైల్వే కార్మికులు, వారి కుటుంబాలకు అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణ అందించడానికి రుద్ర అనే 'హాస్పిటల్ ఆన్ వీల్స్' చొరవను ప్రవేశపెట్టారని తెలిపారు.

## షాద్‌నగర్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి
షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** షాద్‌నగర్ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణ కేంద్రలోని మల్లిఖార్జున కాలనీ పార్కు అభివృద్ధికి రూ. 40 లక్షలతో పనులు ప్రారంభించేందకు శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపాల్టీలో పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికులకు 166 మందికి ఉచితంగా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. షాద్‌నగర్ పట్టణంలోని అన్ని కాలనీల్లో అండర్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు మంచి నీటి సౌకర్యం కల్పించేందుకు తగిన నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. దసరా పండల పురస్కరించుకోని మున్సిపల్ కార్మికుల రూ. 2500 బోనస్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటి వైజ్ చైర్మెన్ బాబర్ అలిఖాన్, నాయకులు చెన్నయ్య, తిరుపతి రెడ్డి, రఘునాయక్, వెంకట్ రాంరెడ్డి, అందే మోహన్, శ్రీనివాస్ యాదవ్, జగన్ గౌడ్, రాజేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి ముందుంటా



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** చందానగర్ డివిజన్ పరిధీలోని దీప్తిశ్రీ నగర్ , శాంతి నగర్ కాలనీల మధ్య గల డ్రైనేజీ శానిటేషన్ పైపులైన్ (ఎస్‌టిపి)లలో తలేత్తిన సమస్యల పరిష్కారినికి పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడీ గాంధీ, జలమండలి అధికారులతో కలసి మరమ్మత్తు పునరుద్ధరణ పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ దీప్తిశ్రీ నగర్, శాంతినగర్ కాలనీల మధ్య గల శానిటేషన్ పైపులైన్‌లో తలేత్తిన సమస్యలను సూపర్ సక్కర్ యంత్రం ద్వార పనులను చెపట్టి, పైపులైన్‌లలో పెరుకుపోయిన చెత్త, చెదారంను తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా, త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలని అధికారులకు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కారించాడానికి ఏల్లపుడు ముందుంటనని ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వేంటనే సమస్యల పరిష్కారినికి పునుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ శిరీష, వర్క్ ఇన్స్‌పెక్టర్ కిష్టప్ప, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బిసి డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి

**ప్రజాపక్షం/గండిపేట:** కాంగ్రెస్ మోసపూరిత బిసిల రిజర్వేషన్‌లో 10 శాతం రిజర్వేషన్ ముస్లింలకు కేటాయించడం వ్యతిరేకిస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని నిలదీసి పూర్తిగా బిసిల కోసం రిజర్వేషన్ 42 కేటాయించాలని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాలో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస రెడ్డి నియోజకవర్గ పార్టీ నాయకులు డివిజన్ నాయకులు కార్యకర్తలతో కలిసి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామరెడ్డిలో ప్రకటించిన బిసి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, జోగి రవి, నారా గూడెం మల్లారెడ్డి రావుల భాస్కర్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్‌తదితరులు పాల్గొన్నారు.



# 'బస్తీతో దోస్తీ' హైడ్రా శ్రీకారం

కూలగొట్టుడు కాదు.. పర్యావరణ హిత నగర నిర్మాణమే హైడ్రా లక్ష్యం

కబ్జాలు చేసినవారే హైడ్రాపై దుష్ప్రచారం

హైడ్రా కమిషనర్ ఏవి. రంగనాథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ భూముల పరిరక్షణ, చెరువులు, కుంటల రక్షణ, విపత్తుల సహాయర్థం ఏర్పడిన హైడ్రా సంవత్సరకాలంలో అనేక ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను కాపాడింది. దూకుడుతో ముందుకు సాగుతున్న హైడ్రా తాజాగా 'బస్తీతో దోస్తీ' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'బస్తీతో దోస్తీ' కార్యక్రమాన్ని శనివారం టోలీచౌక్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి సమావేశం నిర్వహించింది. వివిధ బస్తీల నుంచి వచ్చిన ప్రజలను ఉద్దేశించి హైడ్రా కమిషనర్ ఏవి. రంగనాథ్ ప్రసంగించారు. కూలగొట్టుడు కాదు, పర్యావరణ హితమైన నగర నిర్మాణమే హైడ్రా లక్ష్యమని స్పష్టం చేశారు. హైడ్రా అంటే భయం కాదని, నగర ప్రజలందరికీ ఓ అభయం అని అన్నారు. చెరువులు, నాలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కబ్జా చేసిన వారు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని నగర ప్రజలకు సూచించారు. 5 ఎకరాల భూమిని కబ్జా చేసి అందులో పని వాళ్లకోసం ఒక షెడ్డు వేసి, దానిని తొలగించినప్పుడు వారిని ముందుంచి, డ్రామాలు ఆడి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న విషయాన్ని అందరూ గ్రహించాలని కోరారు. హైడ్రా ఎప్పుడూ పేదలు, సామాన్యుల పక్షమే అని, తా ము చేస్తున్న కార్యక్రమాలను పరిశీలిస్తే అర్థమౌతుందన్నారు. హైడ్రాను బూచిగా చూపించి వారి కబ్జాలను, ఆక్రమణలను కాపాడుకోడానికి బడాబాబులు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పేదలు ఎక్కడైనా ఇల్లు నిర్మించుకుని ఉంటే వాటిని తొలగించమ ని, ఒక వేళ తప్పని సరైతే వారికి ప్రత్యామ్నాయంగా ఎక్కడైనా నివాసాన్ని చూపించి మాత్రమే హైడ్రా ముందుకెళ్తుతందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విధానం కూడా ఇదేనని తెలిపారు. మూసీ నది సుందరీకరణతో హైడ్రాకు సంబంధం లేదని పునరుద్ఘాటించారు. నది ప్రవాహానికి అడ్డంగా మారిన కబ్జాలను తొలగించామని తెలిపారు. ఇలా 10 ఎకరాల మేర కబ్జా చేసి నెలకు రూ. కోటి ఆదాయం పొందుతున్నవారి భరతం పట్టామని చెప్పారు.

### నాలాలు, చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత..

నాలాలను, చెరువులను కాపాడడం అందరి బాధ్యతగా భావించాలని రంగనాథ్ అన్నారు. షేక్‌పేట, టోలీచౌక్ ప్రాంతంలోని విరాట్‌నగర్, బసవతారకం నగర్ ప్రాంతంలో నాలాల్లో పరుపులు, దిండులు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఏళ్లుగా పేరుకుపోవడంతో గతంలో వరద ముంచెత్తేదన్నారు. 10 రోజులుగా నాలాల పూడికను తొలగించడంతో ఇప్పుడు వరద సాఫీగా సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులైన స్థానిక కార్పొరేటర్లు, బస్తీల నాయకులతో పాటు, ప్రజలను హైడ్రా కమిషనర్ అభినందించారు. ఆరోగ్యమైన వాతావరణంలో బతకడం ఓ హక్కు అని, దీనిని అందరూ కలిసి సాధించుకోవాలన్నారు. చారిత్రక బుల్కాపూర్ నాలాను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో అందరూ సహకరించాలని కోరారు. అపోలో ఆసుపత్రితో పాటు పైన ఉన్న 20కి పైగా బస్తీల నుంచి మురుగు నీరు వస్తోందని, అంతా ఇక్కడ కలిసి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేయగానే ఇక్కడ పెద్దయెత్తున నాలా శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సిసిటివిలు కూడా నాలా పొడుగునా పెడతామని, చెత్త వేసిన వారిని స్థానికులే ఆపాలన్నారు. బస్తీతో దోస్తీ కార్యక్రమం ఆరంభం మాత్రమే అని, నగరంలోని 750 బస్తీలకు వరద ముప్పు ఉందని, అన్ని బస్తీల్లో నాలాలను పరిశుభ్రం చేసి ముంపు ముప్పును తప్పిస్తామని హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య తెలిపారు.

### పేదల పక్షం అనేది రుజువైంది : కార్పొరేటర్లు

హైడ్రా పేదల పక్షమని మరోసారి రుజువైందని జూబ్లీహిల్స్, షేక్‌పేట కార్పొరేటర్లు శ్రీ వెంకటేశ్, ఫరాజ్‌లు అన్నారు. అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట అభివృద్ధే ఇందుకు నిదర్శనమన్నారు. ఇక్కడ నాలాలు పొంగి నివాసాలను ముంచెత్తుతున్నాయనగానే, హైడ్రా కమిషనర్ చర్యలు తీసుకున్నారని చెప్పారు. 20 ఏళ్లుగా సిల్ట్ తీయడం జరగలేదన్నారు. హైడ్రా అంటే అపోహలు తొలగిపోయాయన్నారు. 10 రోజుల్లో రెండుసార్లు మా బస్తీలను సందర్శించి, నాలా పూడిక తీత పనులను స్వయంగా పరిశీలించిన హైడ్రా కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. హైడ్రా బస్తీతో దోస్తీ కార్యక్రమాన్ని తమ బస్తీల నుంచే మొదలు పెట్టడం సంతోషంగా ఉందని, పూర్తి మద్ధతు ఉంటుందని హామీనిచ్చారు.

## కింగ్స్‌వే ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

శిథిలావస్థకు చేరడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలంటూ ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్ రాష్ట్రపతి రోడ్డులోని చారిత్రాత్మక కింగ్స్‌వే ప్రభుత్వ పాఠశాలను హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ శనివారం పరిశీలించారు. వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న ఈ పాఠశాల శిథిలావస్థకు చేరుకుందని కథనాలతో కమిషనర్ క్షేత్ర స్థాయిలో పర్యటించారు. అక్కడి ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులతో మాట్లాడారు. పైనుంచి పెచ్చులూడి ప్రమాదకరంగా ఉందని నిర్ధారణకు వచ్చారు. ఈ పాఠశాల శిథిలావస్థకి చేరుకుందని, ప్రమాదకరంగా భావించి 7 ఏళ్ల క్రితం నోటీసులు ఇచ్చామని జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ డిడి నాయక్, అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పావని కమిషనర్‌కు తెలిపారు. విద్యాసంవత్సరం వృథా కాకుండా, పిల్లలకు ప్రత్యామ్నాయ తరగతులు చూపించాలని, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒ ప్రశన్న కోరారు. వెనువెంటనే పక్కనే ఉన్న మహబూబ్ స్కూల్ ట్రస్టుతో కమిషనర్ మాట్లాడి, కొన్నాళ్లపాటు ఇక్కడ తరగతి గదులు కేటాయించాలని కోరారు. ఈ ప్రతిపాదనను పరిశీలిస్తామ ని హైడ్రా కమిషనర్‌కు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. ఇదే విషయాన్ని జిల్లా కలెక్టర్, విద్యాధికారి దృష్టికి కూడా తీసుకెళ్లి, వెంటనే పాఠశాల నిర్మా ణం జరిగేలా చూస్తామని హైడ్రా కమిషనర్ చెప్పారు. వచ్చేవారం సెలవులలో కూల్చివేతలు జరపేలా చర్యలు తీసుకోవాలని హైడ్రా అధికారులను కమిషనర్ ఆదేశించారు.

## రెండు వేల గజాల పార్కును కాపాడిన హైడ్రా
కమిషనర్‌ను అభినందించిన ఆంజనేయనగర్ నివాసితులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎంతోమంది అధికారులను కలిసామని, ఎన్నో వినతి పత్రాలు ఇచ్చామని, లేఔట్ ప్రకారం పక్కాగా పార్కు స్థలమే అయినప్పటికీ, కబ్జాల పాలయ్యింది. చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రూ.50 లక్షలు నిధులు మంజూరైనా, కబ్జా చేసిన వారు అడ్డుకోవడంతో పనులు ఆగిపోయాయి. ఇలా దశాబ్దాలుగా పోరాడుతున్నాం. హైడ్రాను ఆశ్రయించాం. పార్కుకు కబ్జాల చెర నుంచి హైడ్రా విముక్తి కల్పింది. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి పిల్లలు ఆడుకునేందుకు స్థలం చూపింది. హైడ్రాకు ధన్యవాదాలు అని మూసాపేటలోని ఆంజనేయనగర్ కాలనీ నివాసితులు ఆనందం వ్యక్తం చేశారు. శనివారంపెద్దయెత్తున హైడ్రా కార్యాలయానికి తరలివచ్చి హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌తో పాటు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరోగ్యంగా ఉండేందుకే దోమల నివారణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర వాసులు ఆరోగ్యంగా ఉండేందుకు దోమల నివారణ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని అల్వాల్ సర్కిల్‌లో శనివారం భూలక్ష్మి నగర్, మచ్చబొల్లారం, భూదేవి నగర్ ప్రాంతాలలో వర్షాకాల పారిశుద్ధ్య, యాంటీ లార్వా కార్యక్రమాలను కమిషనర్ పరిశీలించారు. నగర వాసులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోకుండా చర్యలు మరింత ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ నివాసితులతో మాట్లాడి, చెత్త సేకరణ, యాంటీ లార్వా చర్యలు, కాలనీలో ఎదురవుతున్న ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కారం జరగేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల్లోగా చర్య నివేదిక సమర్పించాలన్నారు. పేరుకుపోయిన చెత్త లేదా భవన నిర్మాణ వ్యర్థాలు ఉంటే, వాటిని వెంటనే వాట్సాప్ నెంబర్ 81259 66586 కు ఫోటోల ద్వారా పంపితే తక్షణమే పరిష్కారం చేస్తామని తెలిపారు. దీనిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి రోజు క్షేత్రస్థాయిలో అధికారులు ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణ పరిష్కారించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ప్రజా,రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుంది

కేంద్ర బోగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/యాచారం:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, రైతు సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని కేంద్ర బోగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం యాచారం మండల కేంద్రంలోని రైతు వేధికలో పిఎం కిసాన్ సామ్మాన్ నిధి 20 వ విడత రూ.20,500 కోట్ల రూపాయలు విడుదల చేశారు. 9.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఉత్తర ప్రదేశ్ వారాణాసిలో పిఎం కిసాన్ 20వ విడత నిధులు విడుదల చేసారు .ఈ సందర్భంగా నిధులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. యాచారం మండల కేంద్రంలో రైతు వేధిక వద్ద ప్రత్యేక కార్యక్రమ రైతులకు అవగాహణ సదస్సు నిర్వహించారు. రైతులకు అవగహణ కల్పించారు.. కృషి విజ్ఞాన కేంద్రం క్రీడా అత్మ సంయుక్తంగా నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుందని అన్నారు. రైతులకు అండగ పిఎం కిసాన్ అత్మనిధి ద్వారా పంటకు రూ.2000 వేలు అంద జేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం జన్‌ధన్ యోజన కింద రైతుల సంక్షేమం కొసం విశేషంగా కృషి చేస్తుందన్నారు. కేద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రపంచ దేశాలలో ఆర్థికంగా 4వ స్థానంలో ఉంది. ఇప్పుడు 3వ స్థానంలోకి చేరుకుందని తెలిపారు. ప్రపంచ దేశాలలో భారత దేశం నేడు అగ్రగామిగా ఉందన్నారు గతంలో ప్రపంచ దేశాల సహాయం కోసం వరదల విపత్తు సమయంలో ఎదురు చూసేది నేడు చిన్నచిన్న దేశాలకు సహాకరించడంలో భారత దేశంలో ముందజలో ఉందన్నారు. పాల ఉత్పత్తిలో ప్రపంచంలో భారత దేశం ముందజలో ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ నేడు దుర్భరంగా తయారైందన్నారు.

తెలంగాణ ప్రభు త్వం అప్పులు చేసి ప్రభుత్వ ఉద్యోగులకు జీతా లు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి,ఇబ్రహింపట్నం మా ర్కెట్ కమిటి చేర్మేన్ గురునాథ్ రెడ్డి,మాజీ ఎంపిపి రాచర్ల వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ క్రీడా డైరక్టర్ వికే సింగ్, ఆర్‌డిఒ అనంతరెడ్డి, తహాశీల్దార్ అయ్య ప్ప, యాచారం మండల సహాకార సంఘం చైర్మన్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## మెడికల్ అడ్మిషన్లలో జిఒ 33 అమలు
రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలోని 2025–26 మెడికల్ అడ్మిషన్లలో స్థానికత కోసం తీసుకొచ్చిన జిఒ.నం.33ని అమలు చేయాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు పి.రమేశ్ కుమార్, ఎం.ఎస్.ఎన్. చారి మీడియాతో మాట్లాడారు. గతంలో ఆరోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడేళ్లలో నాలుగేళ్ల వరుసగా చదివిన వారిని లోకల్‌గా పరిగణించేవారని తెలిపారు. దీంతో ఇతర రాష్ట్రాల వారు 6,7,8,9 తరగతుల దొంగ సర్టిఫికెట్లుతెచ్చి, మెడికల్ అడ్మిషన్లు పొందారని పేర్కొన్నారు. దీంతో తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం జిఒ.33 తెచ్చిందన్నారు. ఈ జిఒపై 2024–25 అడ్మిషన్ల సమయంలో కొంతమంది హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లారన్నారు. స్థానికేతరులైన 135 మంది కోర్టుకు పోవడం వల్ల వారు అడ్మిషన్లలో పాల్గొన్నారని తెలిపారు. దీంతో వీరిలో 86 మంది ఎ క్యాటగిరీలో ఎంబిబిఎస్ సీట్లు, బి క్యాటగిరీలో మరికొంతమంది బిడిఎస్ సీట్లలో ప్రవేశాలు పొందారని తెలిపారు. దాదాపు 120కిపైగా సీట్లు స్థానికేతరులుగా కేటాయించడంతో రాష్ట్ర విద్యార్థులకు తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. ఇకనైనా కోర్టు అనుమతితో జిఒ 33 అమలయ్యేలా చూడాలని కాళోజీ వర్సిటీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు బి.అంజయ్య, ఆర్.మధు, ఆర్.నరసింహ రెడ్డి, జి.అనిల్ కుమార్ , డి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## పోస్టాఫీస్‌లో కరంటు సౌకర్యం కల్పించాలి

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో పోస్టాఫీస్‌లో కరంటు సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. పోస్టుమేన్ వృద్ధులకు, వితంతవులు, వికలాంగులకు పెన్షన్ ఇస్తున్న తరుణంలో మిషన్ బ్యాట్రి అయిపోవడం వల్ల అందరికి సకాలంలో పెన్షన్ ఇవ్వలేక నానా ఇబ్బందులు పడుతన్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు అడాల గణేశ్ దృష్టికి తెవడంతో తన సోతంగా 3 వేల రూపాయల ఖర్చు చేసి కరంటు సౌకర్యం కల్పించారు. గ్రామ పెన్షన్ దారులు అయనకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజా ప్రభుత్వం పేదల కోసం కృషి
ఇబ్రహీంపట్నం ఎంఎల్ఎ మల్ రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** ప్రజా ప్రభుత్వం ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తుందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎంఎల్ఎ మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు సంక్షేమ పథకాలలో భాగంగా శనివారం తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధి మన్నెగూడ జెఎంఆర్ గార్డెన్‌లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి హాజరై లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల ప్రక్రియ నిరంత రం కొనసాగుతుందని ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. ప్రభుత్వం నుం చి వచ్చే ప్రతి సంక్షేమ పథకం అర్హులైన లబ్ధిదారులకు చేరేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్, టి పి సి సభ్యులు కాకుమాను సునీల్, మాజీ కౌన్సిలర్, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కొషికే ఐలయ్య, నాయకులు గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్,మేథారి దర్శన్, సామ భీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య భద్రత జిహెచ్‌ఎంసి మొదటి ప్రాధాన్యత

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** మన్సూరాబాద్ డివిజన్ పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య రక్షణ కిట్లను డిప్యూటీ కమిషనర్ వంశీ కృష్ణ తో కలిసి హ్యాండ్ గ్లోజెస్, మాస్కులు, శానిటేజర్లులను పంపిణి చేసినారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ప్రతి పారిశుద్ధ్య కార్మికుడి భద్రత జి హెచ్ ఎంసి మొదటి లక్ష్యం అని అన్నారు కార్మికులు ఆరోగ్యం గా ఉంటేనే. జిహెచ్ ఎంసి ఆశయం నెరవేరతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ కనకయ్య నీలిమ నాంపల్లి రమేశ్వర్ వాకర్స్ సిబ్బంది పాలుగోన్నారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** మాదాపూర్‌లోని శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగాంగా తిల్లై నాట్లాలాయ గురువు కనిమొలి బాలగణేషం వారి శిష్య బృందంచే భరతనాట్య నృత్య ప్రదర్శన శిల్పారామం సందర్శకులను ఏంతగానో అలరించారు. కార్యక్రమంలోని నృత్య ప్రదర్శనలో పుష్పాంజలి, ఆలరింపు,బొమ్మ బొమ్మత, గణేశ కౌతం, మురగన్, కౌతం, జతిపర్వం , కీర్తన, జగజనని, భో శంభో, తిల్లాన అంశాలను నృత్య రూపకంలో నృత్యించి శిల్పారామం కు విచ్చేసిన సందర్శకులను ఏంతగానో అలరించారు. నృత్యప్రదర్శనలో మహశ్వేత, కిరుపహరి, సిరిచందన, ఆక్షయ, శ్రీ వల్లి, లాసియా, దీక్షిత, గీతికా, మొదలైన వారు భరతనట్య ప్రదర్శనలు ప్రదర్శించి అందరిని అకట్టుకున్నారు. కూచిపూడీ గురువులు శ్రీమతి రమణిసిద్ధి, శ్రీమతి మంథా మధవి శర్మ లు విచ్చేసి కళాకారులను అభినందించారు.

## పశువులను కాపాడినప్పడే రైతులు ఆర్థిక రంగంలో రాణింపు

**ప్రజాపక్షం/షాబాద్ :** పశువులను కాపాడినప్పుడే రైతులు అర్థికంగా రాణిస్తారని జిల్లా పశువైద్య అధికారి మధుసుదన్ అన్నారు. శనివారం షాబాద్ పశు వైద్య శాలను తనిఖీ చేశారు. అధికారుల హజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని ఆస్పలిగూడ గ్రామంలో రైతు విజయా రెడ్డి డైరీ ఫాంను సందర్శించారు. మండల వైద్య అధికారి స్రవంతి, పశు వైద్య సిబ్బందితో కలిసి అక్కడ ఉన్న పశువులకు వైద్య పరిక్షలు చేశారు. అనంతరం పశువులకు ఎలాంటి సేవలు చేయాలి, సీజన్ వ్యాధుల నివారణకు ఎలాంటి మందులు వాడాలి అనే అంశాల పై రైతులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని రైతులందరూ పశు సంపదను పెంపోందించుకోవడంతో మంచి లాభాలు వస్తాయని తెలిపారు. పశువుల పేడతో పొలంలో మంచి భూస్వారం పెరుగుతుందని చెప్పారు. పంటలు అధిక దిగుబడి వచ్చి రైతు అర్థికంగా రాణిస్తారని వివరించారు.

# రీల్



# అభిమానుల కళ్ళల్లో .. ఆనందం కోసమే కింగ్డమ్

మీడియా 'చిట్‌చాట్'లో విజయ్ దేవరకొండ

తెలుగు తెరపై వచ్చే భారీ బడ్జెట్ సినిమాలు ఇప్పుడు అన్నీ పాన్ ఇండియా సినిమాలే. స్టార్ హీరోలు ఎవరు చేసిన పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ చేస్తున్నారు. కథలను కూడా అదే స్థాయిలో ఎంపిక చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల విడుదలైన మరో తెలుగు పాన్ ఇండియా చిత్రం 'కింగ్డమ్'. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'కింగ్డమ్' చిత్రం విడుదలై సక్సెస్ ఫుల్‌గా నడుస్తోంది. ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండ మీడియాతో చిట్ చాట్ చేశారు.

*** 'కింగ్డమ్' సినిమాకి ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే ఏమనిపిస్తుంది?**

చాలా చాలా సంతోషంగా ఉంది. కేవలం తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల్లో మాత్రమే కాకుండా ఇతర రాష్ట్రాలలో, ఓవర్సీస్‌లో విశేష స్పందన లభిస్తుంది. ముఖ్యంగా మలయాళంలో ఈ స్థాయి స్పందన ఊహించలేదు. మలయాళ వెర్షన్ విడుదల చేయకపోయినా అక్కడి ప్రేక్షకులు ఇంతటి ప్రేమ చూపించడం చాలా ఆనందంగా ఉంది.

*** ఈ విజయంపై మీ స్పందన ఏంటి?**

కెరీర్ ప్రారంభంలో సినిమా హిట్ అయితే సెలబ్రేట్ చేసుకోవాలని ఆతృతగా ఉండేది. ఎందుకంటే ఒక సినిమా హిట్ అయితే ఇంకో సినిమా చేసే అవకాశం వస్తుందని ఆశ ఉంటుంది. పెళ్లి చూపులు హిట్ అయినప్పుడు ఇంకొన్ని అవకాశాలు వస్తాయని ఆనందపడ్డాను. కానీ, ఇప్పుడు అలా కాదు. సినిమా హిట్ అయితే ఆనందం కంటే కూడా మరిన్ని మంచి సినిమాలు చేయాలనే బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఒక్కరికీ సినిమా విడుదలకు ముందు ఎంతో కొంత ఒత్తిడి ఉంటుంది. 'కింగ్డమ్' విడుదలకు ముందు మాక్కూడా అలాంటి ఒత్తిడి ఉంది. ఎప్పుడైతే మొదటి షో పూర్తయ్యి, పాజిటివ్ వచ్చిందో అప్పుడు చాలా సంతోషం కలిగింది.

*** దర్శకుడు గౌతమ్ తిన్ననూరి గురించి ఏంచెప్పారు?**

గౌతమ్ కుటుంబ బంధాలను, ఎమోషన్స్‌ని డీల్ చేసే విధానం నాకు ఇష్టం. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామా అనే ఐడియా గౌతమ్ చెప్పినప్పుడు నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది. జెర్సీ లాంటి ఎమోషనల్ జర్నీలో కూడా మనకు హై ఇచ్చే మూమెంట్స్ ఉంటాయి. కింగ్డమ్ కోసం ఆసక్తికర కథనం రాశారు. ఓటింగ్ వేసే సన్నివేశం గురించి గౌతమ్ కథ చెప్పినప్పుడు ఓటింగ్ వేసే సన్నివేశాల గురించి చెప్పారు కానీ, ఆ ప్రాసెస్ ఎలా ఉంటుందో చెప్పలేదు. ఆ తర్వాత జాలా గన్స్, కత్తుల వంటి ఆయుధాలతో ఓటింగ్ ఉంటుందని చెప్పినప్పుడు కొత్తగా అనిపించింది. ఆ కొత్తదనమే ప్రేక్షకుల మెప్పు పొందడానికి కారణమైంది అనిపిస్తుంది.

*** 'కింగ్డమ్' కోసం మీరు ఎలాంటి హోం వర్క్ చేశారు?**

ఈ కథ విన్న తర్వాత అసలు ఆ కాలంలో ఎలా మాట్లాడేవారు, ఎలాంటి దుస్తులు వేసుకునేవారు వంటి విషయాలు తెలుసుకోవడం మొదలుపెట్టాను. రిఫరెన్స్ కోసం పలు వెబ్ సిరీస్‌లు చూశాను. అలాగే లుక్ పరంగానూ మరింత దృఢంగా కనిపించే ప్రయత్నం చేశాను. ఒక నటుడిగా ఎప్పుడూ ఫిట్ గా ఉండటానికి ఇష్టపడతాను. అయితే ఇందులో అన్నయ్యను తిరిగి తీసుకురావడం కోసం ఆ సామ్రాజ్యంలోకి అడుగుపెట్టే సమయంలో బల్క్ గా కనిపించాలనే ఉద్దేశంతో దాదాపు ఆరు నెలలు ప్రత్యేక కసరత్తులు చేశాను.

*** ఈ సినిమాకి మీకు వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్ ఏంటి?**

ప్రేక్షకులు, అభిమానులు ఈ సినిమాపై కురిపిస్తున్న ప్రేమనే నా దృష్టిలో బెస్ట్ కాంప్లిమెంట్. వాళ్ళకి సినిమా నచ్చడం ఎక్కువ సంతృప్తినీ ఇస్తుంది. చాలా రోజుల తరువాత అభిమానుల కళ్ళల్లో ఆనందాన్ని చూశాను. మొదటి షో పూర్తవ్వగానే చాలామంది ఫోన్లు చేసి 'మనం హిట్ కొట్టినం' అని చెప్తుంటే మాటల్లో చెప్పలేనంత ఆనందం కలిగింది.

*** సినీ పరిశ్రమ నుంచి ఎలాంటి ప్రశంసలు వచ్చాయి?**


సినిమా చూసి సుకుమార్ గారు ఫోన్ చేశారు. సినిమా తనకు ఎంతగానో నచ్చిందని చెప్పారు. నాకు సుకుమార్ గారంటే ఎంతో ఇష్టం. ఆయన నుంచి ప్రశంస రావడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. అర్జున్ రెడ్డి సమయం నుంచే నేను, సుకుమార్ గారు కలిసి సినిమా చేయాలి అనుకుంటున్నాం. ఆయనకు కూడా నేనంటే ఇష్టం. భవిష్యత్‌లో మా కలయికలో సినిమా వస్తుందని ఆశిస్తున్నాను. ప్రస్తుతం అయితే నా దృష్టి అంతా నా చేతిలో ఉన్న సినిమాలపైనే ఉంది.

*** కింగ్డమ్ విజయం మీ తదుపరి సినిమాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపబోతుంది?**

ఏ సినిమా చేసినా ప్రేక్షకులకు ఓ మంచి సినిమా ఇవ్వాలని లక్ష్యంతోనే చేస్తాను. తదుపరి సినిమాని రాహుల్ సాంకృత్యాయన్ దర్శకత్వంలో చేస్తున్నాను. నా సినీ జీవితంలో మొదటిసారి రాయలసీమ నేపథ్యంలో చేస్తున్న చిత్రమిది. నాకు సీమ యాస అంటే చాలా ఇష్టం. అనంతరం రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాను. ఆంధ్రా నేపథ్యంలో సాగే సరికొత్త కథతో ఆ చిత్రం ఉంటుంది. రాహుల్, రవి ఇద్దరూ ఎంతో ప్రతిభగల దర్శకులు. ఇద్దరూ అద్భుతమైన కథలను సిద్ధం చేశారు.

*** 'కింగ్డమ్ పార్ట్ 2' ఎలా ఉండబోతుంది? ఎప్పుడు ఉంటుంది?**

ఈ కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ప్రధానంగా కథ ఉంటుంది. కానీ, ఇందులో దేశభక్తికి సంబంధించిన అంశ ముంది. అలాగే, ఒక తెగకు చెందిన నాయకుడి గురించి ఉంటుంది. ఇలా ఇన్ని అంశాలను ఒకే భాగంలో చెప్పడం సాధ్యంకాదు. అందుకే రెండు భాగాలుగా చెప్పాలని నిర్ణయించుకున్నాం. తన అన్నయ్య శివ కోసం సూరి చేసిన ప్రయాణాన్ని మొదటి భాగంలో చూశాం. రెండవ భాగానికి సంబంధించి గౌతమ్ దగ్గర గొప్ప గొప్ప ఆలోచనలు ఉన్నాయి. మొదటి భాగంతో పోలిస్తే రెండవ భాగంగా ఇంకా అద్భుతంగా ఉండబోతుంది.



## 'సెలవిక కన్నమ్మా' అంటున్న 'మదరాసి'



తమిళ నటుడు శివకార్తికేయన్ హీరోగా బ్లాక్ బస్టర్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ ఇద్దరూ తొలిసారి కలిసి చేస్తున్న సినిమా మదరాసి. శ్రీ లక్ష్మి మూవీస్ ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మిస్తోంది. టాలెంటెడ్ నటి రుక్మిణీ వసంత ఇందులో హీరోయిన్‌గా నటిస్తోంది. శివకార్తికేయన్ పుట్టినరోజున విడుదలైన టైటిల్ గ్లిమ్స్ భారీ రెస్పాన్స్‌తో వస్తోంది. ఈ చిత్రానికి రాకింగ్ స్టార్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ కంపోజ్ చేశాడు. సెలవిక కన్నమ్మా అనే పాటను విడుదల చేశారు. దీంతో ఈ సినిమా ప్రమోషన్ మొదలు పెట్టారు. టీజర్ యాక్షన్ ప్యాక్డ్‌గా ఉండగా, ఈ పాట మాత్రం వెరీ డిఫరెంట్‌గా వుంది. లవ్ ఫెయిల్యూర్ సాంగ్ అయినప్పటికీ, డ్యాన్స్‌తో ప్రజెంట్ చేయడం ఆకట్టుకుంది. శ్రీనివాస మౌళి ఈ పాటలకు సాహిత్యం అందించారు. ఈ చిత్రంలో విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, విక్రాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రఫీ సుదీప్ ఎలమోన్ అందిస్తున్నారు. మదరాసి సినిమాను సెప్టెంబర్ 5న థియేటర్లలో విడుదల చేయనున్నారు.

## 'ఓజీ' తొలిగీతం విడుదల



'ఓజీ' పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్న 'ఓజీ' చిత్రం నుంచి మొదటి గీతం 'ఫైర్ స్టార్మ్' విడుదలైంది. ఈ గీతం నిజంగానే ఓ అగ్ని తుఫానులా ఉంది. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న 'ఓజీ' చిత్రానికి సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో పవన్ కళ్యాణ్ భీకరమైన గ్యాంగ్‌స్టర్ అవతార్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హాష్మీ, ప్రియాంక మోహన్, అర్జున్ దాస్, ప్రకాష్ రాజ్, శ్రియా రెడ్డి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్. తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రాకుడిగా రవి కె.చంద్రన్, ఎడిటర్ గా నవీన్ నూలి వ్యవహరిస్తున్నారు. తమన్ స్వరపరిచిన 'ఫైర్ స్టార్మ్' గీతం రోమాలు నిక్కబొడుచుకునేలా చేస్తోంది. ప్రముఖ నటుడు శింబు ఈ పాటకు తన శక్తివంతమైన గాత్రాన్ని అందించారు. ఉద్వేగం, ఉత్సాహంతో నిండిన ఆయన స్వరం.. ఈ పాటను మరోస్థాయికి తీసుకొనివెళ్ళింది. ఓజీ' చిత్రం సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.

## 'మిత్ర మండలి' నుంచి రెండో పాట విడుదల



ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ స్థాపించిన నిర్మాణ సంస్థ బి.వి.వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప్, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రంతో సోషల్ మీడియా సంచలనం నిహారిక ఎన్.ఎం. హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, 'కత్తందుకో జానకి' గీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి రెండవ గీతంగా 'స్వేచ్ఛ స్టాండు' అనే పాటను విడుదల చేశారు. 'మిత్ర మండలి' నుంచి మొదటి గీతంగా విడుదలైన 'కత్తందుకో జానకి' అందరూ సరదాగా పాడుకునేలా ఉండి, సోషల్ మీడియాలో ఒక ఊపు ఊపింది. ఇప్పుడు రెండవ గీతంగా వచ్చిన 'స్వేచ్ఛ స్టాండు' కూడా అంతే సరదాగా ఉంది.

## కెవిఎన్ ప్రొడక్షన్‌లో బాబీ చిత్రం

చిరంజీవితో వాల్తేరు వీరయ్య, బాలకృష్ణతో డాకు మహారాజ్ సినిమాలను రూపొందించిన దర్శకుడు బాబీ కొల్లి. ఇప్పుడు బాబీ తన తదుపరి చిత్రం కెవిఎన్ ప్రొడక్షన్స్ సంస్థలో చేయబోతున్నారు. ఇండియాలోనే ప్రతిష్టాత్మకమైన చిత్ర నిర్మాణ సంస్థగా పేరు గాంచిన కెవిఎన్ సంస్థతో బాబీ పాన్ ఇండియా సినిమా చేయనున్నారు. దీనికి సంబదించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బాబీ జన్మదినం సందర్భంగా ఈ ప్రకటనను విడుదల చేశారు. పెద్ద హీరోలకు మంచి కథలు రాస్తారని పేరు తెచ్చుకున్న బాబీ తానూ తీయబోయే తాజా చిత్రం కోసం కూడా ఓ పెద్ద హీరోను అప్రోచ్ అవుతున్నారు. టాక్సిక్, ఖైదీ 2 లాంటి భారీ ప్రాజెక్టులు చేస్తున్న కెవిఎన్ ప్రొడక్షన్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన నటి నటులు, సాంకేతిక వివరాలు త్వరలో ప్రకటిస్తారు.



## కుటుంబంతో చూసే చిత్రమిది – ప్రవీణ్

వినోదంతో పాటు ఎమోషన్‌ను మేళవించి.. ప్రేక్షకులను రెండున్నర గంటలు ఎంటర్‌టైన్ చేయడమే ధ్యేయంగా రూపొందిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్' ఈ సినిమా చూసిన వాళ్లకు ఓ మంచి విందు భోజనం ఆరగించిన ఫీల్ కలగబోతుందని చెబుతోంది చిత్ర టీమ్. తన నటనతో, డైలాగ్ డెలివరితో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న క్యారెక్టర్ ఆర్టిస్ట్, కమెడియన్ ప్రవీణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్, ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్, ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఆగస్టు 8న విడుదలకు సిద్ధమౌతుంది. ఇటీవల విడుదలైన ఈ చిత్రంలోని పాటలకు, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. కాగా ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈవేడుకకు హీరో సుధీర్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ.. ప్రవీణ్ నాకు వన్‌ఆఫ్ ఫేవరేట్ యాక్టర్. నన్ను ఏ దర్శకుడు అడిగినా నేను ప్రవీణ్ పేరు చెబుతాను. ఏ సినిమా అయినా ఎలా సక్సెస్ చేయాలో తపన పడుతుంటాడు. ప్రవీణ్ ఈ సినిమాతో హీరోగా మారుతున్నాడు అని అన్నారు.




## ఫేక్ అటెండెన్స్

(మొదటి పేజీ తరువాయి)

పంచాయతీ కార్యదర్శులు 'ఫేక్ అటెండెన్స్'నమోదు చేసినట్టు గుర్తించారు. ఇంత భారీ సంఖ్యలో ఫేక్ హాజరులు నమోదవ్వడం పట్ల ఉన్నతాధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఒక పంచాయతీ కార్యదర్శిని తక్షణమే సర్వీస్ నుంచి తొలగించగా, మరో 15 మంది రెగ్యూలర్ సర్వీస్‌కు చెందిన కార్యదర్శులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అనుమానం ఉన్న మిగిలిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించొద్దని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. కేవలం కార్యదర్శుల అటెండెన్స్‌ను పర్యవేక్షించాల్సిన ఎంపిఒల నిర్లక్ష్యాన్ని కూడా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నది. విధుల్లో శ్రద్ధ లేకుండా వ్యవహరించిన 47 మంది ఎంపిఒలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. త్వరలోనే వీరిపైన కూడా శాఖపరమైన చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. తప్పు రుజువైతే, ఎంతటి అధికారైనా ఉపేక్షించదనే ప్రభుత్వం సంకేతాలు జారీ చేసింది. అయితే ఆదిలాబాద్, జగిత్యాల, నారాయణపేట, సంగారెడ్డి జిల్లాల్లో ఒక కార్యదర్శిని సస్పెండ్ చేశారు. రంగారెడ్డిలో ఇద్దరు, వనపర్తిలో ఏడుగురు కార్య దర్శులను సస్పెండ్ చేశారు.

**ఫేక్ అటెండెన్స్‌లో.. సిద్దిపేటలో 70 మంది**

రాష్ట్ర వ్యాప్తంగా 553 మంది పంచాయతీ కార్యదర్శులు ఫేక్ అటెండెన్స్ నమోదు చేశారు. ఇందులో అత్యధికంగా సిద్దిపేటలోనే 70 మంది, నల్లగొండ 69, వికారాబాద్‌లో 63 మంది ఉన్నారు. జిల్లాల వారిగా( ఆదిలాబాద్26, భద్రాద్రి కొత్తగూడెం 42, జగిత్యాల22, జోగులాంబ గద్వాల 2, కామారెడ్డి43. ఖమ్మం21,మహబూబ్‌నగర్ 11,మంచిర్యాల 21, మెదక్ 20, నాగర్‌కర్నూల్ 9,నారాయణపేట2, నిర్మల్5, పెద్దపల్లి6, రాజన్న సిరిసిల్లా 32, రంగారెడ్డి11, సంగారెడ్డి 2, సూర్యాపేట48, వనపర్తి8, వరంగల్10, యాదాద్రి భువనగిరి 10 ఉన్నారు.

**ఎంపిఒలకు షోకాజు నోటీసులు...**

పంచాయతీ కార్యదర్శుల ఫేక్ అటెండెన్స్‌ను పర్యవేక్షించకుండా నిర్లక్ష్యం వహించిన 47మంది ఎంపిఒలకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులను జారీ చేసింది. ఆదిలాబాద్1,భద్రాద్రికొత్తగూడెం17, ఖమ్మం1, నల్లగొండలో 15, నారాయణపేట1, సిద్దిపేట1, వికారాబాద్5, యాదాద్రిభువనగిరి6 ఉన్నారు.

## అబద్ధాలకోరులే

(మొదటి పేజీ తరువాయి)

మార్పులు రావాలని ఆయన సూచించారు.

**కాళేశ్వరం అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలకు సంబంధించి నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి అందిన నేపథ్యంలో బాధ్యులైన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకోబోయే చర్యలు కక్ష సాధింపుగా వ్యవహరించొద్దన్నారు. ఆ నివేదికలోని అన్ని అంశాలను ప్రజలకు వివరించాలని, పారదర్శకంగా చర్యలు ఉండాలని నారాయణ ప్రభుత్వానికి సూచించారు. పొలిటికల్ ఇంజనీర్ల నిర్వహాకం వల్లనే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ దుస్థితి ఏర్పడిందని తెలిపారు. మాయల ఫకీర్ ప్రాణాలు ఎక్కడో చిలకలో దాగి ఉన్నట్టుగా, ప్రస్తుతం కమిషన్ నివేదికలో మాజీ సిఎం కెసిఆర్ బాగోతం దాగి ఉందని నారాయణ తెలిపారు.

**పార్టీ ఫిరాయింపులపై ఎన్నికల కమిషన్ ఏమి చేస్తోంది**

పార్టీల ఫిరాయించిన ఎంఎల్‌ఎలపైన మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినంత మాత్రాన జరిగేది ఏమి లేదని నారాయణ అన్నారు. స్పీకర్‌కు ఉన్న విశేష అధికారుల నేపథ్యంలో ఆయన తీర్పును ఎవ్వరూ కాదనే పరిస్థితి ఉండబోదని అన్నారు. ఎంఎల్‌ఎలు, ఎంపిల పార్టీ ఫిరాయింపులపై ఎన్నికల కమిషన్ అసలు ఏం చేస్తోందని నారాయణ ప్రశ్నించారు. ఎంఎల్‌ఎలు, ఎంపిలు ఎన్నికైనట్లు సర్టిఫికెట్లును అందజేసి, వారిని చట్టసభలకు పంపించేదే ఎన్నికల కమిషన్ అని, వారి వద్ద అన్ని వివరాలను ఉంటాయని, అలాంటిప్పుడు ఎవరైన పార్టీ ఫిరాయింపులకు పాల్పడితే ఎన్నికల కమిషన్ తక్షణమే సుమోటోగా స్వీకరించి అనర్హులుగా ప్రకటించాలని నారాయణ డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి ఏమైనా అడ్డంకులు అనుకుంటే, వాటిని సవరించాలని సూచించారు.

**ఫీజు రియాంబర్స్‌మెంట్ పెండింగ్ బిల్లులు చెల్లించాలి**

విద్యార్థుల ఫీజు రియాంబర్స్‌మెంట్ బిల్లులను నాలుగేళ్లుగా పెండింగ్‌లో పెట్టడమనేది నేరపూరితమైన తప్పుగా నారాయణ అభివర్ణించారు. తక్షణమే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు విద్యార్థుల రియాంబర్స్‌మెంట్ ఫీజులను చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్ల నుంచి ఫీజు రియాంబర్స్‌మెంట్ బిల్లులను చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సెప్టెంబర్ 22 నుంచి చండీఘర్‌లో సిపిఐ జాతీయ మహాసభలు జరగనున్నాయని, ఈ మహాసభల్లో బిజెపి వ్యతిరేఖ ఫ్రంట్ బలోపేతం చేయడంతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను ఉధృతం చేసే దిశగా కార్యచరణను రూపొందించనున్నట్లు నారాయణ వెల్లడించారు.

## ఏకీకృత అత్యవసర హెల్ప్‌లైన్ నెంబర్ 112




**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్, అగ్నిమాపక, మెడికల్, మహిళలు, పిల్లల భద్రత, రోడ్డు ప్రమాదాలు, విపత్తుల సమయంలో 112కు డయల్ చేసి తక్షణ సహాయం పొందవచ్చు. గతంలో ఇలాంటి తక్షణ సహాయ సేవలు పొందేందుకు వేర్వేరు అత్యవసర నంబర్లు పోలీస్ 100, ఫైర్ 101, అంబులెన్స్ 108, మహిళల కోసం 1090 ఉండేవి. ఇప్పుడు వీటన్నింటికీ బదులుగా 112 నంబర్‌ను ఉపయోగంలోకి తీసుకువచ్చారు. 112 డయల్ అనేది భారతదేశంతో పాటు అనేక ఇతర దేశాల్లో అమలులో ఉన్న ఏకీకృత అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్. బాధితులు 112కు ఫోన్ చేస్తే, వారి స్థానాన్ని జిపిఎస్ ద్వారా ట్రాక్ చేసి, సంబంధిత విభాగానికి సమాచారం పంపిస్తారు. అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుంటారు. స్మార్ట్‌ఫోన్‌లో పవర్ బటన్‌ను మూడు సార్లు త్వరగా నొక్కితే లేదా ఫీచర్ ఫోన్‌లో 5 లేదా 9 కీని ఎక్కువసేపు నొక్కితే కూడా 112కి ప్యానిక్ కాల్ వెళ్తుంది. ఈ నంబర్ ద్వారా 24 గంటలు అత్యవసర సహాయం లభిస్తుంది. ఈ నెంబర్‌పై బాధితులు ఏ భాషలో తమ బాధలను చెబుతారే ఆ భాష్కు చెందిన అధికారుల ద్వారా సహాయం అందుతుంది. డయల్ 112లో అన్ని భాషలకు చెందిన అధికారులు ఉంటారు. 112కి వచ్చిన కాల్‌లు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరతాయి. అక్కడి కాల్ సెంటర్ సిబ్బంది కాల్‌ను స్వీకరించి, బాధితుల అత్యవసర పరిస్థితిని తెలుసుకుని, జిపిఎస్ ద్వారా లొకేషన్‌ను ట్రాక్ చేస్తారు. తెలంగాణలో బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి)లో డయల్ 112 ఉంది. యూరోపియన్ యూనియన్ సహా అనేక దేశాల్లో కూడా 112 అత్యవసర నంబర్‌గా ఉపయోగిస్తారు. జిఎస్ఎం మొబైల్ ఫోన్లలో 112 నంబర్ ఎప్పుడైనా పనిచేస్తుంది, ఫోన్ లాక్‌లో ఉన్నా, కొన్ని సందర్భాల్లో సిమ్ లేకపోయినా కూడా. పోలీస్, అగ్నిమాపక, మెడికల్, మహిళలు, పిల్లలు, విపత్తుల సహాయం కోసం ఒకే నంబర్‌కు డయల్ చేయడం వల్ల ప్రజలకు గందరగోళం లేకుండా, వేగంగా సహాయం అందుతుంది. అత్యవసర పరిస్థితుల్లో ఇకపై 112 నంబర్‌కు డయల్ చేస్తే అన్ని రకాల అత్యవసర సేవలు ఒకే చోట నుండి అందుబాటులోకి వస్తాయి. ఇది దేశ వ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో పూర్తిగా అమల్లో ఉంది.

## భవిష్యత్ ఉద్యమాల రూపకల్పన

(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య గత మహాసభ నుండి నేటి వరకు జిల్లాలో కేంద్ర, రాష్ట్ర పిలుపులతోపాటు స్థానికంగా ప్రజలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ, కార్మికులు, యువత, విద్యార్థి, సమస్యలపై పార్టీ ప్రజా సంఘాలు పట్టిన పోరాటాలను వివరిస్తూ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. భవిష్యత్తులో గతంలో జరిగిన చిన్న చిన్న లోపాలను సరి చేసుకుని భవిష్యత్తులో జిల్లా ప్రజలకు చైతన్యవంతులు చేసి, జిల్లాలోని అన్ని ప్రాంతాలకు పార్టీని విస్తరించడంతోపాటు స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు, కె.రామస్వామి, కావలి నరసింహ, ఓరుగంటి యాదయ్య, బుద్ధుల జంగయ్య, రామకృష్ణ, ఎం.శ్రీను, నీలమ్మ, ఎం రియాజ్, బాతరాజు నరసింహ, ఆర్.యాదగిరి, విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యారా క్రాంతి,శివకుమార్, పవన్, సిపిఐ మొయినాబాద్ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, ప్రజానాట్యమండలి కళాకారులు,తదితరులు పాల్గొన్నారు. మహాసభకు ముందు మండల కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించారు.

## మూడవసారి సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా పాలమాకుల జంగయ్య



సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా పాలమాకుల జంగయ్య మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో జరిగిన సిపిఐ జిల్లా 17వ మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేసింది. 65 మందిని పూర్తి స్థాయి కౌన్సిల్ సభ్యు లు, 6 మందిని ఆహ్వానితులలుగా, మరో 6 మందిని క్యాండిడేట్స్ సభ్యులతోపాటు 21 జిల్లా కార్యవర్గ సభ్యులు కలిసి జిల్లా కార్యదర్శిగా మూడవసారి పాలమాకుల జంగయ్యను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించారు.

## యావజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే, రేవణ్ణను శుక్రవారం దోషిగా తేల్చగా తాజాగా శిక్షను ప్రకటించారు. అంతకుముందు ఇదే కేసులో తనకు తక్కువ శిక్ష వేయాలంటూ న్యాయమూర్తిని మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ వేడుకున్నాడు. ఆ సమయంలో అతడు బిగ్గరగా ఏడ్చాడు. శుక్రవారం తీర్పు ప్రకటించిన తర్వాత కూడా ప్రజ్వల్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. న్యాయస్థానం నుంచి బయటకు వచ్చిన అనంతరం కూడా వెక్కివెక్కి ఏడ్చాడు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో జెడిఎస్ పార్టీ అప్పటి ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు చెందినవిగా భావిస్తున్న అశ్లీల వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ కేసులో ఎంపి ప్రజ్వల్‌తో పాటు ఆయన తండ్రి రేవణ్ణపై కూడా లైంగిక వేధింపులు, దాడులకు సంబంధించిన అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే ప్రజ్వల్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ 2024 ఏప్రిల్ 28న ఓ మహిళ హోళెనరసిపుర ఠాణాలో ఫిర్యాదు చేసింది. గన్నిగడ ఫాంహౌస్‌లో తనపై రెండు సార్లు అత్యాచారం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా, అనంతరం కర్ణాటక ప్రభుత్వం కూడా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈలోగా ప్రజ్వల్ రేవణ్ణ దేశం వదిలి జర్మనీకి పారిపోయారు. తరువాత జరిగిన పరిణామాలతో చివరికి ఆయన బెంగళూరుకు రాగానే పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. దీనిపై ప్రత్యేక బృందం దర్యాప్తు చేసి 2వేల పేజీల ఛార్జిషీట్‌తో పాటు విచారణలో భాగంగా 123 ఆధారాలను సేకరించింది. ఈ కేసులో 14 నెలలుగా జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న ప్రజ్వల్‌ను న్యాయస్థానం దోషిగా తేల్చింది. ఇప్పుడు శిక్ష ఖరారు చేసింది.

## షరతులతో బెయిల్

(మొదటి పేజీ తరువాయి)

ఆ ఇద్దరు సన్యాసినులు ముగ్గురు గిరిజన బాలికలను మతమార్పిడీ చేయించేందుకు ప్రయత్నించారని బజరంగ్ దళ్, హిందూవాహిని సంఘాల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో గత నెల 25న పోలీసులు ఆ ఇద్దరు సన్యాసినులను అరెస్ట్ చేశారు. బెయిల్ కోసం సన్యాసినిలు ముందు దుర్గ్‌లోని సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. అయితే వారి బెయిల్ పిటిషన్‌లను సెషన్స్ కోర్టు తోసిపుచ్చింది. మానవ అక్రమ రవాణా కేసులలో నిందితులకు బెయిల్ మంజూరు చేసే అధికారం భారత న్యాయ సంహిత నిబంధనల ప్రకారం సెషన్స్ కోర్టుకు లేదని, కాబట్టి బెయిల్ కోసం ఎన్ఐఎ స్పెషల్ కోర్టును ఆశ్రయించాలని సెషన్స్ కోర్టు జడ్జి సూచించారు. దాంతో కేరళ సన్యాసినిలు ఎన్ఐఎ స్పెషల్ కోర్టును ఆశ్రయించి బెయిల్ పొందారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com